


# సత్యజిత్ రే

## కథలు



# సత్యజిత్ రే

## కథలు

అనువాదం

**మమత**

ప్రచురణ

కావ్య
పబ్లిషింగ్ హౌస్

తొలి ప్రచురణ : జూన్, 2013

ISBN: 978-93-83057-05-4

*ప్రచురణ*

**కావ్య పబ్లిషింగ్ హౌస్**

12-13-830/13/బి, ఫ్లాట్ నెం.103,
ఎస్.ఎస్.ఆర్. అపార్ట్‌మెంట్స్,
గోకుల్‌నగర్, తార్నాక,
సికింద్రాబాద్ - 500 017.
ఫోన్ : 9989599135
email : kavyaph11@gmail.com

For eBOOK: kinige.com

*ప్రతులకు*

మంచి పుస్తకం, తార్నాక, సికింద్రాబాదు, ఫోన్: 9490746614.
email: info@manchipustakam.in
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.
నవోదయ బుక్‌హౌస్, హైదరాబాదు.
మైత్రీ బుక్‌హౌస్, విజయవాడ.

***వెల రూ. 60/-***

*ముద్రణ*

చరిత ఇంప్రెషన్స్
హైదరాబాద్ - 500 020.



సత్యజిత్ రే అనగానే "పథేర్ పాంచాలి, షత్రంజ్ కి కిలాడి" వంటి సినిమాలు గుర్తుకొస్తాయి. రే వెండితెర మనిషి మాత్రమే కాదు. ఆయన ఒక చరిత్రకారుడు, కథకుడు, కవి, వాణిజ్య ప్రకటనలకు ఒరవడి దిద్దినవాడు ఇంకా మరెన్నో...

1921 మే 2న కలకత్తాలో రచయితల కుటుంబంలో పుట్టి, గురుదేవుడు రవీంద్రుడు నెలకొల్పిన "శాంతి నికేతన్"లో కళలు నేర్చుకుని, మనిషి ఊహాశక్తికి పదును పెట్టే బొమ్మలు గీసి, సినిమాలు తీసి, కథలు రాసి – అన్నింటిలో అంతర్జాతీయ కీర్తి గడించిన బహుముఖ ప్రజ్ఞాశాలి – ప్రాథమికంగా కళాకారుడు – సత్యజిత్ రే. తాతగారు ఉపేంద్ర కిశోర్‌రే ప్రారంభించగా మధ్యలో ఆగిపోయిన పిల్లల పత్రిక 'సందేశ్'ని 1961లో పునరుద్ధరించి – తన పలు రకాల పనుల మధ్య – అందులో ఎన్నెన్నో కథలు, కవితలు, వ్యాసాలు రాశారాయన. 1992 ఏప్రిల్‌లో రే చనిపోయారు.

ఈ పుస్తకంలో ఉన్నవి – సత్యజిత్ రే – పిల్లల కోసం రాసిన కథల్లో కొన్ని. ఈ కథలు – మనసులో బాల్యం పరిమళాల్ని కాపాడుకున్న పెద్దల కోసం కూడా...



# విషయ సూచిక


| | |
|---|---|
| లెక్కల సారు – రెక్కల గుర్రం | 5 |
| అయిదు రోజుల అతిథి | 21 |
| బ్రౌనుగారి బంగళా | 36 |
| ఫ్రిట్జ్ | 51 |
| గగన్ చౌదరి స్టూడియో | 62 |
| భూతో | 75 |
| అనుకూల్ | 81 |



# లెక్కల సారు – రెక్కల గుర్రం

**టిపు** తన భూగోళశాస్త్రం పుస్తకం మూసి గడియారం వైపు చూశాడు. తను కదలకుండా నలభై ఏడు నిమిషాలసేపు చదువుకున్నాడు. ఇప్పుడు మూడుగంటల పదమూడు నిమిషాలయింది. కొద్దిసేపు బయటకు వెళితే బాగుంటుంది కదా? ఆ విచిత్రమైన జీవి ఆరోజు ఇదే సమయంలో కనిపించాడు. టిపుకి ఎప్పుడు దిగులు అనిపిస్తే అప్పుడు మళ్ళీ వస్తానని అతడు అన్నాడు కదా! ఇప్పుడు తనకు దిగులుగా ఉంది. చాలాపెద్ద దిగులే. తను ఒక నిమిషం బయటకు వెళ్ళొద్దూ?

వద్దు. అమ్మ వరండాలోకి వచ్చింది. ఆమె కాకిని బెదరగొట్టడం తనువిన్నాడు. తరువాత కేన్‌కుర్చీ కిర్రుమంది. అంటే ఆమె ఎండకు కూర్చున్నట్లుంది. టిపు కాసేపు ఉండక తప్పదు.

అతడికి ఆ జీవి బాగా జ్ఞాపకమున్నాడు. అలాంటివాడిని ఎప్పుడూ చూడలేదు. చాలా పొట్టి. గడ్డాలు, మీసాలు లేవు – అయినా అతడు పిల్లవాడు కాడు. పిల్లలెవరూ అట్లాంటి గొంతుతో మాట్లాడలేరు. అతడు మరీ పెద్దవాడూ కాడు. అతడి చర్మం చాలా మృదువుగా ఉంది. అతడిది రోజా రంగు కలిసిన గంధపుచెక్క రంగు. నిజానికి టిపు అతడికి రోజా అని పేరు పెట్టాడు. అతడి పేరేంటో టిపుకి తెలియదు. తాను అడిగాడు. “నీకు చెప్పి ఉపయోగంలేదు. నాపేరు పలకాలంటే నీ నాలుక తిరగదు” అని ఆ జీవి చెప్పాడు.

టిపుకి అలా అంటే చాలా కోపం వచ్చింది. “నాకు నత్తి ఏమీలేదు. నేను విష్వక్సేనుడు లాంటి పదాలు పలకగలను. అంతకంటె పెద్దపదాలు కూడా పలకగలను. నీ పేరు పలకడానికి నా నోరు ఎందుకు తిరగదు?”

“ఒక నాలుకతో పలుకలేవు”

“అంటే నీకు రెండో మూడో నాలుకలు ఉన్నాయా”

“మీ భాషలో మాట్లాడడానికయితే ఒక్క నాలుక ఉంటే సరిపోతుంది”

ఇంటి వెనకవున్న ఎండిపోయిన ఎత్తయిన ‘షిముల్ చెట్టుకింద అతడు నిలుచుని ఉన్నాడు. అక్కడికి ఎక్కువమంది రారు. ఆ చెట్టు వెనక పెద్ద ఖాళీ మైదానం ఉంది. దానితరువాత వరిచేలు ఉన్నాయి. వాటి వెనక, చాలా దూరంలో కొండలు ఉన్నాయి. టిపు ఈ మధ్యన అక్కడ ఒక పొదలోకి ముంగిస దూరడం చూశాడు. ఈ రోజు, కొన్ని బ్రెడ్డు ముక్కలు తీసుకువచ్చాడు అక్కడ వెయ్యడానికి. వాటిని చూసి ముంగిస బయటకు వస్తుందని అనుకున్నాడు.

అతడి కళ్ళు హఠాత్తుగా చెట్టుకింద నిలుచున్న ఆ వ్యక్తిమీద పడ్డాయి.

“హలో!” అతడు నవ్వుతూ పలకరించాడు.

అతడు పాశ్చాత్య దేశస్థుడా? ఆ వ్యక్తి ఇంగ్లీషులో మాత్రమే మాట్లాడేట్లయితే తాను ఎక్కువసేపు అతడితో మాట్లాడలేనని టిపుకి తెలుసు. అందుకని అతడివైపు ఊరికే చూస్తూ నిలబడ్డాడు.

ఆ వ్యక్తి తనదగ్గరికి వచ్చి. “ఎందువల్లనయినా నీకు దిగులుగా ఉందా” అని అడిగాడు.

“దిగులా?”

“అవును!”

టిపు ఆశ్చర్యపడ్డాడు. ఇంతకుముందు ఎవరూ తనను అలాంటి ప్రశ్న అడగలేదు. “లేదు అలాంటిదేమీలేదు” అని అన్నాడు.

“నిజంగా?”

“నిజంగానే!”

“కాని నీకు ఇప్పుడు దిగులుగా ఉండాలే. లెక్కలు ఆ విషయమే చెప్పాయి.”

“ఎలాంటి దిగులు? ముంగిసను చూద్దామనుకున్నాను. కాని చూడలేకపోయాను అలాంటిదేనా?”

“కాదు, కాదు. నేను చెప్పినటువంటి దిగులుతో నీ చెవుల వెనుక నీలంగా మారాలి. నీ అరచేతులు తడారిపోవాలి.”

“అంటే చాలా ఎక్కువ దిగులన్నమాట.”

“అవును.”

“క్షమించాలి. నాకు అంత దిగులుగా లేదు.”

ఇప్పుడు ఆ వ్యక్తే దిగులుగా కనిపించాడు. అతడు తల ఊపి అన్నాడు –

“అంటే నేను ఇప్పుడిప్పుడే విడుదల కాలేను”

“విడుదలా?”

“అవును. విడుదల. నేను స్వేచ్ఛగా ఉండలేను”

“విడుదల అంటే ఏమిటో నాకు తెలుసు. నాకు దిగులుగా ఉంటే నీకు స్వేచ్ఛ వస్తుందా?” అని టిపు అడిగాడు.

ఆ వ్యక్తి టిపును చూశాడు. “నీకు పదిన్నర ఏళ్ళు ఉన్నాయా?”

“అవును”

“నీ పేరు మాస్టర్ తర్పణ్ చౌదరి కదూ?”

“అవును”

“అలా అయితే, పొరపాటేమీ లేదే”

అతడికి తన గురించి అన్ని విషయాలు ఎలా తెలిశాయో టిపుకి అర్థం కాలేదు. తిరిగి తనే అడిగాడు –

“అదినాకు మాత్రమే వర్తిస్తుందా? వేరే ఎవరైనా దిగులుగా ఉంటే సరిపోదూ?”

“లేదు. ఊరికే దిగులుగా వుంటే సరిపోదు. ఆ దిగులును నేను పోగొట్టాలి”

“కానీ ఎంతోమంది దిగులుగా ఉంటారు. మా ఇంటికి నికుంజ అనే బిక్షగాడు అప్పుడప్పుడు వస్తుంటాడు. తనకు ఈ ప్రపంచంలో ఎవరూ లేరని అతడు చెప్పాడు. అతడు నిజంగానే చాల దిగులుగా ఉన్నట్లున్నాడు.”

“ఊహు, అది పనికిరాదు” అతడు మళ్ళీ తల ఊపాడు. “తర్పణ్ చౌదరి..... పదేళ్ళ వయస్సు... ఇక్కడ దగ్గర్లో అదే పేరు. అదే వయస్సు ఉన్నవారు ఇంకెవరైనా ఉన్నారా?”

“నాకు తెలిసి లేరు.”

"అయితే, అది నువ్వే."

టిపు మరో ప్రశ్న అడగకుండా ఉండలేకపోయాడు.

"నువ్వు ఎలాంటి విడుదల గురించి మాట్లాడుతున్నావు? నువ్వు స్వేచ్ఛగానే తిరుగుతున్నట్లున్నావే?"

"ఇది నా దేశం కాదు. నాకు దేశబహిష్కార శిక్ష విధించారు"

"ఎందుకు?"

"నువ్వు మరీ ఎక్కువ ప్రశ్నలు అడుగుతున్నావు."

"నాకు తెలుసుకోవాలని ఉంది. నేను నిన్ను మొదటిసారి చూస్తున్నాను. అందువల్ల నువ్వు ఎవరో, ఏం చేస్తున్నావో, ఎక్కడ నివసిస్తావో, ఇక్కడ నీకు తెలిసిన వారెవరో తెలుసుకోవాలని ఉంది. తెలుసుకోవాలని ఉండడంలో తప్పులేదు కదా?"

"ఎక్కువ విషయాలు తెలుసుకుంటే జింజిరియా వస్తుంది."

ఆ వ్యక్తి నిజానికి జింజిరియా అనలేదు. అతడు చెప్పింది పలకడానికి కష్టంగా ఉంది. టిపు అది జింజిరియా అయి ఉండవచ్చు అని అనుకున్నాడు. అది ఎలాంటి జబ్బో ఆ దేవుడికే తెలియాలి.

అవునూ, అతడిని చూస్తుంటే ఎవరు గుర్తొస్తున్నారు? ఇతడు రంపుల్‌స్టిల్ట్‌స్కిన్నా? లేక స్నోవైట్ ఏడుగురు మరుగుజ్జుల్లో ఇతడొకడా?

టిపుకి దేవతల, దెయ్యాల కథలు అంటే చాల ఇష్టం. తాతయ్య తనకోసం కలకత్తా నుంచి అలాంటి కథల పుస్తకాలను సంవత్సరానికి రెండు మూడు తెచ్చేవాడు. టిపు వాటిని ఎంతో ఆత్రంగా చదివేవాడు. అవి చదివి ఏడు సముద్రాలను, పదమూడు నదులను, ముప్పై ఆరు పర్వతాలను దాటినట్లు ఊహించుకనేవాడు. తను రాజకుమారుడైనట్లు, తన మీద ముత్యాల కిరీటం పెట్టుకుని కత్తి పట్టుకున్నట్లు కలలు కనేవాడు. తరువాత ఎవరికీ దొరకని అత్యంత అమూల్యమైన వజ్రాలను సంపాదించినట్లు, డ్రాగన్‌తో పోరాడినట్లు ఊహించుకునేవాడు.

"వెళ్ళొస్తాను!" ఆ మనిషి చెప్పాడు.

అతడు అప్పుడే వెళ్ళిపోతున్నాడా?

"నువ్వు ఎక్కడ ఉంటున్నావో చెప్పనే లేదు!"

ఆ మనిషి టిపు మాటను పట్టించుకోలేదు.

"నీకు దిగులుగా ఉన్నప్పుడు మళ్ళీ కలుద్దాం" అని మాత్రం అన్నాడు.

"కాని నీకు ఎలా తెలుస్తుంది?"

దానికి జవాబు లేదు. ఎందుకంటే, ఆ వ్యక్తి అప్పటికే హైజంప్‌లో ప్రపంచ రికార్డులన్నింటినీ బద్దలు కొడుతున్నట్లుగా మల్బరీచెట్టు మీదుగా దూకి ఎటో మాయమైపోయాడు.

ఇదంతా ఆరువారాల క్రితం జరిగింది. టిపు ఆ మనిషిని మళ్ళీ చూడలేదు. ఇప్పుడు తనకు చాలా దిగులుగా ఉంది. తనకు ఆ మనిషి సహాయం చాలా అవసరం.

తన దిగులుకు కారణం కొత్తగా వచ్చిన లెక్కల మాష్టారు, నరహరి బాబు.

టిపుకి ఆయన మొదటినుంచీ నచ్చలేదు. ఆయన క్లాసుకు వచ్చిన మొదటి రెండు నిమిషాలూ తరగతిలోని పిల్లలను చూశాడు. ఎంత కఠినంగా చూశాడని! పాఠం మొదలుపెట్టేలోపల ఆ పిల్లల్నందర్నీ చంపేయాలన్నట్లు చూశాడు. అంతపెద్ద మీసాలున్నవాళ్ళను టిపు అంతకుముందు ఎప్పుడూ చూడలేదు. అతడి గొంతు ఎలా ఉందని! ఎంత పెద్దగా ఉందో అతడి గొంతు! అతడు అంతగట్టిగా ఎందుకు మాట్లాడుతాడు? ఎంతైనా, తరగతి గదిలో ఎవరికీ చెవుడు లేదే.

అసలు సంఘటన రెండు రోజుల తరువాత జరిగింది. ఆ రోజు గురువారం ఆకాశం మబ్బుపట్టి బయటంతా చలిగా ఉంది. టిపుకి భోజనం సమయంలో బయటకు వెళ్ళాలనిపించలేదు. అతడు అభిమన్యుడి కథ చదువుతూ తరగతి గదిలోనే ఉండిపోయాడు. లెక్కల మాష్టారు అటువైపుగా వెళుతూ తనను చూసి తరగతి గదిలోకి వస్తాడని ఎవరు అనుకుంటారు?

"అది ఏం పుస్తకం, తర్పణ్?"

కొత్త టీచరుకున్న జ్ఞాపకశక్తిని ఎంతైనా మెచ్చుకోవలసిందే. అతడికి అప్పుడే తరగతిలోని పిల్లలందరి పేర్లూ తెలుసు.

తర్పణ్‌కు కొద్దిగా భయం వేసింది. కానీ విరామ సమయంలో కథల పుస్తకాలు చదివితే ఎవరూ ఏమనరుకనుక ధైర్యం తెచ్చుకున్నాడు.

'బొమ్మ చెప్పిన కథలు, సార్!" అతడు చెప్పాడు.

"ఏదీ నన్ను చూడనీ"

టిపు పుస్తకాన్ని టీచరుకు ఇచ్చాడు. టీచరు ఆ పుస్తకాన్ని ఒక నిమిషంపాటు చూశాడు. తరువాత మండిపడ్డాడు. "రాజులు, రాణులు, రాజకుమారులు, దెయ్యాలు – వజ్రాలచెట్టుమీద ముత్యాలపక్షులు, అబ్రకదబ్ర – నువ్వు ఏం చదువుతున్నావు? ఇదంతా చెత్త! ఇలాంటి పనికిరాని విషయాలు చదువుకుంటూ లెక్కలెలా నేర్చుకుందామనుకుంటున్నావు?"

"కానీ ఇవన్నీ కథలు కదండి సార్!" టిపు నత్తి నత్తిగా అన్నాడు.

"కథలా? కథలకు అర్థాలు ఉండాల్సిన పనిలేదా? ఎవడికి ఏమి తోస్తే అది రాయడమేనా?"

టిపు అంత తొందరగా లొంగిపోదల్చుకోలేదు.

"ఎందుకు సార్. రామాయణంలో ఆంజనేయుడి గురించి జాంబవంతుడి గురించి ఉంటుంది. మహాభారతంలో కూడా దెయ్యాల కథలు, రాక్షసుల కథలు ఉంటాయి."

"వాదించకు" నరహరి బాబు అరిచాడు. "ఆ కథలన్నీ కనీసం రెండువేల ఏళ్ళకుపూర్వం మునులు రాశారు. మనిషి శరీరంతో ఏనుగు తలతో ఉన్న గణేశుడు, పదిచేతులు వున్న దుర్గామాత లాంటి వాళ్ళు నీ కథల్లో ఉన్నారు. ఆ చెత్త కాదు, నువ్వు మహనీయుల గురించి, శాస్త్రజ్ఞుల గురించి, మనిషి పుట్టుక గురించిన కథలు చదవాలి. అంటే నిజమైన సంగతులు ఉన్న పుస్తకాలు చదవాలి. నువ్వు ఇరవయ్యవ శతాబ్దంలోనే ఉన్నావు కదా? తెలివిలేని పల్లెటూరి జనం ఒకప్పుడు ఇలాంటి కథలు చదివేవారు. నువ్వు ఎందుకు చదువుతున్నావు? అలా చదివితే, పల్లెటూరికి వెళ్ళి అక్కడి బడిలో లెక్కలను పాటల్లాగ పాడుతూ నేర్చుకోవలసి ఉంటుంది. నువ్వు అలా చెయ్యగలవా?"

టిపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. తను ఒకమాట మాట్లాడినందుకు ఇంతపెద్ద ఉపన్యాసం వినాల్సి వస్తుందని అతడు అనుకోలేదు.

"ఇలాంటి పుస్తకాలను మీ తరగతిలో ఇంకా ఎవరు చదువుతారు?" టీచరు అడిగాడు.

నిజం చెప్పాలంటే ఎవరూ చదవరు. షీతల్ ఒకసారి టిపు దగ్గర

"హిందుస్థాన్ కథలు" తీసుకుంది. మరుసటిరోజే ఆ పుస్తకం వెనక్కి ఇచ్చేస్తూ అంది. "ఈ కథలకంటే ఫాంటమ్ బొమ్మల కథలు చాలా బావుంటాయి!"

"ఎవరూ చదవరు, సార్" టిపు జవాబిచ్చాడు.

"ఉమ్మ్..... మీ నాన్నగారి పేరేంటి?"

"తారానాథ్ చౌదరి"

"మీ ఇల్లు ఎక్కడ ఉంది?"

"స్టేషన్‌రోడ్డు, నంబరు అయిదు"

"ఉమ్మ్" టీచరు ఆ పుస్తకాన్ని టిపు బల్లమీద పడేసి వెళ్ళిపోయాడు.

టిపు బడి అయిపోగానే నేరుగా ఇంటికి వెళ్ళలేదు. అతడు బడిదగ్గర ఉన్న మామిడిచెట్ల వెనక తిరుగుతూ విష్ణురామ్‌దాస్ ఇంటిదాకా వెళ్ళాడు. ఒక తెల్లటి గుర్రం గుంజకు కట్టేసి ఉంది. టిపు జమ్రూల్ చెట్టుకు ఆనుకుని నిలబడి గుర్రంవైపు పరధ్యానంగా చూస్తున్నాడు. విష్ణురామ్‌కు ఒక బీడీ ఫ్యాక్టరీ ఉంది. అతడు రోజూ ఫ్యాక్టరీకి గుర్రం మీద వెళుతుంటాడు. అతడికి యాభై ఏళ్ళు ఉన్నా గుర్రంమీద స్వారీ చేసే శక్తి ఇంకా ఉంది.

ఆ గుర్రాన్ని చూడడానికి టిపు చాలాసార్లు వచ్చేవాడు. కాని ఇప్పుడు అతని మనస్సంతా వేరేచోట ఉంది. కొత్తగా వచ్చిన ఆ లెక్కల మాష్టారు తనను కథల పుస్తకాలు చదవనివ్వడని అతడికి అనిపించింది. ఆ పుస్తకాలు లేకుండా తనెలా జీవించగలడు? ప్రతిరోజూ అవి చదువుతాడు. మాష్టారు చెత్త, పనికిరానివి అని చెప్పిన కథలంటే తనకు మరీ ఇష్టం. తను ఆ పుస్తకాలు చదువుతున్నందువల్ల తనకు లెక్కలురాకుండా పోవట్లేదు కదా? పోయినసారి తనకు లెక్కల్లో యాభైకి నలభై నాలుగు మార్కులు వచ్చాయి. తన పాత లెక్కల టీచరు, భూదేవ్‌బాబు అలా పుస్తకాలు చదువుతున్నందుకు తనను ఎప్పుడూ తిట్టలేదు.

చలికాలంలో తొందరగా చీకటి పడిపోతుంది. తను ఇంటికి త్వరగా చేరుకోవాలని టిపు అనుకున్నాడు. ఇంతలో అతడు చూసిన ఒక దృశ్యం అతడిని చెట్టువెనక్కి వెళ్ళి దాక్కునేట్లు చేసింది.

లెక్కల మాష్టారు, నరహరిబాబు తనవైపు వస్తున్నాడు. అతడి చంకలో ఒక పుస్తకం, గొడుగు ఉన్నాయి.

అంటే అతడు ఇక్కడికి దగ్గర్లో ఎక్కడైనా ఉంటున్నాడా? విష్ణురామ్ బాబు ఇంటి పక్కన ఇంకా ఐదు ఇళ్ళున్నాయి. ఈ ఇళ్ళ వెనుక హమ్లతుని తోట అనే పేద్ద ఖాళీ స్థలం ఉంది. ఆ తోటకు తూర్పువైపున ఒకప్పుడు ఒక సిల్కు ఫ్యాక్టరీ ఉండేది. ఆ ఫ్యాక్టరీ యజమాని హామిల్టన్ బాగా పనిచేయిస్తాడన్న పేరు ఉంది. అతడు ముప్ఫై రెండు ఏళ్ళపాటు ఫ్యాక్టరీకి మేనేజరుగా ఉన్నాడు. తరువాత ఫ్యాక్టరీకి దగ్గర్లోనే ఉన్న తన బంగళాలో చనిపోయాడు. అతడి పేరు అందరినోటా నాని చివరకు హమ్లతునిగా మారిపోయింది. ఆ తోటకు కూడా అదే పేరు స్థిరపడిపోయింది.

ఆ చలికాలపు సాయంత్రం చీకట్లు ముసురుతుండగా, టిపు జమ్రూల్ చెట్టు వెనక దాగి నరహరి బాబును చూస్తున్నాడు. అతడి ప్రవర్తన చూసి టిపుకి ఆశ్చర్యం కలిగింది. నరహరి బాబు గుర్రం పక్కన నిలబడి ఉన్నాడు. అతడు దానివీపు మీద మెల్లగా తడుతూ పెదవులతో విచిత్రమైన శబ్దాలు చేస్తున్నాడు.

అదే సమయంలో ఆ ఇంటి ముఖద్వారం తెరుచుకుంది. పొగచుట్ట చేతిలో పట్టుకుని విష్ణురామ్‌బాబు బయటకు వచ్చాడు.

"నమస్కారం" నరహరి బాబు గుర్రం మీద నుంచి చెయ్యితీసి వెనక్కి తిరిగి అన్నాడు.

విష్ణురామ్ బాబు ప్రతి నమస్కారం చేసి అన్నాడు, "ఒక ఆట ఆడదామా?"

"నేను అందుకోసమే వచ్చాను!" టిపు టీచరు జవాబిచ్చాడు. విష్ణురామ్ చదరంగం ఆడతాడని టిపూకి తెలుసు. అంటే టీచరు కూడా చదరంగం ఆడతాడన్నమాట.

"మంచిగుర్రం" నరహరి బాబు అన్నాడు. "దీన్ని ఎక్కడ సంపాదించారు?"

"కలకత్తాలో, శోభాబజారులో ద్వారిక్‌చిత్తర్ దగ్గర కొన్నాను. అది రేసుగుర్రం. అక్కడ దానికి పెగాసస్ అన్న పేరు ఉండేది."

పెగాసస్? అది బాగా పరిచయమున్న పేరు లాగానే ఉంది. కాని ఆ పేరు ఎక్కడ విన్నాడో గుర్తుకు రావడంలేదు టిపుకు.

"పెగాసస్, చాల, విచిత్రమైన పేరు!" లెక్కల మాష్టారు అన్నాడు.

"రేసు గుర్రాలకు మామూలుగా విచిత్రమైన పేర్లే ఉంటాయి. హ్యాపీ బర్త్‌డే, ఫర్గెట్ – మీ – నాట్...."

"మీరు ఈ గుర్రంమీద స్వారీ చేస్తారా?"

"అవును. చాలా బలిష్ఠమైన జంతువు. నన్ను ఒక్కరోజు కూడా ఇబ్బంది పెట్టలేదు"

నరహరిబాబు ఆ గుర్రం వైపే చూడసాగాడు.

"నేనూ ఒకప్పుడు గుర్రంమీద స్వారీ చేసేవాడిని."

"నిజమా!"

"మేము అప్పుడు షేర్‌పూర్‌లో ఉండేవాళ్ళం. మా నాన్నగారు డాక్టరుగా పనిచేసేవారు. ఇళ్ళకు వెళ్ళి వైద్యం చెయ్యడానికి గుర్రాన్ని ఉపయోగించేవారు. నేను అప్పుడు బడికి వెళ్ళేవాడిని. నాకు ఎప్పుడు వీలైతే అప్పుడు గుర్రం ఎక్కి స్వారీ చేసేవాడిని. ఓహ్. అది చాలా కాలం క్రితం సంగతి!"

"ఈ గుర్రంమీద స్వారీ చెయ్యడం మీకు ఇష్టమేనా?"

"నేను ఈ గుర్రం ఎక్కవచ్చా?

"వెళ్ళండి!"

లెక్కల మాష్టారు పుస్తకాన్ని, గొడుగును కిందపెట్టి గుర్రాన్ని కట్టిన తాడు విప్పడం చూసి టిపు ఆశ్చర్యపోయాడు. తరువాత అతడు దాని వీపుమీదకు ఒక్కసారిగా దూకి కాళ్ళతో దాని డొక్కల్ని తన్నాడు.

"ఎక్కువ దూరం వెళ్ళకండి" విష్ణురామ్ బాబు చెప్పాడు.

"చదరంగం బల్లను బయటకు తీసుకురండి. నేను తొందర్లోనే వచ్చేస్తాను!" నరహరిబాబు అన్నాడు.

టిపు ఇక ఆగలేదు. ఇది ఎలాంటి రోజు!

కానీ జరగవలసింది ఇంకా చాలా ఉంది.

అప్పుడు సాయంత్రం ఏడుగంటలవుతోంది. టిపు తన హోమ్‌వర్క్ పూర్తి చేసుకుని, కథలు చదువుతూ కూర్చున్నాడు.

అప్పుడే టిపు వాళ్ళనాన్న అతడిని కిందికి రమ్మని పిలిచాడు.

టిపు కిందికి వచ్చి ముందు గదిలో కూర్చుని వున్న నరహరి బాబును చూశాడు. అతడి రక్తం చల్లబడింది.

"మీ తాతయ్య నీకు ఇచ్చిన ఆ పుస్తకాలను మీ టీచరు చూడాలనుకుంటున్నారు వెళ్ళి వాటిని తీసుకురా" నాన్న చెప్పాడు.

అతడి దగ్గర అలాంటివి ఇరవై ఏడు పుస్తకాలు ఉన్నాయి. వాటిని అన్నింటిని తీసుకురావడానికి టిపు మూడుసార్లు తిరగాల్సి వచ్చింది.

వాటిని చూడడానికి టీచరుకు పదినిమిషాలు పట్టింది. అప్పుడప్పుడు తల తిప్పుతూ మధ్యలో 'హు' అంటూ చివరికి ఆ పుస్తకాలను పక్కకునెట్టి అన్నాడు, "చూడండి, చౌదరిగారూ, ఎన్నో సంవత్సరాలు ఆలోచించిన విషయం మీకిప్పుడు చెబుతున్నాను. దేవతల కథలో, జానపద గాథలో మీరు ఏ పేరైనా పెట్టండి, వాటి అర్థం ఒకటే – చిన్నారి బుర్రలో మూఢనమ్మకాల బీజం నాటడం అన్నమాటే. చిన్న పిల్లలకు ఏది చెప్పినా మెదడులోకి ఇంకించుకుంటారు. మనలాంటి పెద్దలమీద ఎలాంటి బాధ్యత ఉందో మీరు గ్రహించారా? మనిషిప్రాణం అతడి గుండెలోనే కొట్టుకుంటుందన్న విషయం తెలిసి వుండి, మనం మన పిల్లలకు మనిషి ప్రాణం చేపలో ఉంటదనే తరహా విషయాలు చెబుతూ ఉండాలా? ప్రాణం ఇంకెక్కడా ఉండదు కదా!"

టీచరు చెప్పిన విషయాలను నాన్న పట్టించుకున్నాడా లేదా అన్న విషయం టిపుకి అర్థం కాలేదు. కాని టీచరు చెప్పిన అన్ని విషయాలనూ పాటించవలసిందేనని ఆయన నమ్ముతాడని టిపూకి తెలుసు.

"టిపూ! చెప్పినమాట వినడం పిల్లలు నేర్చుకోవాలి" అని తనకు ఎన్నోసార్లు చెప్పాడు. "ముఖ్యంగా పెద్దలు చెప్పిన మాటలు. నీ చదువు పూర్తిచేసి, నీ కాళ్ళమీద నీవు నిలబడ్డప్పుడు, ఒక వయస్సు వచ్చిన తరువాత నీ ఇష్టం వచ్చిన పనులు చేయవచ్చు. అప్పుడే నీ ఆలోచనలు చెప్పడానికి గొంతు విప్పే హక్కు నీకు వస్తుంది. ఇప్పుడు కాదు."

"మీ దగ్గర పిల్లల పుస్తకాలు ఇంకేవీ లేవా?" నరహరి బాబు అడిగాడు.

"ఉన్నాయి. అవన్నీ నా పుస్తకాల అరలో ఉన్నాయి. వాటిని నేను బడికి వెళ్తున్నప్పుడు బహుమతులుగా గెల్చుకున్నాను. అవి నువ్వు చూడలేదా టిపూ" నాన్న అన్నాడు.

"నేను అవి చదివేశాను నాన్నా" టిపు చెప్పాడు.

"అన్నీ...?" "అన్నీ, విద్యాసాగర్, సురేష్ విశ్వాస్‌ల ఆత్మకథలు, కెప్టెన్ స్కాట్ దక్షిణ ధ్రువ యాత్రలు, ఆఫ్రికాలో మంగోపార్క్ సాహసాలు, స్టీలు

మరియు అంతరిక్ష నౌకల కథ..... మీకు మరీ ఎక్కువ బహుమతులు రాలేదు, నాన్నా "

"సరేలే నీకోసం ఇంకొన్ని పుస్తకాలు కొంటాలే" అన్నాడు నాన్న.

"ఇక్కడి తీర్థంకర్ బుక్ స్టాలులో చెబితే, వాళ్ళు కలకత్తా నుంచి ఆ పుస్తకాలు తెప్పిస్తారు. ఇప్పటి నుంచి నువ్వు అలాంటి పుస్తకాలే చదవాలి తర్పణ్, ఇలాంటివి కాదు" నరహరిబాబు చెప్పాడు.

"ఇలాంటివి కాదు" రెండే రెండు చిన్న పదాలు– కాని టిపూ నిర్మించుకున్న చిన్న కలల సామ్రాజ్యం కూలిపోవడానికి అవి చాలు. "ఇలాంటివి కాదు!"

నాన్న ఆ పుస్తకాలను నరహరి బాబు దగ్గర్నుంచి తీసుకుని తన అల్మారాలో పెట్టి తాళం వేశాడు.

ఇప్పుడవి తనకు అందనంత దూరంలో ఉన్నాయి.

ఏదిఏమైనా అమ్మ మాత్రం టిపు వైపే ఉన్నట్లుంది. అమ్మ గొణగడం అతడు విన్నాడు. రాత్రి భోజనం చేసేటప్పుడు ఆమె ఏమీ వెనుకాడకుండా అనేసింది! " అలాంటి విషయాలు చెప్పిన వాడికింకా టీచరుగా ఉండే అర్హత లేదు!"

నాన్నదానికి అంగీకరించలేదు, "ఆయన టిపు మంచికోరే చెప్పాడని నీకు అనిపించడం లేదా?"

"అర్థం లేదు", అమ్మ అన్నది. ప్రేమగా టిపు జుత్తును చెరిపి ఆమె అన్నది, "బాధపడకు. నేను నీకు కథలు చెబుతాన్లే. మీ అమ్మమ్మ నాకు చాలా కథలు చెప్పింది. అవి నేను మర్చిపోలేదు."

టిపు ఏమీ మాట్లాడలేదు. అతడు అప్పటికే అమ్మ చెప్పిన ఎన్నో కథలను విన్నాడు. ఆమెకు ఇక ఎన్నో కథలు రావని అతడికి తెలుసు. ఆమెకు వచ్చినా, కథలను చదవడంలో వచ్చే మజా వినడంలో ఉండదు. తెరిచిన పుస్తకాన్ని ముందర పెట్టుకుని తను ఊహాలోకాల్లో తేలిపోవచ్చు. అమ్మకు ఈ విషయం అర్థమయ్యేలా ఎలా చెప్పడం? ఏం చెయ్యడం?

రెండు రోజుల తరువాత, తను నిజంగా చాల దిగులుగా ఉన్నానని టిపుకి అనిపించింది. ఇది రోజా చెప్పిన దిగులు మాదిరిగానే ఉంది. ఇప్పుడు అతడే టిపూకి ఉన్న ఆఖరి ఆధారం.

ఈ రోజు ఆదివారం. నాన్న కునుకు తీస్తున్నాడు. అమ్మ వరండాలోంచి లేచి వెళ్ళి కుట్టుమిషను దగ్గర కూర్చుంది. టైము ఇప్పుడు, మూడున్నర అయ్యింది. తను వెనక తలుపు నుంచి బయటకు జారుకోవచ్చు. ఆ వ్యక్తి తను ఎక్కడ ఉంటున్నాడో, చెప్పివుంటే ఎంత బాగుండేది! టిపూ నేరుగా అతడి దగ్గరకు వెళ్ళి ఉండేవాడు.

టిపు మెట్లమీదుగా మునికాళ్ళమీద నడుస్తూ వెళ్ళి వెనక తలుపునుంచి బయటపడ్డాడు.

ఎండ బాగా కాస్తున్నా గాలి బాగానే ఉంది. కొండలవరకు పాకిన వరి పొలాలు పండి బంగారు రంగులో మెరుస్తున్నాయి. ఎక్కడి నుంచో ఓ గువ్వ కూత వినిపిస్తోంది. శిరీష చెట్టుమీద పిచ్చుక ఉందనడానికి నిదర్శనంగా ఆకులు గలగలలాడుతున్నాయి.

'హల్లో'!

ఓహ్. ఎంత విచిత్రం! అతడు ఎప్పుడు వచ్చాడు? అతడు రావడం టిపుచూడనేలేదు.

"నీ చెవుల వెనుక నీలంగా ఉంది. చేతులు కూడా ఆరిపోయినట్లున్నాయి. నీకు దిగులుగా ఉందని, దానికి తగిన కారణమూ ఉందని నేను చెప్పగలను."

"నువ్వు అనుకున్నది నిజమే" టిపు చెప్పాడు.

ఆ మనిషి అతడి దగ్గరికి వచ్చాడు. అతడు అవే బట్టలు తొడుక్కొని ఉన్నాడు.

గాలికి అతడి జుట్టు పాయలు పాయలుగా ఎగురుతోంది.

"జరిగిన విషయమేమిటో నాకు తెలియాలి. లేకపోతే నేను కుతలా అతలం అయిపోతాను"

టిపుకి నవ్వొచ్చింది. కాని రోజా మాటను సరిదిద్దాలని అనిపించలేదు. దానికి బదులు, కొన్ని మాటల్లో తన బాధ చెప్పాడు. మాట్లాడుతుంటే టిపు కళ్ళల్లో నీళ్ళు రాబోయాయి. ఎలాగో దిగమింగుకున్నాడు.

"హుమ్మ్" అంటూ అతడు తల ఆడించాడు. అతడి తల పదారుసార్లు పైకీ కిందకీ కదిలింది. టిపూకి కొంచెం చిరాకనిపించింది. తల ఊపడం ఇక ఆపడా ఏం? లేక అతడి దగ్గర తన సమస్యకు పరిష్కారం ఏదీ లేదా? ఏడ్చేద్దామని

అనుకుంటూ ఉండగా అతడు చివరిసారి తల ఊపాడు. తల ఊపడం ఆపి "హుమ్మ్" అన్నాడు మరోసారి. అమ్మయ్య అనుకున్నాడు టిపు.

"దీనికి నువ్వు ఏమైనా చెయ్యగలవా?" రోజాను అడిగాడు.

"జాగ్రత్తగా ఆలోచించాలి. పొట్టకు పని పెట్టాలి" అన్నాడతను.

"పొట్ట? నీ ఉద్దేశం. మెదడుకు పని పెట్టాలని కదూ?"

అతడు జవాబు చెప్పలేదు. "నిన్న నరహరిబాబు పొలాల్లో గుర్రమెక్కి స్వారీ చేస్తున్నాడు కదూ" అని అడిగాడు.

"ఏ పొలాలు? ఓ, హమ్లతుని పొలాలా?"

"అవే. వాటిలో ఆ పడిపోయిన భవంతి ఉందీ..."

"ఆ.. అవును. నువ్వు అక్కడే ఉంటున్నావా?"

"నా ట్రిడింగిపిడి ఆ భవంతి వెనకపడి ఉంది"

అతడేమన్నాడో టిపూకి తెలియలేదు. తెలిసినా, ఆ పదాన్ని సక్రమంగా పలకడం తనకు చాతనయ్యేది కాదేమో.

అతడు మళ్ళీ పైకీ కిందికీ తలూపడం మొదలెట్టాడు. ఈసారి ముప్పై ఒకటోసారి ఊపి ఆపాడు. "ఈ రోజు పౌర్ణమి కదూ. ఏం జరుగుతుందో చూడాలనుకుంటున్నట్లయితే, అదిగో, చంద్రుడు ఆ తాడిచెట్టు మీదకి వచ్చే సమయానికి పొలం దగ్గరికిరా. జాగర్త. ఎవరూ చూడకుండా రావాలి."

ఉన్నట్టుండి టిపూ తలలో భయంకరమైన ఆలోచన తిరిగింది.

"నువ్వు మా లెక్కల సారును చంపేద్దామనుకుంటున్నావా, ఏం?"

అతడు తలవెనక్కి వంచి పగలబడి నవ్వాడు.

"చంపడమా?" నవ్వు ఆపి అన్నాడు – "లేదు లేదు. మాకు చంపడంమీద నమ్మకం లేదు. నిజం చెప్పనా, నేను ఎవరినో గిల్లాలని అనుకున్నాను. అందుకే నన్ను మా దేశం నుంచి బహిష్కరించారు. మొదటి లెక్కల్లోనే మాకు 'భూమి' అనే పేరు వచ్చింది. నన్నీ భూగోళానికి పంపాలన్న మాట. తరువాత ఈ ప్రదేశం పేరు, ఆ తరువాత నీ పేరు వచ్చాయి. నీ దిగులుకు కారణాన్ని తొలగించిన మరుక్షణం నాకు శిక్షనుంచి విడుదల."

"అయితే సరే, మళ్ళీ వస్తా..." తను మాట ముగించే లోపలే అతడు మల్బరీ చెట్టుమీదుగా పెద్ద గెంతువేసి, అదృశ్యమయ్యాడు.

టిపూ శరీరంలో ఏదో గిలిగింత. ఆ రోజంతా గిలిగింతగానే ఉంది. భలే అదృష్టం. అమ్మానాన్న ఆ రాత్రి ఎవరి ఇంటికో విందుకు వెళుతున్నారు. టిపూను కూడా ఆహ్వానించారు వాళ్లెవరో. కాని, టిపూ ఇంట్లోనే ఉండి చదువుకోవాలంది అమ్మ. తనకు పరీక్షలు దగ్గరపడ్డాయి.

వాళ్ళు ఏడున్నరకు వెళ్ళిపోయారు. టిపూ మరో అయిదు నిమిషాలు ఇంట్లోనే ఉండిపోయాడు. తరువాత పరిగెట్టాడు. అప్పుడు తూర్పున ఆకాశం పసుపుపచ్చగా మారుతోంది.

వాళ్ళబడి వెనుక నుంచి అడ్డదారిలో వెళ్ళడంవల్ల, విష్ణురామ్ బాబు ఇల్లు చేరడానికి పదినిమిషాలు సరిపోయింది. విష్ణురామ్ గుర్రం అక్కడ లేదు. బహుశా, ఇంటి వెనుక గుర్రాలశాలలో ఉండొచ్చు అనుకున్నాడు టిపూ. లివింగ్ రూమ్‌లోనికి తెరిచిన కిటికీ ద్వారా వెలుగు పడుతోంది. గది అంతా సిగార్ల పొగతో నిండి వుంది.

“చెక్”

అది లెక్కలసారు గొంతు. ఆయన విష్ణురామ్ బాబుతో చదరంగం ఆడుతున్నాడన్నమాట. ఈ రాత్రి గుర్రమెక్కి స్వారీ చెయ్యడా ఏం? ఏమో ఎలా చెప్పగలం! కానీ ఆ మనిషి తనను హిమ్లతుని పొలానికి రమ్మన్నాడు ఏమి జరుగుతుందో తెలియదు. కాని తను అక్కడికి వెళ్ళాలి.

చందమామ పైకి వచ్చాడు. ఇంకా బంగారు రంగులోనే ఉన్నాడు. తరువాత వెండి రంగులోకి మారుతాడు. తాడిచెట్టు మీదికి రావడానికి మరి పదినిమిషాలు పడుతుంది. వెన్నెల ఇంకా కాంతివంతంగా లేదు. కాని, వస్తువులన్నీ బాగానే కనబడుతున్నాయి. అక్కడ చాలాచెట్లు, పొదలు ఉన్నాయి. పాడుబడిన పాత ఫ్యాక్టరీ దూరంగా కనిపిస్తోంది. ఆ మనిషి దాని వెనుక ఉండి ఉండాలి. కాని ఎక్కడ?

టిపు ఓ పొద వెనుక దాక్కున్నాడు. ఎంతసేపయినా ఎదురు చూడాలనుకున్నాడు. జేబులో న్యూస్ పేపర్‌లో చుట్టి తెచ్చుకున్న బీడీలు ఉన్నాయి. ఒక బీడీని కొరికి, నమలడం మొదలెట్టాడు. దూరంగా అడవిలోంచి నక్కల అరుపులు విన్నాడు. తనమీదుగా ఎగిరిపోయిన పక్షి గుడ్లగూబ అయివుంటుంది.

టిపు కోటుమీద గోధుమరంగు షాల్ కప్పుకున్నాడు. అది తను వెచ్చగా ఉండడానికేగాక చీకట్లో కనిపించకుండా ఉండడానికీ ఉపయోగపడుతోంది.

ఎక్కడో – విష్ణురామ్ బాబు ఇంట్లోనే కావచ్చు – గడియారం ఎనిమిది కొట్టింది.

అంతలోనే టిపూ చెవులకు ఇంకేదో వినిపించసాగింది. క్లిప్ – క్లాప్, క్లిప్ – క్లాప్, క్లిప్ – క్లాప్.

గుర్రం వస్తోందా?

టిపూ పొద వెనుకనించి తల నిక్కించి దారివైపుకి చూశాడు.

అవును. అదే గుర్రం – దానిమీద నరహరి బాబు.

అప్పుడే తనకేదో ప్రమాదం వచ్చి పడింది. దోమ ఒకటి టిపూ చెవులచుట్టూ రొదపెట్టడం మొదలెట్టింది. దాన్ని తోలెయ్యాలని చూశాడు. ఉన్నట్టుండి అది నేరుగా ముక్కులోకి వెళ్ళిపోయింది.

ముక్కు గట్టిగా నొక్కుకుంటే తుమ్మును ఆపుకోవచ్చని టిపూకి తెలుసు. కాని, ఇప్పుడు ఆ పనిచేస్తే, దోమ ఎప్పటికీ బయటకి రాదు. తను తుమ్మక తప్పలేదు. నిశ్శబ్దం ఒక్కసారి బద్దలయ్యింది.

గుర్రం ఆగిపోయింది.

ఎవరో టిపుమీద టార్చిలైటు వేశారు.

“తర్పణ్”

టిపూ భయంతో గట్టకట్టుకుపోయాడు. ఎందుకు ఎందుకు ఎందుకు జరిగింది ఇలా? ఆ మనిషి ఏమేమి ఉపాయాలు వేశాడో, అన్నిటినీ పాడుచేశాడు తను. అతను తన గురించి ఏమనుకుంటాడో?

గుర్రం గిట్టలు శబ్దం చేస్తూ తనవైపు రాసాగింది. దానిమీద లెక్కలసారు. కాని, ఇంతలో ఉన్నట్టుండి గుర్రం ముందరి కాళ్ళను గాల్లోకి లేపింది. గట్టిగా సకిలించింది. దారిలోంచి విసురుగా పక్కకు తిరిగింది. పొలంలోనికి ఒక గెంతు వేసింది.

ఆ తరువాత జరిగింది చూస్తే టిపూకి గుండె ఆగినంతపనయ్యింది. గుర్రం భూమిమీంచి గాలిలోకి లేచింది. తన పక్కల్లోంచి మొలుచుకొచ్చిన రెక్కలు ఆడిస్తూ గాలిలో ఎగరసాగింది. టిపూ వాళ్ళ టీచరు రెండు చేతులూ

గుర్రం మెడచుట్టూ వేసి, దానివీపున గట్టిగా కూర్చోడానికి ప్రయత్నించాడు. టార్చిలైటు ఆయన చేతిలోంచి పడిపోయింది.

చందమామ అప్పటికే తాడిచెట్టు మీదికి వచ్చేశాడు. వెన్నెల కాంతిలో చూశాడు టిపూ. గుర్రం ఆకాశంలో పైకి పైపైకి వెళ్ళింది. చివరికి చుక్కల మధ్య కనపడకుండా పోయింది.

పెగాసస్

టిపూకి లైటు వెలిగినట్లు గుర్తుకు వచ్చింది. అదొక గ్రీకు కథ. మెడుస్సా అని ఒక మంత్రగత్తె. ఆమె తలలో ప్రతి వెంట్రుకదుబ్బ ఒక విషసర్పం. దాని కళ్ళలోకి చూస్తే చాలు. మనుషులు రాళ్ళుగా మారిపోతారు. పెర్షియస్ అనే వీరుడు తన కత్తితో ఆమె తల నరికేస్తాడు. ఆమె రక్తంలోంచి రెక్కల గుర్రం – పెగాసస్ పుడుతుంది.

"ఇక ఇంటికి వెళ్ళు తర్పణ్"

ఆ విచిత్రమైన మనిషి టిపూ పక్కన నిలబడి ఉన్నాడు. అతడి బంగారు రంగుజుట్టు వెన్నెల్లో మెరుస్తోంది.

"అంతా సవ్యంగానే ఉంటుందిలే"

నరహరిబాబు ఆసుపత్రిలో చేరాల్సివచ్చింది. ఆసుపత్రిలో మూడురోజులు ఉన్నాడు. శరీరం మీద మాత్రం ఎలాంటి గాయాలు లేవు. అతడు ఎవరితోనూ మాట్లాడలేదు. ఏం జరిగిందని అడిగితే, కొంచెం వణికిపోయి, తలమరో వైపు తిప్పుకునేవాడు.

నాలుగోరోజు ఆసుపత్రి నుంచి ఇంటికొచ్చాడు. నేరుగా టిపూ వాళ్ళింటికే వచ్చాడు. ఆయనకు నాన్నకు మధ్య ఏం మాటలు నడిచాయో టిపూకి తెలియలేదు. కాని, ఆయన వెళ్ళిపోగానే నాన్న టిపూని పిలిచాడు. "తర్పణ్! నువ్వు పుస్తకాల్ని అల్మరాలోంచి తీసుకో. నువ్వు దెయ్యాలూ రాక్షసుల కథలు చదివితే తనకేమీ అభ్యంతరం లేదని నరహరిబాబు చెప్పాడు"

ఆ విచిత్రమైన మనిషి టిపూకి మరెప్పుడూ కనిపించలేదు. అతడు కనిపిస్తాడేమోనని పాత ఫ్యాక్టరీ వెనక్కి వెళ్ళిచూశాడు. దారిలో విష్ణురామ్ బాబు ఇంటి మీదుగానే వెళ్ళాడు. గుర్రం అదే గుంజకు కట్టేసి ఉంది. ఫ్యాక్టరీ వెనుక తనకు ఏమీ కనిపించలేదు. ఒక తొండ మాత్రం కనిపించింది. తలనుంచి తోక వరకు రోజారంగులో.



# అయిదు రోజుల అతిథి

చిన్న తాతయ్య రాక గురించి అమ్మా నాన్న ఈమధ్య తరచుగా మాట్లాడుకోవడం మంటూ గమనించాడు. ఆయన అమ్మకు చిన్నమామయ్య అవుతాడు.

తాతయ్య ఉత్తరం వచ్చినప్పుడు మంటూ ఇంట్లోనే ఉన్నాడు. అమ్మ ఉత్తరం చదివి ఒకసారి నిట్టూర్చి 'ఆహా' అంది.

ఆ తరువాత నాన్నను కేకేసింది.

నాన్న వరండాలో చెప్పులు రిపేర్ చేయించుకుంటున్నాడు. కనీసం కళ్ళైనా పైకెత్తకుండా "ఏమిటీ" అని అడిగాడు.

అమ్మ ఉత్తరం తీసుకుని బయటకువస్తూ ''మామ ఇక్కడికి రావాలనుకుంటున్నారు" అంది.

"మామ?"

"మా చిన్నమామ. నీకు గుర్తు లేదా?"

నాన్న ఈసారి కనుబొమలు ఎత్తి తల తిప్పాడు.

"నిజంగానా? ఆయన ఇంకా బతికే ఉన్నారంటావా?"

"ఇది ఆయన దగ్గర నుంచి వచ్చిన ఉత్తరమే. నిజానికి ఆయనకు రాయడం వస్తుందని కూడా నాకు తెలియదు."

నాన్న కుర్చీమీద పెట్టిన కళ్ళద్దాలు తీసుకుని "ఏదీ, నన్ను చూడనీ" అని ఉత్తరం అందుకున్నాడు.

ఒకే ఒక పేజి వున్న ఆ ఉత్తరం చదివి నాన్న కూడా

"ఆహా" అన్నాడు.

అమ్మ ఒక స్టూల్‌మీద కూర్చుంది.

ఎక్కడో ఏదో జరిగిందని మంటూకు అర్థమయ్యింది. మొదటి ప్రశ్నలు నాన్న నుంచి వచ్చాయి. "ఆయనకు మన చిరునామా ఎక్కడ దొరికిందంటావు? తన మేనకోడలు సురేష్‌బోస్‌ని పెళ్ళి చేసుకొని ఈ మహ్మద్‌పూర్‌లో ఉంటోందని ఆయనకు ఎవరు చెప్పి ఉంటారు?"

అమ్మ కనుబొమలు కాస్త ముడేసింది. "శీతల్ మామ ద్వారా ఇవన్నీ తెలుసుకొని వుండవచ్చు."

"శీతల్ మామ ఎవరు?"

"ఓరి దేవుడా– నీకు ఏమీ గుర్తుండదా? నీలకంఠపూర్‌లో, మా మామయ్య వాళ్ళ పక్కింట్లో ఉండేవారు. మా కుటుంబానికి చాలా సన్నిహితుడు. నువ్వు ఆయన్ని చూశావు. మన పెళ్ళిలో యాభైఆరు జాంగిరీలు తింటానని ఎవరితోనో పందెం వేసుకున్నాడు. అది విని మనమందరం బాగా నవ్వుకున్నాం."

"అవునవును. నాకు గుర్తొచ్చింది."

"ఆయన మా చిన్న మామయ్యకు చాలా దగ్గరి స్నేహితుడు. చిన్న మామయ్య మొదట్లో ఆయనకు మాత్రమే ఉత్తరాలు రాసేవాడనుకుంటాను."

"శీతల్ బాబు ఇక్కడికి ఎప్పుడూ రాలేదా?"

"వచ్చారు. అంతెందుకు – ఆయన భానూ పెళ్ళికి వచ్చారు కదా?"

"అవును వచ్చారు. కానీ మీ చిన్న మామయ్య ఇల్లొదిలేసి సన్యాసుల్లో కలిసిపోయాడు కదా?"

"అవును. నేనూ అలాగే అనుకున్నాను. ఆయనకు మనల్ని చూడాలని ఇప్పుడెందుకు అనిపించిందో నాకు అర్థం కావడం లేదు."

నాన్న ఒక నిమిషం ఆలోచించి, "ఆయన కలుసుకోవడానికి ఇంకెవరూ ఉండి వుండరు. ఉన్నారా? మీ మామయ్యలు, అత్తయ్యలు ఎవ్వరూ ఇప్పుడు ఈ లోకంలో లేరు కదా? నీకు ఇద్దరు బావలు ఉన్నా ఒకరు కెనడాలో, మరొకరు సింగపూర్‌లో ఉన్నారు. ఇక ఇక్కడ ఆయనకు బంధువు నువ్వు ఒక్కదానివే కదా మరి?"

"నిజమే" అంది అమ్మ. "కాని నేను ఇంతవరకూ చూడని వ్యక్తిని ఎలా గుర్తించగలను? ఆయన ఇల్లొదిలి వెళ్ళినపుడు నాకు రెండేళ్ళు. ఆయనకు దాదాపు పదిహేనేళ్ళు ఉండేవి."

"నీ పాత ఆల్బమ్‌లో ఆయన ఫొటో ఏదీ లేదా?"

"అదేం పనికొస్తుంది? ఆ ఫొటో తీసినప్పుడు మామయ్యకు పదిహేనేళ్ళే. ఆయనకిప్పుడు కనీసం అరవై ఏళ్ళయినా ఉంటాయి."

"అవును. ఇది సమస్య అయేట్టే ఉంది."

"ఆయనకు భానూ ఖాళీ గది ఇవ్వవచ్చు. కాని ఆయనకు ఎలాంటి ఆహారం ఇష్టమో ఎవరికి తెలుసు?"

"అదొక సమస్య కాదులే. ఆయనకు మన ఆహార అలవాట్లే ఉండి వుంటాయి."

"అలా ఉండక్కర్లేదు. ఆయన నిజంగానే సాధువు అయివుంటే శాకాహారం మాత్రమే తీసుకుంటారు కదా. అలా అయితే రోజుకి ఐదు రకాల వంటకాలు చేయాల్సి ఉంటుంది."

"ఉత్తరంలో ఆయన ఉపయోగించిన భాష మామూలుగానే వుంది. సాధువులు ఇలా రాస్తారని ఎవరూ అనుకోలేరు. చూడు, ఆయన తారీఖును, ఇంగ్లీష్‌లో రాశారు. కొన్ని ఇంగ్లీష్ పదాలను కూడా ఉపయోగించారు. ఇదిగో 'అన్నెససరీ!' "

"కానీ, ఆయన తన అడ్రెస్ ఇవ్వలేదు."

"అవును, అది నిజమే."

"వచ్చే సోమవారం వస్తున్నానని కూడా రాశారు."

అమ్మా నాన్నలు విచారంలో మునిగి వున్నారని మంటూకి తెలిసిపోయింది.

ఇది తప్పకుండా విచిత్రమైన పరిస్థితే. పూర్తిగా తెలియని వ్యక్తిని తమ మామయ్య అని ఎవరైనా ఎలా అనుకోగలరు?

మంటూ ఈ తాతయ్య గురించి ఒకటి, రెండుసార్లు మాత్రమే విని వున్నాడు. తాతయ్య స్కూలు చదువు కూడా ముగించకుండానే ఇల్లొదిలి వెళ్ళాడని మంటూకు తెలుసు.

ఆయన మొదట అప్పుడప్పుడు కొంతమందికి ఉత్తరాలు రాసేవాడు. తరువాత ఆయన నుంచి ఎటువంటి కబురూ లేదు. చనిపోయి వుంటాడని మంటూ వాళ్ళ అమ్మ అనుకుంది. మంటూ ఆయన గురించి అప్పుడప్పుడు ఆలోచించే వాడు. ఆయన వెనక్కి వస్తే బాగుండేదని అనుకునేవాడు. అటువంటి విషయాలు కథల్లోనే జరుగుతాయని అతనికి తెలుసు. కథల్లోనైతే, అలాంటి వ్యక్తుల్ని గుర్తించడానికి ఎవరో ఒకరు ఉంటారు. ఈ విషయంలో, అలాంటివారు ఎవరూ లేరు. ఎవరైనా సరే వాళ్ళింటికి వచ్చి నేనే మీ తాతయ్యను అనగలరు. అతడు చెప్పేది నిజమో అబద్ధమో తెలుసుకోడానికి ఎటువంటి అవకాశమూ లేదు.

తాతయ్య ఇక్కడ పదిరోజులకంటే ఎక్కువ ఉండరు. ఆయన తన బాల్యాన్ని బంగ్లాదేశ్‌లోని ఒక చిన్న పట్టణంలో గడిపాడు. ఇప్పుడు మళ్ళీ ఒక చిన్న పట్టణాన్ని చూడాలనుకున్నాడు. నీలకంఠపురం వెళ్ళడంలో ఏ మాత్రం లాభం వుండదు. ఎందుకంటే ఇప్పుడక్కడ ఎవరూ ఉండటం లేదు. అందువల్ల ఆయన మహమద్‌పూర్‌కు రావాలని అనుకున్నారు. ఇక్కడ కనీసం ఒక మేనకోడలయినా ఉంది. మంటూ వాళ్ళ నాన్న లాయరు. మంటూకు ఒక అక్క ఒక అన్నయ్య వున్నారు. అక్కకు పెళ్ళయిపోయింది. అన్నయ్య కాన్పూర్‌లో ఐ.ఐ.టి లో చదువుకుంటున్నాడు.

అమ్మ ఆదివారానికల్లా అన్నీ సర్దిపెట్టింది. మొదటి అంతస్తులో ఒక గదిని శుభ్రం చేశారు. పరుపుమీద కొత్త దుప్పటి, దిండ్లకు కొత్త కవర్లు వేశారు. కొత్త తుండుగుడ్డలు, సబ్బులు కూడా పెట్టారు. తాతయ్య స్టేషన్ నుంచి ఒక్కరే రావాల్సి వుంది. తరువాత.... ఏం జరుగుతుందో చూడాల్సిందే. నాన్న పొద్దునే అన్నాడు – “ఆ వచ్చేమనిషి మీ మామయ్య అవునో కాదో వేరే సంగతి. అతడు మంచీ, మర్యాద తెలియని వాడైతే మాత్రం వచ్చే పదిరోజుల్లో చాలా గడ్డు పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది.”

“నాకు ఇదేమీ నచ్చలేదు” అమ్మ గొణిగింది.

“ఆయన తన అడ్రెస్ అయినా పంపలేదు. పంపి ఉంటే అతడిని వదుల్చుకోవడానికి ఏదో ఒక వంకపెట్టి ఉత్తరం రాసేవాళ్ళం!”

కాని, మంటూ ఇంకో విధంగా ఆలోచించాడు. చాలా రోజులుగా వాళ్ళింటికి అతిథులెవరూ రావడం లేదు. అతనికిప్పుడు వేసవి సెలవులు.

రోజంతా ఇంట్లోనే ఉంటున్నాడు. ఆడుకోడానికి స్నేహితులు ఉన్నారు – సిద్ధూ, అనీష్, రతన్, చోత్కా – కాని ఇంట్లోనే ఎవరైనా ఉంటే చాలా బాగుంటుంది. రోజంతా అమ్మానాన్నలతోనే ఉండాలంటే ఏం బావుంటుంది? ఆయన – నిజమా – కాదా అనే విషయం కూడా చాలా ఆసక్తి కలిగించేదిగా ఉంది. ఏదో రహస్యాలు నిండిన కథలా వుంది. ఆయన ఒకవేళ నిజంగానే తన తాతయ్యగా నటిస్తుంటే, ఆ విషయాన్ని మంటూనే కనిపెడితే – ఎంత బాగుంటుంది! ఆయన బండారం బయటపెట్టి తనొక హీరో అయిపోవచ్చు.

మంటూ సోమవారం పొద్దుట పదిన్నర నుంచి తలవాకిలి దగ్గర తచ్చాడటం మొదలెట్టాడు. పదేహేను నిమిషాలు – తక్కువ – పదకొండుకు ఒక సైకిల్ రిక్షా ఇంటివైపు రావడం చూశాడు. దాంట్లో వచ్చినతని చేతిలో మిఠాయిల బుట్టవుంది. ఆయన కాళ్ళదగ్గర ఒక లెదర్ సూట్‌కేస్ వుంది. ఒక కాలు ఆ సూట్‌కేసుమీద పెట్టి కూర్చుని వున్నాడు.

ఆయన సాధువు కానేకాదు. కనీసం అలాంటి దుస్తులైనా వేసుకోలేదు.

ప్యాంటు, చొక్కా వేసుకుని వున్నాడు. ఆయనకు అరవై ఏళ్ళుండవచ్చని అమ్మ చెప్పింది. కాని అంతకంటే చిన్న వాడిలా కనిపించాడు. జుట్టు చాలా వరకు నల్లగానే వుంది. కళ్ళద్దాలు పెట్టుకున్నా అవి మరీ అంత మందంగా లేవు.

ఆ వ్యక్తి రిక్షావాడికి డబ్బు ఇచ్చి పంపేశాడు. సూట్‌కేస్ కిందపెట్టి, మంటూవైపు తిరిగి “నువ్వు ఎవరు?” అని అడిగాడు.

ఆయన చక్కగా గడ్డం గీసుకుని ఉన్నాడు. మొనదేలిన ముక్కు, కళ్ళు చిన్నవే గాని, మెరుస్తున్నాయి.

మంటూ సూట్‌కేసు పట్టుకుని బదులిచ్చాడు “ నా పేరు సాత్యకి బోస్”

“నువ్వు ఏ సాత్యకివి? కృష్ణుడి శిష్యుడివా? లేక సురేష్ బోస్ కొడుకువా? అంత బరువున్న సూట్‌కేసును మొయ్యగలవా? దాంట్లో చాలా పుస్తకాలున్నాయి.”

“మొయ్యగలను.”

“అయితే లోపలికి వెళదాం పద”

‘‘వాళ్ళు వరండాలోకి రాగానే అమ్మ వచ్చి ఆయన కాళ్ళకు

నమస్కరించింది. మిఠాయిల బుట్ట ఆమెకిస్తూ "నువ్వు సుహాసినివి అనుకుంటా?" అన్నాడతను.

"అవును."

"నీ భర్త లాయరు కదూ? పనిమీద బయటకు వెళ్ళాడనుకుంటా?"

"అవును"

"నేను ఇలా రాకుండా ఉండాల్సింది.... తటపటాయించాను. కానీ మళ్ళీ మీరు ఒక ముసలాడితో కొన్నిరోజులు గడపడానికి సందేహించరని అనుకుని వచ్చేశాను. ఎంతైనా ఒక పదిరోజులే కదా. అంతేకాక శీతల్ మిమ్మల్ని గురించి ఎంతగానో పొగిడాడు. నాకు మీ సమస్య ఏమిటో తెలుసు. నేను నీ మామయ్యనని రుజువు చేయలేను. అందువల్ల నేను మీ నుంచి ప్రత్యేకమైన గుర్తింపు ఆశించను. మీరు చేయవల్సిందల్లా ఈ ముసలాడికి ఒక పదిరోజులపాటు మీ ఇంట్లో నీడనివ్వడమే."

అమ్మ ఆయనకేసి అప్పుడప్పుడు దొంగచూపులు చూడటం మంటూ గమనించాడు. అప్పుడు అమ్మ –

"మీరు స్నానం చేస్తారా?" అని అడిగింది.

"మీకు ఇబ్బంది ఏమీ లేకపోతేనే."

"లేదు. లేదు. ఎటువంటి ఇబ్బందీ లేదు. మంటూ నువ్వు వెళ్ళి ఆయనకు పైన ఉన్న బాత్‌రూమ్ చూపించు. అవును... మీరు ఎలాంటి ఆహారం ఇష్టపడతారో నాకు తెలీదు...."

"నేను ఏదైనాసరే తింటాను. నువ్వు నాచేత ఏమి తినిపించాలనుకున్నా నాకు సంతోషమే. నేను నిజమే చెప్తున్నాను."

"నువ్వు బడికి వెళ్తున్నావా?" పై అంతస్తులోకి వెళ్తున్నప్పుడు ఆయన మంటూను అడిగాడు.

"వెళ్తున్నాను. సత్యభామ హైస్కూల్. ఏడో తరగతి చదువుతున్నాను."

ఆ సమయంలో ఒక ప్రశ్న అడగకుండా ఉండలేకపోయాడు మంటూ –

"మీరు సాధువు కాదా?"

"సాధువా..?"

"మీరు సాధువని అమ్మ చెప్పింది."

"అలాగా! అది చాలాకాలం క్రితం సంగతి. నేను ఇంటినుంచి బయల్దేరి, ముందు హరిద్వార్‌కు వెళ్ళాను. నాకు ఇంట్లో ఉండాలనిపించలేదు. అందుకని వెళ్ళిపోయాను. నిజానికి నేను రుషికేశ్‌లో ఒక సాధువు దగ్గర కొన్నిరోజులు ఉన్నాను. ఆ తర్వాత నాకు అక్కడకూడా ఉండాలనిపించక, వెళ్ళిపోయాను. అటు తరువాత, నేనెప్పుడూ సాధువుల దగ్గరికి వెళ్ళలేదు."

మధ్యాహ్నం భోజనాల దగ్గర ఆయన తనకు పెట్టినదంతా ఎంతో సంతోషంగా తిన్నాడు. మాంసాహారం తినడానికి ఎటువంటి సందేహమూ కనపర్చలేదు. చేపలు, గుడ్లూ తిన్నాడు.

అమ్మ కొద్దిగా సర్దుకుపోవడం మంటూ గమనించాడు. మంటూకు ఆయనను 'చిన్నతాతయ్య' అని పిలవాలనిపించినా అమ్మ ఒక్కసారి కూడా ఆయనను 'మామయ్య' అని పిలవలేదు.

ఆయన భోజనం ముగించి అరటిపండు అందుకున్నాడు. అమ్మ సంభాషణను పొడిగించడంకోసం అన్నట్లు "మీరు చాలా ఏళ్ళు బెంగాలీ ఆహారం లేకుండా గడపాల్సి వచ్చిందనుకుంటా."

ఆయన నవ్వి అన్నాడు – "రెండురోజులక్రితం కలకత్తాలో తిన్నాను. అంతకు ముందు... ఈరకం భోజనం లేకుండా ఎన్ని ఏండ్లు గడిపానో చెబితే నీకు నమ్మాలనిపించదు."

అమ్మ ఇంకేమీ మాట్లాడలేదు. మంటూ అడగాలనుకున్నాడు – "అలా ఎందుకు? మీరు ఎక్కడ ఉండేవాళ్లు?" కాని తమాయించుకున్నాడు. ఆ వ్యక్తి మోసం చేస్తున్నట్లయితే కథలల్లడానికి అవకాశం ఇవ్వకూడదు. తనకు తానై బండారం బయటపెట్టేదాకా ఆగవలసిందే.

ఆయన కూడా ఏమీ మాట్లాడలేదు.

నిజంగానే నలభై ఏళ్ళపాటు దేశాలు పట్టి తిరుగుతూ ఉన్నట్లయితే ఆయన చెప్పవలసిన సంగతులు ఎన్నో ఉంటాయి. మరయితే, ఏమీ మాట్లాడడేమిటి?

నాన్నకారు వచ్చిన చప్పుడు వినిపించినపుడు మంటూ పై అంతస్తులో ఉన్నాడు. వాళ్ళ అతిథి ఒక పుస్తకం తీసుకుని పడుకోవడానికి వెళ్ళిపోయాడు. మంటూ ఒక అరగంటసేపు ఆయనతో గడిపాడు. తాను ఆయనగది ముందు తచ్చాడుతుంటే ఆయన పిలిచాడు.

"లోపలికిరా, కృష్ణుడి శిష్యా! నీకు ఒకటి చూపించనా?"

మంటూ లోపలికి వెళ్ళి మంచం పక్కన నిల్చున్నాడు.

"ఇది ఏమిటో నీకు తెలుసా?" ఆయన మంటూని అడిగాడు.

"రాగిబిళ్ళ"

"ఎక్కడినుంచి వచ్చింది?"

మంటూ ఆ బిళ్ళమీద ఏమి రాసివుందో చదవలేకపోయాడు.

"దీన్ని లెప్టా అంటారు. ఇది గ్రీస్‌లో ఉపయోగించే నాణెం."

"ఇదేమిటి మరి?"

మంటూ ఆ రెండో బిళ్ళను కూడా గుర్తించలేకపోయాడు.

"ఇది టర్కీలో ఉపయోగించే 'కురు', ఇదేవెూ రుమేనియాలో ఉపయోగిస్తారు. దీన్ని 'చాని' అంటారు. ఈ బిళ్ళ ఇరాక్‌ది – ఒక 'ఫిల్'.

తర్వాత ఆయన మంటూ ఎప్పుడూ కనని వినని కనీసం పదిదేశాల నాణాల బిళ్ళలను చూపించాడు.

"ఇవన్నీ నీ కోసమే"

మంటూ ఆశ్చర్యపోయాడు. ఆయన ఏమంటున్నాడు?

అనీష్ వాళ్ళ మామయ్య కూడా ఇలాంటి బిళ్ళలను సేకరించాడు. అలా దేశదేశాల నాణాలను సేకరించే వాళ్ళను ఇంగ్లీష్‌లో న్యుమిస్‌మాటిస్ట్‌లు అంటారని మంటూకి అనీష్ వాళ్ళ మామయ్యే చెప్పాడు. ఆయన దగ్గర కూడా ఇన్నిరకాల నాణాలు లేవని మంటూకు తెలుసు.

"నేను వెళ్ళేచోట నాకో మనమడు తారసపడతాడని నాకు తెలుసు. అందుకని, అతడి కోసం ఈ బిళ్ళలను తెచ్చాను."

వాటిని అమ్మకు చూపించాలని మంటూ ఎంతో ఉత్సాహంతో కిందికి పరిగెత్తాడు. నాన్న గొంతు విని ఆగిపోయాడు. వచ్చిన మనిషిని గురించి నాన్న ఏమో చెప్తున్నాడు.

".... పది రోజులా! చాలా ఎక్కువ. మనల్ని అంత సులభంగా మోసగించలేడని మనం అతడికి తెలిసేట్లు చెయ్యాలి. అతన్ని ప్రత్యేకంగా చూడవలసిన అవసరమేమీ లేదు. మనం ఎక్కువ ఆదరంగా చూడకపోతే తొందరగా వెళ్ళిపోతాడు. అంతేకాదు, మనం ఎక్కువ రిస్క్ తీసుకోకూడదు.

నేను ఈ రోజు సుధీర్‌తో మాట్లాడాను. తను కూడా ఇదే సలహా ఇచ్చాడు. నీ అల్మారాలన్నింటికీ తాళాలువేసి ఉంచు. మంటూ అతన్ని ఎల్లప్పుడూ కనిపెట్టుకుని ఉండనవసరం లేదు. తనకు తన స్నేహితులు ఉన్నారు. వాళ్ళతో ఆడుకోవడానికి బయటకు వెళతాడు. నేను పనిమీద బయటకు వెళతాను. అప్పుడు నువ్వు, సదాశివుడు మాత్రమే ఇంట్లో ఉంటారు. సదాశివుడు చాలావరకు నిద్రపోతూ ఉంటాడని నాకు తెలుసు. నీకు కూడా మధ్యాహ్నంపూట కొద్దిగా కునుకుతీయాలనిపిస్తుంది కదా?"

"నీకు ఒక విషయం చెప్పాలనుకున్నాను" మంటూ వాళ్ళ అమ్మ అన్నది.

"ఏమిటది?"

"ఈయన కొద్దిగా మా అమ్మలాగ వున్నాడు."

"నువ్వలా అనుకుంటున్నావా?"

"అవును అదే ముక్కు, కళ్ళల్లో అదే చూపు ఉన్నాయి."

"సరే, సరే, ఆయన నీ మామకాదనీ నేను అనటంలేదు. అయినా, ఈ మామ ఎలాంటివాడో మనకు తెలియదు. ఆయన సరిగా చదువుకోలేదు. తన జీవితమంతా తిరుగుబోతుగా గడిపాడు. నేను చెప్పదలిచింది ఒకటే. ఈ వ్యవహారం నాకేమాత్రం నచ్చటం లేదు."

నాన్న మాట్లాడటం ఆపగానే మంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు. నాన్న అలా మాట్లాడటం మంటూకు నచ్చలేదు. ఈ కొద్ది గంటల్లోనే కొత్తగా వచ్చినతడ్ని మంటూ ఇష్టపడటం మొదలెట్టాడు. నాణాలను చూడగానే నాన్న మనసు మారుతుందేమో.

"అతను నిజంగా ఈ నాణేలన్నీ నీకు ఇచ్చాడా?"

మంటూ తల ఊపాడు.

"తను ఈ దేశాలన్నీ తిరిగానని చెప్పాడా?"

"లేదు ఆయన అలా చెప్పలేదు."

"అది ఆలోచించవలసిన విషయమే. ఇలాంటి వాటిని కలకత్తాలోనే సంపాదించవచ్చు. వీటిని అమ్మే డీలర్లు ఉంటారు".

నాలుగున్నరప్పుడు ఆయన కిందికి వచ్చి నాన్నను కలిశాడు.

"నేను, నీ కొడుకు అప్పుడే స్నేహితులమైపోయాం" అన్నాడు.

"అవును. మంటూ చెప్పాడు."

నాన్న కూడా అమ్మలాగే ఆయనకేసి అనుమానంగా చూశాడు.

"నేను పిల్లలతో చాలా తొందరగా స్నేహం చెయ్యగలను. నిజానికి పెద్దలకంటే పిల్లలే నన్ను సరిగ్గా అర్థం చేసుకోగలుగుతారు."

"మీరు జీవితమంతా తిరుగుతూనే గడిపారా?"

"అవును నేనెప్పుడూ ఒకే చోట పాతుకుపోయిన మనిషిలా ఉండలేదు."

"మేము పూర్తి విరుద్ధం. మేము సాధించేది ఏమీ లేకుండా బతకలేము. మాకు కుటుంబ బాధ్యతలు ఉంటాయి, పిల్లలను చూసుకోవలసి ఉంటుంది, ఉద్యోగాన్ని నిలబెట్టుకోవలసి ఉంటుంది. మీరు పెళ్ళి చేసుకోలేదు కదా?"

"లేదు"

కొన్ని నిమిషాల నిశ్శబ్దం తరువాత ఆయన అన్నాడు –

"సుహాసినికి గుర్తుండకపోవచ్చు. మా ముత్తాతల్లో ఒకరు – అంటే మా ముత్తాత ఇలాగే ఉండేవారు. ఆయన తనకు పదమూడేళ్ళ వయసున్నప్పుడు ఇల్లొదిలి వెళ్ళిపోయారు. నేను అప్పుడప్పుడు ఇక్కడికి వస్తూ ఉంటాను. కాని ఆయనెప్పుడూ తిరిగి రాలేదు."

నాన్న అమ్మవైపు తిరగడం మంటూ చూశాడు.

"నీకు ఈ విషయం తెలుసా?"

"ఇంతకు ముందు విన్నానేమో. ఇప్పుడేమీ గుర్తులేదు" అమ్మ అన్నది.

టీ తాగినతర్వాత విచిత్రమైన సంగతొకటి జరిగింది. అతిథి కాని అతిథి మంటూ ఇంటికి వస్తున్నట్లు అతని స్నేహితులు చాలామందికి తెలుసు. వాళ్ళందరికీ మంటూ తాతయ్యను చూడాలని కుతూహలంగా ఉంది. అందుకని మంటూ ఇంటికి వచ్చేశారు. పదేళ్ళలోపు వున్న ఆ పిల్లలందర్నీ చూడగానే తాతయ్యకు సంతోషమేసింది. ఆయన తన చేతికర్ర తీసుకుని వాళ్లందరిని వ్యాహ్యాళికి తీసుకువెళ్ళాడు. వాళ్ళు కొద్దిదూరంలో వున్న తోటలోకి వెళ్ళారు. అక్కడ ఒకచెట్టు కింద కూర్చుని మాట్లాడుకోవడం మొదలెట్టారు–

"తరగ్గులంటే ఎవరో మీకు తెలుసా?"

అందరూ తెలీదన్నట్లు తలలాడించారు.

"సహారా ఎడారిలో తరగ్గులనే సంచారజాతి ఉంది. వాళ్ళు దేనికీ భయపడని సాహసవంతులు. దొంగిలించడం, కొల్లగొట్టడం కూడా చేసేవాళ్ళు. వాళ్ళ బారినుంచి తప్పించుకున్న ఒక తెలివైనవాడికథ మీకిప్పుడు చెబుతాను."

పిల్లలందరూ మంత్రం వేసినట్లు ఏమీ మాట్లాడకుండా కూర్చుని ఆ కథ విన్నారు. మంటూ అమ్మకు తరువాత చెప్పాడు. "ఆయన కథ ఎంత బాగా చెప్పాడంటే – అదంతా మా కళ్ళముందు జరుగుతున్నట్లే అనిపించింది."

నాన్న ఆ మాటలు విని అన్నాడు. "ఇతను చాలా పుస్తకాలు చదివినట్లున్నాడు. ఇలాంటి కథే ఏదో ఇంగ్లీషు పత్రికలో చదివినట్లు నాకు లీలగా జ్ఞాపకం వుంది."

తాతయ్య సూట్‌కేసులో చాలా పుస్తకాలు తీసుకువచ్చాడని మంటూ అమ్మా నాన్నలకు చెప్పాడు. అవన్నీ కథల పుస్తకాలో కాదో అతడికి తెలియదు.

మూడు రోజులు గడిచాయి. ఏవీ దొంగిలించబడలేదు. అతిథి వాళ్ళకు ఎటువంటి అసౌకర్యమూ కలుగజేయలేదు. తనకు పెట్టినవి సంతోషంగా తిన్నాడు. దేన్ని గురించి అడగలేదు. ఎటువంటి ఫిర్యాదు చెయ్యలేదు. ఎప్పుడోగాని రాని నాన్న స్నేహితులు, సహోద్యోగులు వాళ్ళింటికి రావడం మొదలు పెట్టారు. నిజమైన – నిజంకాని – అతిథిని చూడడానికే వాళ్ళందరూ వస్తున్నారని మంటూ ఊహించాడు. అమ్మా నాన్నా తమ ఇంట్లో తాతయ్య ఉండటానికి అలవాటు పడ్డట్టే కనిపించారు. నిజానికి, ఒకరోజు నాన్న అంటుండగా మంటూ విన్నాడు. "ఇతను తన విషయాలలో నిరాడంబరంగా ఉన్నాడని ఒప్పుకోవలసిందే. కనీసం అతి స్నేహం చూపించడానికీ ప్రయత్నించడంలేదు. కాని, ఇతనిలా ఉండటం ఎలా సాధ్యమన్న విషయం ఆలోచించలేకపోతున్నాను. బాధ్యతల నుంచి తప్పించుకోవడానికే ఇల్లువదిలి వెళ్ళినట్లు అనిపిస్తోంది. ఇతనిలాంటి వాళ్ళు పరాన్న భుక్కుల్లా ఉంటారు. జీవితమంతా ఇతరుల మీద ఆధారపడినట్లున్నాడు."

మంటూ ఒకసారి అతడిని "చిన్న తాతయ్య" అని పిలిచాడు. ఆయన మంటూని చూసి చిన్నగా నవ్వాడు కాని, ఏమీ అనలేదు.

అమ్మ అతడిని ఒక్కసారి కూడా 'మామయ్య' అని పిలవలేదు. మంటూ ఈ సంగతి ఎత్తినప్పుడు "ఆయన పట్టించుకున్నట్లు లేదులే". అయినా మా

మామయ్యగా నటిస్తున్నట్లు తేలితే? అప్పుడు ఎంత అవమానంగా ఉంటుందో" అంది అమ్మ.

నాలుగో రోజు తాను బయటకు వెళుతున్నట్లు వాళ్ళ అతిథి చెప్పాడు. "నీలకంఠపురానికి బస్సు ఉందా?" ఆయన అడిగాడు.

"పెద్ద మార్కెట్ దగ్గర నుంచి గంటకొక బస్సు నీలకంఠపురానికి వెళుతుంది" నాన్న చెప్పాడు. "అలా అయితే నేను పుట్టిన ఊరు వెళ్ళివస్తాను. సాయంత్రం దాకా తిరిగిరాను."

"ఇక్కడ అన్నం తినే వెళ్తారు కదా?" అమ్మ అడిగింది.

"లేదు. తొందరగా వెళితే మంచిది. దారిలో ఎక్కడైనా భోజనం చేస్తాను. ఏమీ భయపడవద్దు".

ఆయన తొమ్మిదింటికి వెళ్ళిపోయాడు.

మంటూ ఎక్కువసేపు ఉత్సాహం ఆపుకోలేకపోయాడు. తాతయ్య గది ఖాళీగా వుంది. ఆయన సూట్‌కేసులో ఎలాంటి పుస్తకాలు ఉన్నాయో చూడాలని అతడికి ఎంతగానో అనిపించింది. నాన్నఇంట్లో లేడు. అమ్మ కింద పడుకుని వుంది. మంటూ తాతయ్య గదిలోకి వెళ్ళాడు.

సూట్‌కేసుకు తాళం వేసిలేదు. దొంగతనం జరుగుతుందని ఆయనకు అనిపించినట్టు లేదు.

లోపల పుస్తకాలు లేవు. అన్నీ నోట్‌బుక్కులు, కనీసం ముప్పై వేరు వేరు నోట్‌బుక్కులున్నాయి. వాటిలో పదింటికి గట్టి అట్టలు కూడా వేసి ఉన్నాయి.

మంటూ వాటిలో ఒకటి తీసుకున్నాడు. అవన్నీ బెంగాలీ భాషలోనే రాసి ఉన్నాయి.

చేతి రాత అందంగా, గుండ్రంగా ఉంది.

మంటూ ఆ నోటుబుక్కు తీసుకుని మంచమెక్కాడు. కాని, వెంటనే మంచం దిగాల్సి వచ్చింది. అమ్మ శబ్దం చెయ్యకుండా పైకి వచ్చింది.

"మంటూ నువ్వు ఇక్కడేం చేస్తున్నావు? ఆయన వస్తువుల్ని పాడుచేస్తున్నావా?"

మంటూ ఆ నోట్‌బుక్కును మంచి పిల్లాడిలా సూట్‌కేసులో పెట్టి బయటకు వచ్చేశాడు.

"నీ గదికి వెళ్ళు. ఇతర్ల వస్తువులను పాడు చేయకూడదు. వెళ్ళి నీ పుస్తకాలు చదువుకో."

వాళ్ళ అతిథి సాయంత్రం ఆరుగంటల తరువాత వచ్చాడు.

ఆరోజు భోజనాల దగ్గర ఆయన చెప్పిన విషయం అందరినీ ఆశ్చర్యపరచింది.

"నేను రేపు వెళ్ళిపోవాలనుకుంటున్నాను" అన్నాడు. "మీరు చూపించిన ఆదరణ మాటల్లో చెప్పలేనిది. కాని నేను ఒకే చోట ఎక్కువకాలం ఉండలేను."

ఇది విని అమ్మానాన్నా మరీ అంతగా బాధపడలేదని మంటూ గ్రహించాడు. కాని, తనకు మాత్రం విచారమనిపించింది.

"ఇక్కడి నుంచి కతకత్తా వెళతారా?" నాన్నఅడిగాడు.

"వెళతాను కాని, అక్కడ కూడా ఎక్కువకాలం ఉండను. త్వరలో ఎక్కడికయినా వెళ్ళిపోతాను. నేను ఎప్పుడూ ఎవరికీ బరువుగా ఉండలేదు. ఇల్లు వదలినప్పటి నుండి నాకు నేను స్వతంత్రంగా ఉన్నాను."

అమ్మ అప్పుడు జోక్యం చేసుకుంది. "మీరు మాకు బరువు అని ఎందుకు అంటారు? మీవల్ల మాకు ఎటువంటి ఇబ్బందీ లేదు."

కాని అమ్మ అబద్ధం చెప్పిందని మంటూకి తెలుసు. ఎందుకంటే ఇంతకు ముందే నాన్న ఖర్చుల గురించి మాట్లాడటం మంటూ విన్నాడు. ఖర్చులు బాగా పెరిగిపోయాయని, ఇంకొక వ్యక్తి ఖర్చులు భరించాలంటే కష్టంగా వుందని నాన్న అన్నాడు.

ఈ సారి అతిథికి వీడ్కోలు చెప్పడానికి మంటు, వాళ్ళనాన్న స్టేషనుకు వెళ్ళారు.

నాన్న మనసులోఉన్న ఒక చిన్న అనుమానాన్ని మంటూ పసిగట్టాడు. రైలు వెళ్ళిపోయినా తమతో ఇన్ని రోజులు ఇంట్లోవున్న అతిథి నిజంగా తాతయ్యేనా అని ఆశ్చర్యపడుతూ ఉన్నాడని మంటూకి తెలుసు.

ఒకవారం తరువాత ఇంకో ముసలాయన వాళ్ళింటికి వచ్చాడు. ఆయనే శీతల్ మామయ్య. ఆయన్ని మంటూ అక్క పెళ్ళప్పుడు ఒక్కసారి మాత్రమే చూశాడు.

అరే. నువ్వా శీతల్ మామా! ఇలా వచ్చారేమిటి?"

"పనిబడి వచ్చాను. ఒకటి కాదు రెండు పనులమీద వచ్చాను. లేకపోతే నాలాంటి ముసలాడికి రైలులో పడి ఇంతదూరం రావలసిన అవసరం ఏమిటి? నేను మీ ఇంట్లో మధ్యాహ్న భోజనానికి ఉంటున్నాను – ఇదొక హెచ్చరిక కూడా."

"మీరు మా ఇంట్లో తప్పకుండా భోజనం చెయ్యాలి. మీరు ఏం తింటారు? మీకు ఇక్కడ అన్నీ దొరుకుతాయి – కతకత్తాలాగ కాదు."

"ఆగు, ఆగు, నేను ఇక్కడ చెయ్యవలసిన పని పూర్తి చెయ్యనీ," భుజానికి తగిలించుకున్న సంచిలోంచి ఒక పుస్తకం బయటకు తీశాడాయన. "నువ్వు ఈ పుస్తకం గురించి ఎప్పుడైనా విన్నావా?"

అమ్మ ఆ పుస్తకం తీసుకుని, చూసి – "లేదు" అంది.

"పులిన్ నీకు చెప్పలేదని నాకు తెలుసు."

"పులిన్?"

"మీ చిన్న మామయ్య! ఇక్కడ ఐదు రోజులు గడిపిన వ్యక్తే. ఆయన పేరు కనుక్కోవాలని కూడా నీకు అనిపించలేదు కదూ? పులిన్ పుస్తకం రాశాడు."

"ఆయనే రాశాడా?"

"అయినా నువ్వు పత్రికలు చదవవా? ఆయన పేరు ఈ మధ్య పేపర్లో వచ్చింది ఇలాంటి ఆత్మకథలు మన సాహిత్యంలో ఎన్ని ఉన్నాయి చెప్పు?"

"కాని, కాని... ఇది వేరే పేరు"

"అవును. అది కలం పేరు. తాను ప్రపంచమంతా తిరిగాడు. అయినా చాలా హుందాగా ఉన్నాడు."

"ప్రపంచమంతానా?"

"పులిన్‌రేలాంటి విదేశాలు చుట్టివచ్చిన ప్రయాణికుడిని మనదేశం ఎప్పుడూ చూసి ఉండదని నా నమ్మకం. ఆ ప్రయాణమంతా తన సొంత డబ్బుతో చేశాడు. ఓడల్లో పనిచేశాడు. కూలీగా ఉన్నాడు. లారీలు నడిపాడు – ఏ పనీ తనకు చిన్నతనంగా అనిపించలేదు. తన అనుభవాలు కట్టుకథలకంటే ఎక్కువ నమ్మశక్యం గాకుండా ఉంటాయి. అతడిని ఒకసారి పులి అటకాయించింది. ఇంకోసారి పాము కాటేసింది. సహారాలో

సంచారజాతి నుంచి తప్పించుకున్నాడు. ఓడ మునిగిపోతే మడగాస్కర్‌లో ఒడ్డుదాకా ఈదాడు. 1939లో భారతదేశం వదిలి ఆఫ్ఘనిస్తానుకు ప్రయాణం కట్టాడు. నువ్వు నీ ఇంటి ఎల్లలను దాటగలిగితే మొత్తం ప్రపంచమే నీ ఇల్లవుతుందని ఆయన అంటాడు. అప్పుడు నల్లవారికి తెల్లవారికి మధ్య, చిన్నాపెద్దల మధ్య, సంస్కారులకు సంస్కార రహితులకు మధ్య తేడాలు వుండవు.

"కాని... ఆయన ఇదంతా మాకు ఎందుకు చెప్పలేదు?"

"ఆయన చెప్పినా మీరు నమ్మేవారా? సంకుచిత మనస్తత్వంతో పరిమిత ప్రాంతంలో జీవించే మీరు అతడిని నమ్మేవారా? ఆయన నిజమైన వాడా కాదా అన్న విషయం కూడా మీరు కనుక్కోలేకపోయారు. నువ్వు ఆయనను ఒక్కసారయినా 'మామ' అని పిలిచావా? ఇంతాచేసి, ఆయన తన గురించి చెప్పి ఉండవలసిందని అనుకుంటున్నావా?"

"అరె ఎంతపని జరిగింది? ఆయనను వెనక్కి రమ్మని పిలవలేమా?"

"వీలుకాదు. పిట్ట ఎగిరిపోయింది. ఇంతవరకు 'బాలి'కి వెళ్ళలేదు అని చెప్పాడు. ఇప్పుడు అక్కడికే వెళ్ళిఉంటాడు. ఆయన ఈ పుస్తకాన్ని నీకు ఇవ్వమని చెప్పాడు. నిజానికి, దాన్ని నీ కొడుకుకి ఇవ్వమని చెప్పాడు. అతడు ఇంకా చిన్న పిల్లవాడే. అతని చిన్నారి బుర్రమీద ఈ పుస్తకం ముద్రవేయవచ్చు" అని అన్నాడు.

"తను ఎంత పిచ్చిగా ప్రవర్తించాడో నీకు ఇంకా చెప్పలేదు. ఈ పుస్తకానికి అకాడెమీ అవార్డు వస్తుందని నాకు ఖచ్చితంగా తెలుసు. అందుకని కొన్ని రోజులపాటు ఇక్కడే ఉండమని చెప్పాను. ఈ రోజుల్లో పదివేల రూపాయలు ఇస్తారు. తాను నా మాటలు వినలేదు. ఏమన్నాడో తెలుసా? 'ఏమైనా డబ్బుగనక వస్తే మహమద్‌పూర్‌లో ఉన్న నా మేనకోడలికి ఇవ్వు. ఆమె నన్ను బాగా చూసుకుంది' అని చెప్పి ఆ తరువాత ఇదంతా రాయడం మొదలుపెట్టాడు. ఇదిగో ఈ డబ్బు తీసుకో".

అమ్మ శీతల్ మామ దగ్గర నుంచి కవరు తీసుకుంది. అప్పుడు కన్నీళ్ళు తుడుచుకుంటూ బొంగురుబోయిన గొంతుతో అంది.

"ఆహాఁ!"



# బ్రౌన్‌గారి బంగళా

బ్రౌన్ రాసుకున్న డైరీ దొరికినప్పటి నుంచీ బెంగుళూరు వెళ్ళడానికి అవకాశాలకోసం ఎదురుచూస్తున్నాను. అది అనుకోకుండా తటస్థపడింది. మా బాలిగంజ్ బడి పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. అక్కడ నాతో చదివిన మిత్రుడు అనిక్ భౌమిక్‌ను కలుసుకున్నాను. తాను ఇప్పుడు బెంగుళూరులోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్' లో పనిచేస్తున్నానని చెప్పాడు. "సెలవుల్లో మా ఇంటికి వచ్చి గడపవచ్చుకదా?" అతను అడిగాడు. "అది మనదేశంలోనే మంచి ప్రదేశం, మా ఇంట్లో ఒక ఖాళీ గది ఉంది. కనుక నీకు ఎటువంటి సమస్యారాదు. వస్తావు కదూ?"

నేనూ, అనిక్ బడిలో మంచిమిత్రులుగా ఉండేవారం. జరగవలసింది జరిగి తీరుతుంది కదా. అతడు సైన్స్ సబ్జెక్టు తీసుకున్నాడు. నేను ఆర్ట్స్‌లో చేరిపోయాను. అందువల్ల మేము వేరు వేరు దిశలలో ప్రయాణించాము. కొన్ని సంవత్సరాల తరువాత అతడు ఇంగ్లండు వెళ్ళిపోయాడు. మేము కలుసుకోలేక పోయాం. పన్నెండేళ్ళ తరువాత ఇప్పుడు మళ్ళీ ఇలా కలుసుకున్నాం.

"వస్తాను. బెంగుళూరుకు ఎప్పుడు వస్తే బాగుంటుంది?" అని అడిగాను.

"ఎప్పుడైనా సరే. బెంగుళూరులో వాతావరణం ఎప్పుడైనా బాగుంటుంది. బ్రిటిష్ వాళ్ళకు ఈ ప్రదేశం అంటే అంత ఇష్టం ఎందువల్లనంటావు? ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడు రావచ్చు. వస్తున్నానని వారంరోజులు ముందుగా రాస్తే బాగుంటుంది."

బ్రౌన్ నివసించిన ఇల్లు కనుక్కోడానికి ఇదే మంచి అవకాశం. ముందుగా ఆ డైరీ గురించి కొన్ని మాటలు చెప్పాలి.

నాకు పుస్తకాల పురుగు అన్న పేరు ఉంది. ముఖ్యంగా పాత పుస్తకాలంటే చాలా ఇష్టం. నేను బ్యాంక్‌లో పనిచేస్తున్నాను. నా జీతంలో సగం డబ్బు వీటికోసమే ఖర్చు పెడతాను. ఐదేళ్ళకాలంలో నేను చాలా పుస్తకాలనే సేకరించాను. – ట్రావెల్ బుక్స్, వేటల గురించిన కథలు, ఆత్మ కథలు, డైరీలు, ఇంకా ఎన్నెన్నో పాతబడిన వెలిసిపోయిన, బూజుపట్టిన ఆ పేజీలంటే నాకు చాలా ఇష్టం. వాటి వాసన భలేగా ఉంటుంది. తొలకరి వానలకు తడిసిన నేలవాసన, పాత పుస్తకాల వాసన – ఇంకే వాసనా అంత ఆహ్లాదంగా ఉండదు. అత్తరు, కస్తూరి, గులాబీ, హస్నుహన – లేక ఫ్రాన్స్‌లో దొరికే చాల మంచి పెర్‌ఫ్యూమ్‌ల వాసన కూడా వాటిముందు దిగదుడుపే.

పాత పుస్తకాలపట్ల నాకున్న ఇష్టంవల్ల బ్రౌన్ రాసుకున్న డైరీ నాకు దొరికింది. అది ముద్రించి లేదు. పక్షి ఈక ఉపయోగించి, చేత్తో రాసిన డైరీ అది. ఎరుపురంగు లెదరుతో బైండింగ్ చేసి ఉంది. దానిలో మూడువందల యాభై పేజీలు ఉన్నాయి. కవరుకు బంగారు రంగు అంచు ఉంది. మధ్యలో బంగారు రంగు అక్షరాలతో దాని స్వంతదారుడి పేరు చెక్కి ఉంది. జాన్ మిడిల్‌టన్ బ్రౌన్. మొదటి పేజీలో అతడి సంతకం ఉంది. దానికింద అతడి అడ్రస్ రాసి ఉంది. ఎవర్‌గ్రీన్ లాడ్జి, ఫ్రేజర్ టౌన్, బెంగుళూరు. ఆ తరువాత తేదీ రాసి వుంది. జనవరి, 1859. అంటే (నేను ఈ కథ రాసేనాటికి) డైరీ నూటముప్ఫై ఏళ్ళకిందటిది. బ్రౌనుపేరు ఉన్న మిగతా పుస్తకాలతోపాటు ఈ డైరీ దొరికింది. వాటికి చాలా తక్కువ ఖర్చే అయింది. పుస్తకాలు అమ్మే మఖ్‌బూల్ మొదట ఇరవై రూపాయలకు ఇస్తానన్నాడు. నేను పదిరూపాయలు ఇస్తానన్నాను. ఆఖరికి పన్నెండు రూపాయలు ఇచ్చి వాటిని సొంతం చేసుకున్నాను. బ్రౌను ప్రముఖ వ్యక్తి అయి ఉంటే అవి పన్నెండువేల రూపాయల ఖరీదు ఉండేవి.

ఆ రోజుల్లో బ్రిటన్‌కు చెందిన ఒక వ్యక్తి ఏ విధంగా జీవించాడు అన్నది మాత్రం తెలుస్తుందని అనుకున్నాను. నిజానికి, మొదటి వంద పేజీల్లో అది మాత్రమే ఉంది. బ్రౌనుబడిలో ఉపాధ్యాయుడుగా పనిచేసేవాడు. తాను

పనిచేసిన బడి గురించి, బెంగుళూరు గురించి, తన తోటలో, మిగతాచోట్ల చూసిన చెట్లూ పువ్వుల గురించి రాసుకున్నాడు. వైస్రాయి భార్య, లేడీ క్యానింగ్ బెంగుళూరు చూడటానికి వచ్చినట్లు రాసుకున్నాడు. సస్సెక్స్‌లో ఉన్న తన ఇంటి గురించి, తాను వదిలి వచ్చిన తన మిత్రుల గురించి అక్కడక్కడ రాసుకున్నాడు. అప్పటికి కొన్ని సంవత్సరాల క్రితం చనిపోయిన తన భార్య ఎలిజబెత్ గురించి కూడా రాసుకున్నాడు.

ఆ డైరీలో ఆసక్తి కలిగించే విషయం ఇంకొకటి ఉంది. సైమన్ అనే వ్యక్తి గురించి చాలా ఎక్కువసార్లు రాసుకున్నాడు. అతడు బ్రౌనుకు తమ్ముడా, స్నేహితుడా, కొడుకా లేక వేరే బంధువా అన్నది కనుక్కోవటం అసాధ్యం. కాని, బ్రౌనుకు అతడంటే చాలా ఇష్టమని తెలుస్తోంది. డైరీ అంతా సైమన్ తెలివితేటలు, అతడి సాహసం, అతడి కోపం, అతడి అల్లరిపనులు, అతడి మొండి పట్టుదల వంటి విశేషాలతో నిండి ఉంది. వాటిలో చాలావరకు, 'సైమన్‌కు ఆ ప్రత్యేకమయిన కుర్చీలో కూర్చోవడమంటే ఇష్టం', 'సైమన్‌కు ఈరోజు ఒంట్లో బాగాలేదు', 'సైమన్‌ను ఈ రోజు చూడనందుకు నాకు చాలా బాధగా ఉంది' ఇలాంటి మాటలే.

అప్పుడు సైమన్ చనిపోయాడని దారుణ వార్త వచ్చింది. సెప్టెంబరు ఇరవై రెండవ తారీఖున, సాయంత్రం ఏడున్నర ప్రాంతంలో పిడుగు దెబ్బతిని సైమన్ చనిపోయాడు. బ్రౌన్ గారి తోటలో కాలిపోయిన యూకలిప్టస్ చెట్టుపక్కన పడి ఉన్న అతడి మృతదేహాన్ని మరుసటిరోజు ఉదయం కనుక్కున్నారు.

సైమన్ చనిపోయిన తరువాత దాదాపు నెలరోజుల వరకు బ్రౌన్ డైరీ ఎక్కువగా రాయలేదు. అతడు రాసిన కొన్ని సంగతులు కూడా ఎంతో బాధతో, దుఃఖంతో రాసుకున్నాడు. బ్రిటన్‌కు వెళ్ళిపోవాలనుకున్నాడు. కాని, సైమన్ ఆత్మ ఉన్నచోటు వదిలి వెళ్ళాలనిపించలేదు. ఆతడి ఆరోగ్యం కూడా పాడయినట్లుంది. 'ఈరోజు కూడా నేను బడికి వెళ్ళలేదు', అని దాదాపు అయిదుచోట్ల రాసుకున్నాడు. బ్రౌన్‌ను పరీక్షచేసి మందులు రాసి ఇచ్చిన డాక్టర్ లూకాస్ గురించి కూడా రాసుకున్నాడు.

తరువాత హఠాత్తుగా – నవంబరు రెండవ తారీఖున డైరీలో ఒక విచిత్రమైన విషయం రాసి ఉంది. ఈ విషయం వల్లనే డైరీకి అంత ప్రాముఖ్యం వచ్చింది.

బ్రౌన్ మామూలుగా తాను వాడే నీలి సిరాకు బదులు ఈ విషయాన్ని ఎర్రసిరాతో రాశాడు. "ఊహించలేని, అతి విచిత్రమైన సంఘటన ఈ రోజు జరిగింది. ఈ రోజు లాల్‌బాగ్‌కు వెళ్ళాను. అక్కడవున్న చెట్లు మొక్కల మధ్య కూర్చుంటే మనసుకు ప్రశాంతంగా ఉంటుందికదా అని వెళ్ళాను. అక్కడి నుంచి ఏడున్నర ప్రాంతంలో ఇంటికి వచ్చాను. లివింగ్ రూమ్‌లోకి రాగానే కుంపటి దగ్గర తనకిష్టమైన ఎత్తు కుర్చీలో కూర్చుని సైమన్ కనిపించాడు. సైమన్! నిజంగా సైమనేనా? చాలా సంతోషం వేసింది. సైమన్ నా వైపు ఎంతో ఆరాధనగా చూశాడు. కాని, గది చీకటిగా ఉంది. థామస్, మా సోమరిపోతు పనివాడు. గదిలో దీపం వెలిగించడం మరిచిపోయాడు. సైమన్‌ను ఇంకా బాగా చూడవచ్చునన్న ఉద్దేశంతో అగ్గిపుల్ల వెలిగించాను. కాని – అయ్యో – అగ్గిపుల్ల వెలిగించిన మరుక్షణం అతడు మాయమయ్యాడు. ఇది నిజంగా చాలా బాధాకరమైన విషయం; కాని అటు తరువాత, సైమన్‌ను మళ్ళీ చూస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. అతడు దయ్యం రూపంలోనైనా అప్పుడప్పుడు కనిపిస్తే నాకు సంతోషంగా ఉండేది. ఈ రోజు ఎంత మంచిరోజు! తను చనిపోయిన తరువాత కూడా సైమన్ నన్ను మరిచిపోలేదు. తనకు ఇష్టమైన ఆ కుర్చీ కూడా అతడికి జ్ఞాపకముంది. సైమన్! దయచేసి అప్పుడప్పుడు నాకు కనిపిస్తూ ఉండు. నీ నుంచి నాకు మరేదీ వద్దు. నిన్ను మళ్ళీ చూడగలిగితే మిగిలిన జీవితాన్ని ఆనందంగా గడుపుతాను."

ఆ తారీఖు తరువాత ఎక్కువ ఏమీ రాసిలేదు. కాని ఆ కొన్ని సంగతులు కూడా, సైమన్ తనను ప్రతిరోజు కలుసుకోవడంవల్ల కలిగిన సంతోషంతో రాసుకున్నాడు. సైమన్ దెయ్యం అతడిని నిరాశపరచలేదు.

చిట్టచివరగా, 'నన్ను ప్రేమించినవాడు మరణం తరువాత కూడా నాపట్ల తనకున్న ప్రేమను మరచిపోలేదన్న సంగతి నాకు ఎంతో ప్రశాంతిని కలిగించింది' అని రాసుకున్నాడు.

డైరీ అక్కడితో ఆగిపోయింది. కానీ నా కుతూహలం అక్కడే మొదలయింది.

బ్రౌన్ ఉండిన ఆ ఇల్లు – ఫ్రేజర్‌టౌనులోని ఆ ఎవర్‌గ్రీన్ లాడ్జి – ఇంకా ఉందా? సాయంత్రం సమయాల్లో సైమన్ దెయ్యం ఇంకా కనిపిస్తోందా? నావంటి పరిచయంలేని వారికి కనిపిస్తోందా? నేను అక్కడికి వెళ్ళి ఒక సాయంత్రం గడిపితే తనను చూడగలిగే అవకాశం ఉంటుందా?

బెంగుళూరుకు చేరగానే మొట్టమొదట ఆ డైరీ గురించే మాట్లాడాను. అనిక్ నన్ను తన అంబాసిడర్ కారులో ఎక్కించుకొని బెంగుళూరు అంతా తిప్పాడు. మేము ఫ్రేజర్ టౌనుకు కూడా వెళ్ళాం. బెంగుళూరు నిజంగానే చాలా అందమైన ప్రదేశం. ఎప్పుడూ రణగొణ ధ్వనులతో నిండిన కలకత్తా వాడిని కావడంవల్ల నిశ్శబ్దంగా ప్రశాంతంగా ఉండే బెంగుళూరును చూడగానే ఏదో కలల ప్రపంచంలోకి వచ్చినట్లుగా ఉంది.

మరుసటిరోజు ఆదివారం. నేను, అనిక్ టీ తాగుతూ గార్డెన్‌లో గొడుగు కింద కూర్చున్నాం. అప్పుడు నేను బ్రౌను ఇంటి విషయం ఎత్తాను. అనిక్ ఏమీ మాట్లాడకుండా నేనుచెప్పినదంతా విన్నాడు. తరువాత తన టీకప్పు టేబిలుమీద పెట్టి అన్నాడు – “చూడు, రంజన్, నువ్వు చెప్పే ఆ ఇల్లు ఇప్పటికీ ఉండవచ్చు. వంద ఏళ్ళు అంటే ఏమంత ఎక్కువ కాలం కాదు. కాని, అక్కడికి వెళ్ళి ఒక దెయ్యంకోసం ఎదురు చూడాలంటే నావల్ల కాదు. ఇలాంటి విషయాలంటే నాక్కొంచెం భయం. నా ఉద్దేశంలో ఇప్పుడున్న జీవితం ఫర్వాలేదు, నాకు ఎలాంటి సమస్యా లేదు. కాని ఇప్పుడు దెయ్యాలవేట అంటే లేని సమస్యలను కోరితెచ్చుకున్నట్లవుతుంది అనుకుంటాను. ఇక నన్ను ఈ విషయంలో బలవంత పెట్టవద్దు.

అంటే అనిక్‌లో మార్పేమీ లేదన్నమాట. పిరికివాడని బడిలో అతడికి పేరు ఉండేది. నాకు ఒక సంఘటన బాగా గుర్తుంది. ఒకరోజు సాయంత్రం, అనిక్ ఒంటరిగా నడుస్తున్నాడు. ఇద్దరు అబ్బాయిలు ముసుగులు వేసుకుని హఠాత్తుగా అనిక్‌మీద పడ్డారు. అతడు ఎంత భయపడ్డాడంటే మరుసటి రోజు వాళ్ళనాన్న వచ్చి వాళ్ళ హెడ్‌మాస్టర్‌కు ఫిర్యాదు చేశాడు.

నేను మరోమాట అనేలోపునే అనిక్ అన్నాడు – “కాని, నువ్వు తప్పకుండా అక్కడికి వెళ్ళాలంటే, నీకు ఒక మంచి తోడు చూపించగలను. హలో! బెనర్జీ గారూ!” నేను అటువైపు తిరిగి, గేటులోంచి ఒక వ్యక్తి మా వైపు రావడం చూశాను. అతడికి నలభై –అయిదేళ్ళు ఉండవచ్చు. ఆరడుగుల ఎత్తు, బలిష్ఠంగా ఉన్నాడు. బూడిదరంగు ట్రౌజరుమీద నీలంరంగు బుష్‌షర్టు వేసుకున్నాడు. బాతిక్ రకం లతలు అల్లిన నలుపు – తెలుపు పట్టు కండువాను మెడచుట్టూ కప్పుకున్నాడు.

అనిక్ మమ్మల్ని పరస్పరం పరిచయం చేశాడు. "ఇతడు నా స్నేహితుడు, రంజన్ సేన్‌గుప్తా, ఈయన హృషికేష్ బెనర్జీ"

బెనర్జీ ఎయిర్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నట్లు తేలింది. ఆయన బెంగుళూరులో చాలా ఏళ్ళుగా ఉంటున్నాడు.

అనిక్ అతడికి ఒక కప్పు టీ ఇచ్చి ఏకంగా బ్రౌను ఇంటి సంగతి ఎత్తాడు. ఆ కథ వినగానే బెనర్జీ ఎంత గట్టిగా నవ్వాడంటే అక్కడే తిరుగుతూ అల్లరి చేస్తున్న ఒక పిచ్చుక పక్కనున్న చెట్టుమీదికి ఎగిరిపోయి, ఆకులమధ్య మాయమయిపోయింది.

"దెయ్యాలా? దెయ్యాలా? మీరు అవన్నీ నిజంగానే నమ్ముతారా? ఈ కాలంలో?" నేను కొద్దిగా మొహమాటపడుతూ అన్నాను, "మరేంలేదు, వాటి గురించి కుతూహలంగా ఉండటం తప్పేమీ కాదుకదా?" దెయ్యాలకు సంబంధించి శాస్త్రీయ వివరణకోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. తరువాత్తరువాత ఏమైనా తెలియొచ్చు. అయినా, ఎవరు చెప్పగలరు. ఓ పదేళ్ళ తరువాత ఎవరో ఒకరు వాటిని కనుక్కోవచ్చు కదా!"

బెనర్జీ నవ్వడం అపలేదు. అతడి పళ్ళు చాలా తెల్లగా, బలంగా ఉన్నాయి.

చివరికి, అనిక్ అన్నాడు – "మంచిది బెనర్జీ దెయ్యాలు ఉన్నా లేకపోయినా – అలాంటి ఇల్లు ఒకటి ఇప్పటికీ ఉంటే, మీరు రంజన్‌కు తోడుగా ఒక సాయంత్రం ఆ ఇంటికి వెళ్ళగలరా అని అడగాలనుకుంటున్నాను. తను నా అతిథి. తనను ఒంటరిగా పంపలేను. నిజం చెప్పాలంటే, నా వరకు నేను... ఉఁ... అలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉంటాను. ఇప్పుడు నేను తనతో వెళ్ళాలంటే, నేను చాల ఎక్కువ బాధ్యత తీసుకోవలసి ఉంటుంది."

బెనర్జీ తన జేబులో నుంచి ఒక పైపు తీసి దాన్ని నింపసాగాడు. "నాకేం ఫర్వాలేదు. కాని నేను ఒక్క షరతుమీద వస్తాను – మీరు ఇద్దరూ నాతో రావాలి" అన్నాడు.

దగ్గరలో ఎగురుతున్న పక్షులు భయపడే విధంగా మళ్ళీ గట్టిగా నవ్వాడు. అనిక్ కొద్దిగా తెల్లబోయాడు. కాని, ఒప్పుకున్నాడు.

"ఆ ప్రదేశాన్ని ఏమంటారని చెప్పారు?" బెనర్జీ అడిగాడు.

"ఎవర్‌గ్రీన్ లాడ్జి"

"ఫ్రేజర్‌టౌనులోనా?"

"డైరీలో అలాగే రాసి ఉంది."

"ఉమ్‌మ్" అతడు పైపు పీల్చసాగాడు. "ఫ్రేజర్ టౌనులో పాతబడిన కొన్ని బ్రిటిషర్స్ ఇండ్లు ఉన్నాయి. అయినా – మనం తప్పకుండా వెళ్ళాలి అంటే ఈ రోజు సాయంత్రమే ఎందుకు వెళ్ళకూడదు? నేను ఇక్కడికి మళ్ళీ నాలుగు గంటలకు వస్తే ఎలా ఉంటుంది?"

బెనర్జీ వృత్తిరీత్యా ఇంజనీరు అయి ఉంచవచ్చు గాని, అతడికి మిలటరీ వాళ్ళ తత్వమూ, కాలాన్ని పాటించాలన్న జ్ఞానము పుష్కలంగా ఉన్నాయి. సరిగ్గా చెప్పిన సమయానికి తన మారిస్ మైనర్‌లో వచ్చాడు.

"మీతోపాటు ఏం తీసుకువస్తున్నారు?" మేం కారు ఎక్కగానే అతడు అడిగాడు.

అనిక్ లిస్టు చదివాడు – మంచి పవర్‌ఫుల్ టార్చి, ఆరు కొవ్వొత్తులు, ఒక ఫస్ట్ ఎయిడ్ బాక్సు, కొన్ని సాండ్‌విచ్చులు, ఒక పెద్ద ఫ్లాస్కులో కాఫీ, పేకముక్కలు, నేలమీద పరచుకోవడానికి ఒక రగ్గు, ఇంకా దోమలను పారదోలటానికి ఉపయోగించే ట్యూబు.

"మరి ఆయుధాల సంగతి!"

"ఆయుధాలు ఉపయోగించి దెయ్యాలను చంపెయ్యగలమా? అవును, రంజన్ – నీ దెయ్యం ఘనపదార్థమేనా?"

"ఫరవాలేదు", బెనర్జీ అన్నాడు. "నా దగ్గర చిన్న రివాల్వరు ఉంది. అందువల్ల అది ఘనపదార్థమయినా, ద్రవపదార్థమయినా" మనం ఆలోచించనక్కరలేదు.

మేం బయలుదేరాం, కొద్ది సేపయింతరువాత బెనర్జీ చెప్పాడు.

"ఆ ప్రదేశం ఇప్పటికీ ఉంది"

నాకు ఆశ్చర్యం అనిపించింది. "అంటే మీరు ఆ విషయం అప్పుడే తెలుసుకున్నారా?"

"నేను పద్ధతి ప్రకారం వెళ్ళే మనస్తత్వం కలవాడిని, సేన్‌గుప్తా! అక్కడికి వెళ్ళేముందు అసలు అటువంటి ప్రదేశం ఉందోలేదో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి కదా? నాతోపాటు గోల్ఫ్ ఆడే నా స్నేహితుడు, శ్రీనివాస

దేశ్‌ముఖ్ ఆ ప్రాంతంలోనే నివసిస్తున్నాడు. మీ ఇంటి నుంచి బయలుదేరి నేను నేరుగా అతడి ఇంటికే వెళ్ళాను. ఫ్రేజర్ టౌనులో నిజంగానే ఎవర్‌గ్రీన్‌లాడ్జి ఉందని అతడు చెప్పాడు. దాదాపు యాభై ఏళ్ళుగా అది ఖాళీగా పడిఉంది. పదేళ్ళ క్రితంవరకు అక్కడి జనం పిక్నిక్‌కు వెళ్ళేవారు. కాని ఇప్పుడు ఎవరూ వెళ్ళడంలేదు. అంతేగాక, ఆ ఇంట్లో చాలా ఏళ్ళుగా ఎవరూ నివసించడం లేదు. అయినా, దానికి దెయ్యాలకొంప అని పేరు రాలేదు. ఒకప్పుడు దాంట్లో కొద్దిగా సామాగ్రి ఉండేది – కాని, కొన్నేళ్ళక్రితం వేలంపాటలో అవి కూడా పోయాయి. కల్నల్ మెర్సర్ వాటిలో కొన్నింటిని కొన్నాడు. అతడు కూడా ఫ్రేజర్ టౌనులోనే నివసిస్తున్నాడు. నాకు అర్థమయినంతవరకు, మనం అక్కడికి పిక్నిక్‌కు వెళ్ళినట్లుగా వెళ్తున్నాం. అనిక్ పేకముక్కలు తీసుకురావడం మంచిదయింది."

విశాలమైన బెంగుళూరు రోడ్డుమీద పోతుంటే ఆ ఊర్లో ఒక దెయ్యాల కొంప వుంది అన్న నమ్మకం కుదరడం లేదుకాని, నేను బ్రౌను డైరీని మరచిపోలేను. ఎవరికైనా పిచ్చి ఉంటే తప్ప అలాంటి విచిత్రమైన కథ అల్లి దాన్ని డైరీలోకి ఎక్కించరు. బ్రౌను నిజంగానే సైమన్ దెయ్యాన్ని చూశాడు – ఎన్నోసార్లు. ఆ దెయ్యం మాకు కనిపించదా – కనీసం ఒక్కసారి?

నేను ఎప్పుడూ ఇంగ్లాండు వెళ్ళలేదు. కాని, ఇంగ్లీషువాళ్ళ ఇళ్ళను బొమ్మల్లో చూశాను. ఎవర్‌గ్రీన్ లాడ్జిని చూడగానే ఇంగ్లండులో ఒక పేటలోని పాడుబడ్డ ఇంటిని చూసినట్లు అనిపించింది నాకు.

ఆ ఇంటి ముందు ఒకప్పుడు చిన్నతోట ఉండినట్లుంది. ఎంతో ఓపిగ్గా అమర్చిన పూలగట్లు ఇప్పుడు పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉన్నాయి. తోటలోకి వెళ్ళడానికి చిన్నగేటుగుండా వెళ్ళాలి. ఆ గేటుమీద ఇంటిపేరు రాసి ఉంది. కాని ఎవరో – అక్కడికి పిక్నిక్‌కు వచ్చినవారై ఉండవచ్చు – ఎవర్‌గ్రీన్ ముందు ఎన్ అనే అక్షరం చెక్కారు. దాంతో ఎవర్‌గ్రీన్ కాస్తా నెవర్‌గ్రీన్ అయిపోయింది.

మేము ఇంటివైపు నడవసాగాం. దానిచుట్టూ చాలాచెట్లున్నాయి. నేను కొన్ని యూకలిప్టస్‌చెట్లు చూశాను. మిగతావాటిని గుర్తించలేకపోయాను. బెంగుళూరు లోని మట్టిలో ఏ దేశం నుంచి వచ్చిన చెట్టయినా బ్రతుకుతుందని పేరు.

విరిగిపోయిన పెంకుల పైకప్పుతో, ఒక పోర్టికో ఉంది. దాని స్తంభాన్ని తీగలు కప్పేశాయి. ముఖద్వారం ఒకవైపు వంగిపోయింది. దాదాపు కిటికీలన్నీ విరిగిపోయాయి. గోడలమీద మట్టి ఎంత పేరుకుపోయిందంటే ఇంటి అసలు రంగు కనిపించడం లేదు.

మేము విరిగిపోయిన ద్వారంలోంచి లోపలికి నడిచాం. చివరలో ఉన్న గదికి వేరుగా దారి ఉంది. అటూ ఇటూ ఇంకా కొన్ని గదులు ఉన్నాయి. కుడివైపున అన్నిటికంటె పెద్ద గది ఉంది. అది లివింగ్ రూం అయి ఉండవచ్చు. ఫ్లోరింగ్ చెక్కతో చేశారు. అది చాలావరకు పాడయిపోయింది. అడుగులు జాగ్రత్తగా వెయ్యాల్సి వచ్చింది.

మేము గదిలోకి వెళ్ళాం. మా కాళ్ళకింద చెక్కపలకలు కిర్రుమన్నాయి. సామాను ఏమీ లేకపోవడం వల్లనేమో ఆ గది చాలా పెద్దగా అనిపించింది. ఉత్తరంవైపు, పశ్చిమం వైపు కిటికీలున్నాయి. వాటిలోంచి ఒకవైపు తోట కనిపిస్తుంది; మరోవైపు యూకలిప్టస్ చెట్లు ఉన్నాయి. వీటిలో ఒక చెట్టు మీదనేనా పిడుగుపడ్డది? సైమన్ దానికింద నిలబడి ఉన్నాడు. హఠాన్మరణం. ఆ ఆలోచనతో నాకు వళ్ళు జలదరించింది. నేను దక్షిణం గోడవైపు చూశాను. కుంపటి ఎడమవైపున ఉంది. సైమన్‌కు ఇష్టమయిన కుర్చీ దాని పక్కనే ఉండేదేమో. ఆ గది పైకప్పు బూజుతో నిండిపోయింది. ఒకప్పుడు ఎంతో అందంగా ఉండిన ఆ ఎవర్‌గ్రీన్ లాడ్జి ఇప్పుడు పాడుబడిపోతోంది.

బెనర్జీ ఏదో పాశ్చాత్య గీతాన్ని లోగొంతులో పాడుకుంటున్నాడు. పైపు వెలిగించుకోవడానికి ఆగి అన్నాడు, “మీరు మామూలుగా ఏ ఆట ఆడతారు? బ్రిడ్జా, పోకరా లేక రమ్మీనా?”

అనిక్ కింద రగ్గు పరచి మావెంట తెచ్చిన సామాను నేలమీదపెట్టి, కింద కూర్చుంటున్నాడు. అప్పుడే మేము ఒక శబ్దం విన్నాం. ఎవరో బూట్లు వేసుకుని వేరే గదుల్లో నడుస్తున్నారు.

నేను అనిక్‌వైపు చూశాను. అతడు కొద్దిగా తెల్లబోయాడు. అడుగుల శబ్దం ఆగిపోయింది. బెనర్జీ హఠాత్తుగా పైపు నోట్లోంచి తీసి అరిచాడు, “అక్కడ ఎవరైనా ఉన్నారా?” మేమందరమూ దారివైపు నడవసాగాము. అనిక్ నా చొక్కాచేతిని గట్టిగా పట్టుకున్నాడు.

మేము అక్కడికి చేరుకోగానే అడుగుల శబ్దం మళ్ళీ మొదలయింది. అప్పుడు కుడివైపున ఉన్న గదుల్లోంచి ఒకతను బయటకు వచ్చాడు. తనకళ్ళు మామీద పడగానే అతడు ఆగిపోయాడు. అతడు భారతీయుడే. క్షవరం చేయని గడ్డం, దువ్వని జుట్టు.... అయినా అతడు చదువుకున్నవాడేనని చెప్పవచ్చు.

"హలో!" అన్నాడతడు.

మాకు ఏం చెప్పాలో అర్థంకాలేదు.

మేం వేయలేని ప్రశ్నలకు ఆ కొత్తవ్యక్తే సమాధానం చెప్పాడు.

"నా పేరు వెంకటేష్. నేను పెయింటరును, మీరు ఈ ఇంటికి యజమానులా? లేక దీన్ని కొనడానికి వచ్చారా?"

బెనర్జీ నవ్వి చెప్పాడు, "ఏదీ కాదు. మేం లోపలికి ఊరికనే వచ్చాం."

"అలాగా. ఈ ఇంట్లో నా స్టూడియో తెరిస్తే ఎలా ఉంటుందా అని అనుకుంటున్నాను. పడిపోయిన ఇల్లయినా ఫరవాలేదు – ఈ ఇంటి యజమాని ఎవరో మీకు తెలుసా."

"తెలియదు. కాని మీరు కల్నల్ మెర్సర్‌ను అడిగితే తెలుస్తుంది. ఆయన ఇల్లు ఇక్కడికి ఎక్కువదూరం లేదు. రోడ్డు చివరికి వెళ్ళి ఎడమవైపు తిరగాలి. ఐదు నిమిషాల్లో వెళ్ళిపోవచ్చు" బెనర్జీ చెప్పాడు.

"థాంక్యూ" వెంకటేష్ బయటకు వెళ్ళిపోయాడు.

గేటు తెరుచుకుని మూసుకోవడం విన్నాం. బెనర్జీ మరోసారి గట్టిగా నవ్వి అన్నాడు "సేన్‌గుప్తా! అది సైమన్‌దో మరొకరిదో దయ్యం కాదు కదా?"

నేను బలవంతంగా నవ్వి అన్నాను "దెయ్యాలు మనకు అప్పుడే కనిపిస్తాయని అనుకోకండి. ఇప్పుడు ఐదుంబావే అయింది. అతడు దెయ్యమే అయినా, పందొమ్మిదో శతాబ్దంవాడు మాత్రం కాదు. అప్పటి దెయ్యం వేరే రకమయిన బట్టలు వేసుకుని ఉంటుంది."

మేము మళ్ళీ లివింగ్ రూంలోకి వచ్చేశాము. అనిక్ రగ్గుమీద కూర్చుని అన్నాడు, "మీరు నవ్వులాటకు భయపడుతూ నాకు భయం పుట్టిస్తున్నారు. రండి, పేకాడుకుందాం." "ముందు కొవ్వొత్తి వెలిగించండి," బెనర్జీ అన్నాడు – "ఇక్కడ తొందరగా చీకటి పడిపోతుంది."

మేము రెండు కొవ్వొత్తులు వెలిగించి చెక్కనేలమీద పెట్టాం. వంతులవారీగా ఫ్లాస్కులోంచి టీ తీసుకుని తాగాము. తరువాత నేను ఊరికే కూర్చోలేకపోయాను. నేను మరో విషయం గురించి ఆలోచిస్తున్నాను. బెనర్జీతో అన్నాను, "కల్నల్ మెర్సర్ ఈ ఇంటిలోని కొంత సామాగ్రిని కొన్నారని మీరు చెప్పారు కదా, ఆయన ఇక్కడికి దగ్గర్లోనే నివసిస్తుంటే, మనం ఆయనింటికి వెళ్ళి ఒక వస్తువు తెచ్చుకోవచ్చు కదా?"

"ఏ వస్తువు?"

"ఒక ప్రత్యేకమయిన ఎత్తు కుర్చీ"

అనిక్ కొద్దిగా చిరాకుపడి అన్నాడు, "ఎందుకు? మనం ఇప్పుడు ఇంత హఠాత్తుగా ఒక ఎత్తు కుర్చీకోసం వేట ఎందుకు మొదలుపెట్టాలి?"

"ఏం లేదు – ఆ కుర్చీ గురించి బ్రౌను డైరీలో రాశాడు. సైమన్‌కు ఆ కుర్చీలో కూర్చోవడం చనిపోయిన తరువాత కూడా ఇష్టమని బ్రౌన్ రాశాడు.

అది కుంపటి దగ్గర వుండేదట. దాన్ని తెచ్చి ఇక్కడ పెడితే బాగుంటుంది కదా అని అనుకుంటున్నాను...!"

అనిక్ నన్ను మధ్యలో ఆపేశాడు, "దాన్ని ఇక్కడికి ఎలా తెస్తావు? బెనర్జీ కారు లోనా? లేకపోతే ఇంతదూరమూ ముగ్గురం కలిసి దాన్ని మోసుకువద్దామా? నీకు పూర్తిగా పిచ్చిపట్టిందా?"

బెనర్జీ అప్పుడు చెయ్యెత్తి మమ్మల్ని ఆపాడు.

"కల్నల్ మెర్సర్ కొన్న సామాగ్రిలో ఆ కుర్చీలేదు. నేను ఆయన ఇంటికి చాలాసార్లు వెళ్ళాను. ఆయన కొనివుంటే నాకు కనిపించేది. నాకు తెలిసినంత వరకూ ఆయన రెండు పుస్తకాల అరలు, రెండు ఆయిల్ పెయింటింగ్‌లు, కొన్ని పూలజాడీలు ఇంకా అలాంటి సామాను – ఆర్ట్‌పీసుల వంటివి కొన్నాడంతే"

నేను మౌనంగా ఉండిపోయాను. అనిక్ కార్డులు కలపసాగాడు. బెనర్జీ అన్నాడు. "రమ్మీ ఆడదాం. ఏదైనా పెట్టి ఆడితే బాగుంటుంది. మీకు అంగీకారమేనా?"

"నాకు ఇష్టమే. కాని, నాది బ్యాంకులో చాలా చిన్న ఉద్యోగం, ఎక్కువ డబ్బు పోగొట్టుకోలేను" అన్నాను నేను.

బయట వెలుతురు తగ్గుతోంది. మేము ఆట మొదలుపెట్టాం. నేను పేకాటలో ఎప్పుడూ ఓడిపోతుంటాను. ఇప్పుడు కూడా అలాగే జరిగింది. అనిక్ గెలుస్తూ ఉంటే నాకు కొద్దిగా బాగుండేది. ఎందుకంటే లోలోపల అతడు చాలా భయపడుతున్నాడని నాకు తెలుస్తూనే ఉంది. అలాంటిదేమీ జరగలేదు. బెనర్జీకే అదృష్టం కలిసివచ్చినట్టుంది. అతడు ఆ పాశ్చాత్య రాగాన్ని కూనిరాగం తీస్తూ అన్ని ఆటలు గెల్చుకోసాగాడు. ఒక పిల్లి మ్యావ్‌మనేటప్పటికి మేము బిజీగా ఆడుతూనే ఉన్నాం. అది నన్ను ఇంకా నిరాశపరిచింది. దెయ్యాల కొంపలో పిల్లి ఉండకూడదు. నేను బెనర్జీకి ఆ విషయం చెప్పగానే అతడు నవ్వి అన్నాడు, "కాని అది నల్లపిల్లి – అది దారివైపే వెళ్ళింది. నల్లపిల్లులు దెయ్యాలకు భయపడవు కదా?"

మేము ఆడుతూనే ఉన్నాం. ఒక్కసారి మాత్రం ఒక పక్షి భయంకరంగా అరిచిన అరుపు విన్నాం. ఆ తరువాత మరే శబ్దమూ మా మనస్సులను మరల్చలేదు.

అప్పుడు ఆరున్నరయ్యింది. పగటి వెలుతురు దాదాపు అదృశ్యమయ్యింది. నాకు అదృష్టం కలిసివచ్చి రెండు ఆటలు గెల్చుకోగలిగాను. అప్పుడే ఒక శబ్దం విన్నాం, ఎవరో తలుపు తడుతున్నారు. మేము పేకముక్కలు కిందపెట్టి విన్నాం. ట్యాక్, ట్యాక్, ట్యాక్ ట్యాక్.

అనిక్ ఇంతకు ముందుకంటె ఎక్కువ పాలిపోయాడు. నా గుండె కూడా గట్టిగా కొట్టుకోసాగింది. బెనర్జీ మాత్రం అంత తొందరగా భయపడేట్లు లేడు. అతడు మరోసారి గట్టిగా అరిచి నిశ్శబ్దాన్ని భగ్నం చేశాడు, "ఎవరది?"

తలుపు తట్టడం మళ్ళీ వినిపించింది. ట్యాక్. ట్యాక్. ట్యాక్. బెనర్జీ ఏం జరుగుతోందో చూడడానికి లేచాడు. నేను అతడి ట్రౌజరు చివర పట్టుకుని ఆపాను. "ఒక్కరే వెళ్ళకండి" మెల్లగా అన్నాను.

ముగ్గురం కలిసి వెళ్ళాం. మేము దారిలోకి వెళ్ళి ఎడమవైపు చూశాం. సూట్‌వేసుకుని చేతిలో కఱ్ఱ పట్టుకుని తలుపు బయట నిలుచున్న ఒక మనిషి ఆకారాన్ని చూశాం. చీకట్లో అతడు ఎలా ఉన్నాడో కనిపించడంలేదు. అనిక్ నా చొక్కా ఇంకా గట్టిగా పట్టుకున్నాడు. నేను అతడివైపు చూశాను. తరువాత ఎలాగోలాగ ధైర్యం కూడగట్టుకున్నాను. ఇంతలోపల బెనర్జీ కొద్దిగా ముందుకు

వెళ్ళి చూశాడు. అంతలో అతడు ఆశ్చర్యంగా అన్న మాటలు వినిపించాయి, "అరే, హల్లో, డాక్టర్ లార్కిన్! మీరు ఇక్కడ ఏం చేస్తున్నారు?"

మధ్యవయస్కుడైన ఆ యురోపియన్‌ను ఇప్పుడు బాగా చూడగలుగుతున్నాము. అతడు తన బంగారు ఫ్రేము కళ్ళజోడులోంచి నీలికళ్ళు చికిలించిచూసి, నవ్వి అన్నాడు, "బయట నిలబెట్టిన నీ మోరిస్‌ను చూశాను. తరువాత కిటికీలోంచి కొవ్వొత్తి వెలుగు చూశాను. లోపల మీరు ఏం చేస్తున్నారో చూద్దామని వచ్చాను."

బెనర్జీ నవ్వాడు, "నా ఇద్దరు యువ స్నేహితులకు వచ్చిన వింత ఆలోచన ఇది. ఇక్కడికి వచ్చి పేకాడదామని నన్ను లాక్కు వచ్చారు. ఊరికే సాహసకార్యం లాగ!"

"మంచిది. మంచిది. ఈ వయస్సులోనే ఇలాంటి పిచ్చిపనులు చెయ్యాలనిపిస్తుంది. నా వంటి ముసలివాళ్ళు ఇంట్లో కూర్చుని పురాణాలు చదువుకోవలసిందే. సరే. బాగా గడపండి!"

డాక్టర్ లార్కిన్ వెళతాను అన్నట్లు చెయ్యెత్తి, కర్ర తాటించుకుంటూ వెళ్ళిపోయాడు. మరో అనవసరమైన బెదిరింపు. మేము మా ఆట దగ్గరకు వచ్చాం. నేను దాదాపు నాలుగు రూపాయలు పోగొట్టుకున్నాను. ఇప్పుడు దాంట్లో కొద్దిగా తిరిగి గెల్చుకున్నాను. పేకాటలో ఏమైనా సంపాదించుకోగలిగితే సైమన్ దెయ్యం కనిపించకపోయినా సమయం వృధా అయినట్లు అనిపించదు.

నేను గడియారంవైపు ఎక్కువసార్లు చూడసాగాను. అందువల్ల, ఆ సంఘటన సరిగ్గా ఎప్పుడు జరిగిందో ఖచ్చితంగా చెప్పగలను. సైమన్, చనిపోయిన సమయం అదేనని బ్రౌను రాశాడు.

నేను పేకముక్కలు పంచసాగాను. బెనర్జీ పైపు వెలిగించుకుంటున్నాడు. అనిక్ సాండ్‌విచ్‌కోసం సంచీలో చెయ్యపెట్టగానే అతడి చూపులో తేడా వచ్చింది. అతడి శరీరం బిగుసుకుపోయింది.

అతడి చూపు గదిబయట దారిలో ఉన్న దేనిపైనో ఉంది. నేను, బెనర్జీ అతడు చూస్తున్నవైపు చూశాము. అక్కడ ఉన్న దాన్ని చూడగానే నేను ఊపిరి బిగబట్టాను.

చీకటిగావున్న దారిలోంచి రెండు మెరుస్తున్న కళ్ళు మమ్మల్ని చూస్తున్నాయి. అవి చిలకపచ్చరంగు, భాస్వరానికి ఉండే పచ్చని మెరుపురంగులో ఉన్నాయి. కదలడం లేదు.

బెనర్జీ కుడిచెయ్యి అతడికోటులోని జేబులోకి వెళ్ళింది. అదే సమయంలో అంతా సర్దుకుంది. నా గొంతు అదుపులోకి వచ్చింది. నేను అన్నాను, "మీరు రివాల్వరు తీయనక్కరలేదు బెనర్జీ, అది ఆ నల్లపిల్లే!"

నా మాటలు విని అనిక్ కొద్దిగా ఊపిరితీసుకున్నాడు. బెనర్జీ జేబులోంచి చెయ్యతీసి అన్నాడు, "ఎంత హాస్యాస్పదం!"

పచ్చగా మెరిసే ఆ కళ్ళు మా దగ్గరకు వచ్చాయి. అది గడపదాటగానే నేను ఊహించింది నిజమే అని తేలింది. అది నల్లపిల్లే.

ఆ పిల్లి గదిలోకి వచ్చి ఎడమవైపు తిరిగింది. మా కళ్ళు దాని ప్రతి కదలికనూ గమనించసాగాయి. మేము కూడా ఎడమవైపు దృష్టి మరల్చాం.

మేమందరమూ అనుకోకుండా, ఒకే శబ్దం చేశాము. ఎవరైనా చాలా ఎక్కువగా ఆశ్చర్యపడినప్పుడు ఆ శబ్దం చేస్తారు. దానికి కారణం ఏమీలేదు – మేము అక్కడ రమ్మీ ఆడుతూ కూర్చున్నప్పుడు ఎక్కడినుంచో ఆ ఎత్తుకుర్చీ వచ్చింది. దానికి ఎరుపు వెల్వెట్ కవర్ ఉంది. కుంపటికి దగ్గరగా వేసి ఉంది. చందమామలేని రాత్రిలాగ నల్లగా ఉన్న ఆ పిల్లి ఆ కుర్చీ దగ్గరకు శబ్దం చెయ్యకుండా వెళ్ళింది. అది కొద్దిసేపు ఆగి, కుర్చీ మీదకు ఎగిరి ముడుచుకుని కూర్చుంది.

అదే సమయంలో నేను విన్న ఒక శబ్దం నా రక్తం గడ్డకట్టుకుపోయేట్లు చేసింది. ఆ గదిలో అదృశ్యంగా ఉన్న ఒక ముసలివాడు సంతోషంగా నవ్వుతున్నాడు. నవ్వుతూ అప్పుడప్పుడు అంటున్నాడు, "సైమన్, సైమన్, సైమన్.... సైమన్" అతడు చిన్నపిల్లాడిలా చప్పట్లు కొడుతున్న శబ్దం కూడా వినిపిస్తోంది.

అతడి అరుపును బట్టి, అనిక్ తెలివితప్పిపోయాడని తెలుసుకున్నాను. బెనర్జీ ఎక్కడ? అతడు అనిక్‌ను భుజంమీద వేసుకుని తలుపువైపు పరిగెడుతున్నాడు.

నేను వెంటనే అతడితోపాటు పరిగెత్తాను. పేకముక్కలు, కొవ్వొత్తులు, సాండ్‌విచ్చులు, రగ్గు – అన్నీ వెనకుండిపోయాయి. తలుపు తరువాత తోట ఉంది. దాని తరువాత గేటు. మేము పిచ్చివాళ్ళలా పరిగెడుతూ గేటు బయట ఆపి ఉంచిన మోరిస్ మైనర్ ఎక్కాం. బెంగుళూరులో ట్రాఫిక్ ఎక్కువ లేకపోవడం మంచిదయ్యింది. ఎక్కువ ట్రాఫిక్ ఉండివుంటే ఒక పిచ్చెక్కిన మనిషివల్ల ఆ సాయంత్రం ఎంతమందికి గాయాలయ్యేవో.

అనిక్‌కు కారులో ఉన్నప్పుడే తెలివి వచ్చింది. కాని, ఒక్క మాటకూడా మాట్లాడలేదు. మేము ఇంటికి వెళ్ళాక బెనర్జీ మొదట మాట్లాడాడు. అనిక్ ఇంటి పనిమనిషి చేతిలోంచి బ్రాందీగ్లాసు లాక్కుని, ఒకే గుక్కలో సగంతాగి, బొంగురు గొంతుకతో అన్నాడు బెనర్జీ, “అంటే .... సైమన్ అనేది పిల్లి పేరన్నమాట”

నేను ఏమీ మాట్లాడలేకపోయాను. అతను చెప్పింది సరయిందేనని మనసులో అనుకున్నాను.

అది నిజమే అయి ఉండాలి. బ్రౌన్‌గారి సైమన్ – ఆయన అంతగా ప్రేమించిన, ఆ తెలివైన, అల్లరి పనులు చేసే గర్విష్టి, ప్రేమించే జీవి మాకు ఆరోజు కనపడిన ఆ నల్లపిల్లి అన్నమాట.



# ఫ్రిట్జ్

**జయంత్** వాలకం చూసి అడగకుండా ఉండలేకపోయాను, "నీకు ఒంట్లో బాగానే ఉందా? ఈ రోజు నువ్వు అదోలా కనిపిస్తున్నావు."

జయంత్ ఊహల్లోంచి ఒక్కసారిగా బయటపడి, నావైపు చూసి, చిన్నపిల్లాడిలా నవ్వి అన్నాడు – "అదేంలేదు. పోగా, నాకు ఈ రోజు చాలా హాయిగా ఉంది. ఈ ప్రదేశం నిజంగా చాలా అందంగా ఉంది."

"నువ్వు ఇక్కడికి ఇంతకుముందు వచ్చావు కదా. ఇక్కడ బాగుంటుందని నీకు ముందే తెలిసి ఉండాలే?"

"అదంతా దాదాపు మరిచిపోయాను", జయంత్ నిట్టూర్చి అన్నాడు. "అవన్నీ ఇప్పుడు కొద్దికొద్దిగా తిరిగి జ్ఞాపకం వస్తున్నాయి. బంగళా మారినట్టులేదు. ఈ కర్ర కుర్చీలూ, బల్లలు వంటి పాత సామాను నాకు ఇప్పటికీ జ్ఞాపకమే."

పనివాడు ఒక ట్రేలో టీ, బిస్కట్లు తెచ్చి పెట్టాడు. నేను టీ కప్పుల్లో పోశాను.

"ఇంతకుముందు ఇక్కడికి ఎప్పుడు వచ్చావు?"

"ముప్పై ఒక్క ఏళ్ళక్రితం. అప్పుడు నాకు ఆరేళ్ళు ఉంటాయి."

మేము బుండీ సర్క్యూట్ హౌస్ తోటలో కూర్చుని ఉన్నాం. ఈ రోజు పొద్దున్నే వచ్చాం. నేనూ, జయంత్ చాలాకాలంగా స్నేహితులం. ఒకే బడిలో ఒకే కాలేజీలో చదువుకున్నాం. అతడిప్పుడు ఒక వార్తా పత్రికలో ఎడిటోరియల్ విభాగంలో పనిచేస్తున్నాడు. అంతేగాక ఒక బడిలో పాఠాలు కూడా

చెబుతున్నాడు. మావి వేర్వేరు ఉద్యోగాలే అయినా అది మా స్నేహానికి అడ్డురాలేదు. రాజస్థాన్ రావాలని మేము ఎన్నోరోజులుగా అనుకుంటున్నాం. మా ఇద్దరికి ఒకేసారి సెలవు దొరకడం పెద్దసమస్య అయింది. ఏదోలాగ ఆ సమస్య కూడా పరిష్కారమయింది.

చాలామంది రాజస్థాన్‌లోని జైపూర్‌కో, ఉదయ్‌పూర్‌కో, లేకపోతే చిత్తోర్‌కో వెళుతుంటారు. కాని, జయంత్ బుండి వెళదామని చాలా పట్టుబట్టాడు. టాగూరు రాసిన పద్యం 'దలఫోర్ ఆఫ్ బుండి' చదివి వుండటంవల్ల ఇక్కడికి రావడానికి నాకు ఎటువంటి అభ్యంతరమూ లేకపోయింది. ఈ ఊరి పేరు నాకు సుపరిచితమే. ఈ కోట అందం చూడాలని నేను కూడా ఉబలాటపడ్డాను. బుండికి ఎంతోమంది జనం వచ్చేవారు కాదు. అంటే ఇక్కడ చూడవలసిన ప్రదేశాలు ఏవీ లేవని కాదు. దీనికి కారణం ఇక్కడికంటే జోధ్‌పూరులో, ఉదయ్‌పూరులో, చిత్తోర్‌లో ఎక్కువ చారిత్రక విశేషాలు కనపడతాయని కావచ్చు; కాని ఒక అందమైన ప్రదేశంగా మాత్రం బుండికి మించింది లేదు.

అయినా, బుండికే వెళ్ళాలి అని జయంత్ పట్టుబట్టడం నాకు విచిత్రంగానే అనిపించింది. రైలులోవచ్చేటప్పుడు దానికి కారణం తెలుసుకున్నాను. జయంత్ చిన్నప్పుడు బుండికి ఒకసారి వచ్చాడు. తన జ్ఞాపకాలలో ఉన్న బుండికి ఈ నాటి బుండికి ఏవైనా పోలికలు ఉన్నాయా అని చూడడం కోసమే అతడు పెద్దయినతరువాత ఇక్కడికి రావాలనుకున్నాడు. జయంత్ వాళ్ళనాన్న అనిమేష్ దాస్‌గుప్తా పురాతత్వ శాఖలో పనిచేశారు. ఆయన ఆ పనిమీద చారిత్రక స్థలాలు చూడడానికి వెళ్ళేవారు. జయంత్ బుండి చూడగలగడానికి అదే కారణం.

ఆ సర్క్యూట్ హౌస్ చాలా బాగుంది. దాన్ని బ్రిటిషువారి కాలంలో కట్టారు. కనీసం వందేళ్ళకిందట కట్టి ఉంటారు. ఒకే అంతస్థు ఉన్న బిల్డింగు. పైకప్పు ఏటవాలుగా ఉంది. గదులకు ఎత్తైన పైకప్పు ఉంది. గవాక్షాలను తెరవడానికి, మూయడానికి వీలుగా పెద్ద పెద్ద తాళ్ళు ఉన్నాయి. వరండా తూర్పువైపున ఉంది. దానిముందు ఒకపెద్ద గులాబీ తోట. దాని వెనుక చాలా చెట్లు ఉన్నాయి. చెట్లమీద చాల పక్షులు నివాసమేర్పరుచుకున్నాయి. చిలుకలు ప్రతిచోట కనిపిస్తున్నాయి. తోట బయటనుంచి నెమళ్ళ అరుపులు వినిపిస్తున్నాయి.

మేం ఇప్పుడే నగర అందాలు చూడడానికి బయలుదేరాం. పేరుగాంచిన బుండికోట కొండలమధ్య ఉంది. మేము ఆ రోజు అల్లంతదూరం నుంచి కోట చూశాం. మళ్ళీ వెళ్ళి దగ్గరగా చూడాలనుకున్నాం. అక్కడ ఆధునికత్వానికి గుర్తుగా కరెంటుస్థంభాలు మాత్రమే ఉన్నాయి. లేకపోతే పాత రాజపుటానాలో ఉన్నామేమోనన్న భ్రమ మాకు కలిగేది.

మొదటి అంతస్థు నుంచి బాల్కనీలు వేలాడుతూ ఉన్న ఇళ్ళలో వీధులు నిండి ఉన్నాయి. వాటిమీద, చెక్క తలుపులు చెక్కిన శిల్పాలు, లతలు అక్కడి శిల్పకారుల గొప్ప పనితనాన్ని చాటుతున్నాయి. యంత్రాలయుగంలో ఉన్నట్లు అనిపించడంలేదు మాకు.

బుండికి వచ్చిన తరువాత జయంత్ ఎక్కువ మాట్లడకపోవడం గమనించాను. అతడికి ఏవేవో విషయాలు గుర్తుకు వచ్చాయేమో, చిన్నప్పుడు చూసిన ప్రదేశాలు పెద్దయిన తరువాత చూస్తే ఎవరికైనా ఏదో పోగొట్టుకున్నట్లు అనిపిస్తుంది. అంతేగాక, జయంత్ అందరిలా కాక బాగా మనస్వి. ఎక్కువగా బాధపడతాడు. ఈ విషయం అందరికీ తెలుసు.

అతడు టీకప్పు కిందపెట్టి అన్నాడు – "నీకు తెలుసా శంకర్, ఇది చాలా విచిత్రం, నేను మొదటిసారి ఇక్కడికి వచ్చినప్పుడు ఈ కుర్చీలలో కాళ్ళు ముడుచుకుని కూర్చున్నాను. ఏదో సింహాసనం మీద కూర్చున్నట్లు అనిపించేది. ఇప్పుడీ కుర్చీలు చిన్నగా సామాన్యంగా కనిపిస్తున్నాయి. అప్పుడు డ్రాయింగ్ రూం చాలా పెద్దదిగా అనిపించింది. నేను ఇక్కడికి మళ్ళీ రాకపోయి ఉంటే నాకు అవే జ్ఞాపకాలు మిగిలి ఉండేవి."

"అవును, అది నిజమే. పిల్లవాడిగా ఉన్నప్పుడు చిన్నగా ఉండటంవల్ల, అన్ని వస్తువులూ పెద్దవిగా కనిపిస్తాయి. వయసుతోపాటు శరీరం కూడా పెరుగుతుంది. కాని మిగతా వస్తువులు అలాగే ఉంటాయి కదా?" అన్నాను నేను.

టీ తాగిన తరువాత మేము తోటలో తిరగడానికి వెళ్ళాము. జయంత్ నడుస్తున్నవాడల్లా ఒక్కసారిగా ఆగిపోయి అన్నాడు "ఆ దేవదారు"

నేను అతడివైపు చూశాను.

"దేవదారు చెట్టు అది ఇక్కడే ఎక్కడో ఉండాలి" అంటూ అతడు గోడవైపు నడవసాగాడు. అంత హఠాత్తుగా దేవదారు చెట్టు ఎందుకు గుర్తుకు వచ్చిందో?

"అప్పుడున్న చోటనే ఇప్పుడూ ఉంటుంది. చెట్లు ఎక్కడికైనా షికారుకెళ్తాయా" అన్నాన్నేను నవ్వుతూ.

జయంత్ చిరాగ్గా తల ఊపాడు. "అది కాదు. నా ఉద్దేశ్యం అదికాదు. నేనన్నదేమిటంటే, ఆ చెట్టు ఎక్కడ ఉంటుందని నేను అనుకున్నానో అక్కడే ఉంది."

"కాని, నీకు హఠాత్తుగా ఆ చెట్టు ఎందుకు గుర్తొచ్చింది?"

జయంత్ ఏదో గొణుగుతూ ఆ చెట్టువైపు చూడసాగాడు. తరువాత కొద్దిగా తల ఊపుతూ అన్నాడు. "నేను గుర్తు తెచ్చుకోలేకపోతున్నాను. నన్ను ఈ చెట్టుదగ్గరికి ఏదో లాక్కొచ్చింది. నేను ఇక్కడ ఏదో చేశాను. ఒక యూరోపియన్ మనిషి....."

"యూరోపియన్ మనిషా?"

"లేదు, నాకు ఏదీ గుర్తురావడం లేదు. జ్ఞాపకం అనేది నిజంగా చాలా విచిత్రమైనది...."

సర్క్యూట్ హౌస్‌లో మంచి వంటవాడు ఉన్నాడు. ఆ రోజు సాయంత్రం, భోజనంకోసం కూర్చున్నప్పుడు జయంత్ అన్నాడు – "అప్పుడున్న వంటవాడి పేరు దిలావర్. అతడి ఎడమ బుగ్గమీద ఒకగాటు ఉండేది. కళ్ళు ఎప్పుడు చూసినా ఎర్రగా ఉండేవి. కాని అతడు చాలా బాగా వంట చేసేవాడు."

భోజనం తరువాత డ్రాయింగు రూములోకి వెళ్ళిన తరువాత జయంత్ పాత విషయాలను జ్ఞాపకం తెచ్చుకోసాగాడు. వాళ్ళ నాన్న ఎక్కడ కూర్చుని హుక్కా పీల్చేవాడు, వాళ్ళ అమ్మ ఎక్కడ కూర్చుని అల్లికలు కుట్టేదో, ఎలాంటి పత్రికలు బల్లమీద ఉండేవో – అలాంటి విషయాలు అతడికి గుర్తుకు వచ్చాయి.

తరువాత తన ఆటబొమ్మ గురించి అతడికి నెమ్మది నెమ్మదిగా గుర్తుకు వచ్చింది.

చిన్నారి పిల్లలు ఆడుకునే మామూలు ఆటబొమ్మ కాదది. దాన్ని స్విట్జర్‌ల్యాండు నుంచి వాళ్ళ మామయ్య అతడికోసం తెచ్చాడు. అది పన్నెండు అంగుళాల ముసలివాడి బొమ్మ. దానికి సాంప్రదాయక స్విస్ దుస్తులు వేశారు. దానికి ప్రాణం ఉన్నట్లే ఉండేది.

జయంత్ తన తల్లిదండ్రులతో బుండీకి వచ్చేముందే అతడి మామయ్య ఐరోపా నుంచి వచ్చాడు. ఆ చిన్న ముసలివాడి బొమ్మను ఆయన

స్విట్జర్‌లాండులోని ఒక పల్లెటూరిలో కొన్నాడు. జయంత్ వాళ్ళ మామయ్యకు ఆ బొమ్మ అమ్మిన వ్యక్తి నవ్వులాటకు అతడితో అన్నాడట – "ఇతని పేరు ఫ్రిట్జ్. ఇతడిని అదే పేరుతో పిలవాలి. మరేపేరు పెట్టి పిలిచినా బదులు పలకడు."

జయంత్ చెప్పాడు – "నా చిన్నతనంలో నా దగ్గర చాలా బొమ్మలు ఉండేవి. నేను మా అమ్మ నాన్నలకు ఒకే బిడ్డను కావడం వల్లనేమో నేను కోరినవన్నీ ఇచ్చేవాళ్ళు. కాని ఫ్రిట్జ్ దొరికిన తరువాత మిగతా బొమ్మలను నేను పూర్తిగా మరిచిపోయాను. ఎప్పుడూ అతడితోనే ఆడుకునే వాడిని. గంటల తరబడి అతడితోనే మాట్లాడటం మొదలుపెట్టాను. మా సంభాషణలు అన్నీ ఒకవైపు నుంచే జరిగేవి, ఫ్రిట్జ్ మాట్లాడలేడు కదా. అయినా అతడి ముఖంమీద ఆ చిరునవ్వును, అతడి కళ్ళను చూస్తూ వుంటే అతడు నా మాటలు వింటూ, అర్థం చేసుకుంటున్నట్లే ఉండేది. అతడితో జర్మన్ భాషలో మాట్లాడితే అతడు బదులు పలుకుతాడేమో అని ఒక్కొక్కప్పుడు నాకు అనిపించేది. ఇప్పుడు అది గుర్తుకు వస్తే అంతా చిన్నపిల్లవాడి ఊహలా అనిపిస్తుంది. కాని. అప్పుడు నాకు అంతా నిజమని అనిపించేది. వస్తువులమీద అంత మమకారాన్ని పెంచుకోవద్దని అమ్మా నాన్న చెప్పేవారు. కాని నేను ఎవరి మాటా వినలేదు. అప్పటికి నన్ను బడిలో చేర్పించలేదు. అందువల్ల ఫ్రిట్జ్‌తో ఆడుకోవడానికి ఎంతో సమయం ఉండేది.

జయంత్ నిశ్శబ్దంగా కూర్చున్నాడు. నేను నా గడియారం వైపు చూశాను. అప్పుడు రాత్రి తొమ్మిదిన్నర అయ్యింది. బయట నిశ్శబ్దంగా ఉంది. మేము సర్క్యూట్ హౌస్ డ్రాయింగు రూములో కూర్చుని ఉన్నాం. ఆ గదిలో ఒక నూనెదీపం వెలుగుతోంది.

నేను అడిగాను "మరి ఆ బొమ్మ ఏమయ్యింది?"

జయంత్ ఇంకా ఏవో ఆలోచనల్లో మునిగిఉన్నాడు. అతడి జవాబు ఎంతసేపటికి వచ్చిందంటే, అతడసలు నాప్రశ్న వినలేదనే అనుకున్నాను కాసేపు.

"దాన్ని బుండీకి తీసుకువచ్చాను. అది ఇక్కడే పాడయిపోయింది."

"పాడయిపోయిందా? ఎలా?"

జయంత్ నిట్టూర్చాడు.

"మేము టీ తాగుతూ లాన్‌లో కూర్చుని ఉన్నాం. నేను నా బొమ్మను నా పక్కన గడ్డిలో పెట్టాను. నాకప్పుడు టీ తాగే అలవాటు లేదు. కాని ఆరోజు

తాగుతానని పట్టుబట్టాను. అప్పుడు నా కప్పు తిరగబడి టీ అంతా నా ట్రౌజరుమీద పడింది. ట్రౌజరు మార్చుకోవడానికి ఇంట్లోకి పరిగెత్తాను. నేను వెనక్కి తిరిగి వచ్చేసరికి ఫ్రిట్జ్ నేను పెట్టిన చోటలేదు. చుట్టుపక్కల దానికోసం చూశాను. ఒకచోట రెండు ఊరకుక్కలు ఫ్రిట్జ్‌ను నోటితో పట్టుకుని లాగుతున్నాయి. ఆ బొమ్మ పూర్తిగా విరిగిపోకపోయినా దానిముఖం గుర్తుపట్టటానికి వీల్లేకుండా తయారయింది, బట్టలు పూర్తిగా చిరిగిపోయాయి. వేరే మాటల్లో చెప్పాలంటే ఫ్రిట్జ్ ఇకలేదు. అతడు చనిపోయాడు."

"తరువాత?" జయంత్ కథ నాకు ఆసక్తి కలిగించి అడిగాను.

"ఆ తరువాత ఏమవుతుంది? అంత్యక్రియలు చేశాను."

"అంటే?"

"దేవదారు చెట్టుకింద పూడ్చిపెట్టాను. ఒక, శవపేటిక తయారుచేద్దామను కున్నాను. ఎంతైనా అతడు యూరోపియన్ కదా. నాకు కనీసం ఒక చిన్న పెట్టెకూడా దొరకలేదు. అందువల్ల, చివరికి, అలాగే పూడ్చిపెట్టాను."

చివరికి, ఆ దేవదారు చెట్టు రహస్యం, ఆ విధంగా బయటపడింది. మేము పడుకునేసరికి పదిగంటలయింది. మా గది చాలా పెద్దగా ఉంది. మా పక్కబట్టలు కూడా బాగా సర్ది ఉన్నాయి. నడవడం ఎక్కువ అలవాటు లేకపోవడంవల్ల బాగా అలిసిపోయాను. అంతేకాక పక్క చాలా హాయిగా ఉంది. పడుకున్న పదినిమిషాల్లోనే బాగా నిద్రపట్టేసింది.

కొద్దిసేపటికే చిన్నశబ్దం వల్ల మెలకువ వచ్చింది. నేను పక్కకి తిరిగి చూశాను. జయంత్ తన మంచంమీద కూర్చుని ఉన్నాడు. అతడి మంచంపక్కన, టేబుల్ లైటు వేసి ఉంది. ఆ వెలుగులో అతడి ముఖంలో ఆశ్చర్యం చూశాను.

"ఏమిటది? ఒంట్లో బాగోలేదా?" అడిగాను.

నా ప్రశ్నకు జవాబివ్వకుండా, జయంత్ తనే మరో ప్రశ్న వేశాడు.

"ఈ సర్క్యూట్ హౌస్‌లో చిన్న చిన్న జంతువులు ఉంటాయంటావా? అంటే, పిల్లులో ఎలుకలో?"

"అందులో ఆశ్చర్యపడాల్సింది ఏముంది? ఉంటే యేం?"

"నా మీది నుంచి ఏదో నడిచిపోయింది. అందుకే మెలకువ వచ్చింది."

"ఎలుకలు, డ్రైనేజి పైపుల నుంచి వస్తాయి. కానీ అవి మంచాలమీదకు ఎక్కుతాయని నేను ఎప్పుడూ వినలేదు."

"నిజానికి, నాకు మెలకువ రావడం ఇది రెండోసారి. మొదటిసారి కిటికీ దగ్గర ఏదో శబ్దం విన్నాను."

"ఓహో, కిటికీ దగ్గర నుంచి శబ్దం అంటే, అది పిల్లి పనే అయి ఉంటుంది."

"అవును, కాని...."

జయంత్‌కు ఇంకా ఏదో సందేహంగానే ఉంది. అడిగాను – "నువ్వు లైటు వేసిన తరువాత ఏమీ కనిపించలేదా?"

"ఏమీ కనిపించలేదు. కాని, కళ్ళు తెరిచిన వెంటనే లైటు వెయ్యలేదు. నిజం చెప్పాలంటే, నాకు మొదట భయం వేసింది. లైటు వేసిన తరువాత, ఏమీ కనిపించలేదు."

"అంటే వచ్చింది ఏదైనా అది ఇంకా గదిలోనే ఉందన్నమాట."

"అవును... రెండు తలుపులూ లోపల నుంచి గడియవేసి ఉన్నాయి. అది ఇక్కడే ఉండి ఉండాలి..."

నేను వెంటనే పైకి లేచి మంచాలకింద, మా సూట్‌కేసుల వెనుక, గదిలో ప్రతిచోటా వెదికాను. ఏమీ కనిపించలేదు. బాత్‌రూం తలుపులు వేసి ఉన్నాయి. ఆ తలుపులు తెరిచి మళ్ళీ వెదకడం మొదలు పెడుతున్నప్పుడు జయంత్ మెల్లగా పిలిచాడు, "శంకర్!"

నేను గదిలోకి వచ్చాను. జయంత్ తన పరుపు కవరువైపు చూస్తున్నాడు. కవరులో ఒకచోట నాకు చూపుతూ అన్నాడు – "ఇది చూడు"

నేను పరుపు మీదికి చూశాను. దానిమీద గోధుమ రంగులో చిన్న చిన్న వలయాలు ఉన్నాయి.

"అవి పిల్లి నడవడం వల్ల ఏర్పడ్డాయేమో."

జయంత్ ఏమీ చెప్పలేదు. ఏదో అతడిని బాగా కదిలించిందనిపిస్తోంది. కాని అప్పుడు రెండున్నర అవుతోంది. నేను ఏదోలాగ నిద్ర తెచ్చుకోవాలి. లేకపోతే నీరసపడతానని నాకు బాగా తెలుసు. అంతేగాక, మరుసటిరోజు కోటచూడటానికి వెళ్ళాలని మేము అనుకున్నాం.

అందుకని, కొద్దిసేపు అతడిని ఓదార్చే మాటలు – బాధపడకు, నేను నీ దగ్గరే ఉన్నాను, అయినా ఎవరికి తెలుసు. ఆ మరకలు దానిమీద ఇంతకుముందే ఉన్నాయేమో లాంటి మాటలు – చెప్పి లైటు తీసేసి పడుకున్నాను. జయంత్‌కు ఏదో చెడ్డకల వచ్చిందని నాకు గట్టి నమ్మకం. చిన్నతనంలోని విషయాలు గుర్తుకువచ్చి అతడి మనసు పాడయినట్లుంది. అందుకే ఏదో పిల్లి తనమీద నుంచి నడిచిపోయిందని భ్రమపడ్డాడు.

నేను మిగతా రాత్రంతా చాలా హాయిగా నిద్రపోయాను. ఏవో శబ్దాలు అంటూ జయంత్ నన్ను లేపలేదు. కాని అతడు రాత్రంతా నిద్రపోలేదని నాకు పొద్దున అనిపించింది.

“ఈ రోజు రాత్రి నాతో తెచ్చిన నిద్రమాత్రలు అతడికి ఇవ్వాలి” అనుకున్నాను.

మేము ముందే అనుకున్నట్లుగా తొమ్మిదికల్లా టిఫిన్‌చేసి కోట చూడడానికి బయలుదేరాం. అక్కడికి వెళ్ళడానికి కారు తయారుగా ఉంది. మేము కారు దగ్గరికి చేరుకునేసరికి తొమ్మిదిన్నర అయ్యింది.

తన జ్ఞాపకాల్లో తాను ఉన్నాడు. ఆ బొమ్మతో సంబంధంలేని విషయాలే గుర్తుకు వస్తున్నాయి. అతడి ప్రవర్తన చూస్తుంటే ఆ బొమ్మ గురించి పూర్తిగా మరిచిపోయినట్లేననిపించింది.

“అదిగో – గేటుమీద ఏనుగు!” అతడు ఆశ్చర్యంగా అన్నాడు.“వెండితో చేసిన పరుపు సింహాసనం, గోడమీద ఆ చిత్రం చూడు – దాన్ని నేను ఇంతకు ముందూ చూశాను.”

కాని అతడి ఉత్సాహమంతా ఒక్క గంటలోనే పోయింది. నేను నా ఆలోచనల్లో మునిగిపోయి ఆ విషయం ముందుగా గమనించలేదు. హాలులో నడుస్తూ, పై కప్పుకు వేలాడుతున్న చాండిలీర్స్ చూస్తున్న నాకు జయంత్ నా పక్కన నడవడంలేదని ఒక్కసారిగా అనిపించింది. అతడు ఎక్కడ ఉన్నాడు?

మాతోపాటు గైడు కూడా వచ్చాడు. “ ఆ బాబు పై కప్పుమీదకు వెళ్ళారు” అతడు చెప్పాడు.

నేను హాలులోంచి బయటకు వచ్చి, పై కప్పుమీద ఒక గోడ దగ్గర ఏదో ఆలోచనలో మునిగివున్న జయంత్‌ను చూశాను. నేను వెళ్ళి అతడి పక్కన నిలుచున్నా అతడు నా ఉనికిని గమనించలేదు. నేను పేరుపెట్టి పిలిచాను.

"నీకు ఏమయింది?" అడిగాను. "ఇంత అందమైన ప్రదేశంలో ఎందుకలా దిగాలుపడి నిలుచున్నావు? నేను దీనిని భరించలేకపోతున్నాను."

జయంత్ చెప్పాడు, "నువ్వు అన్నీ తిరిగి చూశావా? అయితే, ఇకమనం..."

నేను ఒక్కడినే ఉండి ఉంటే, కోటదగ్గర ఇంకా కొద్దిసేపు గడిపేవాడిని. కాని జయంత్‌ని చూడగానే సర్క్యూట్ హౌస్‌కు వెళ్ళడం మంచిదని నిర్ణయించుకున్నాను.

ఆ కొండలమధ్య రోడ్డుమీదుగా మేము టౌనుకు చేరుకున్నాము. నేను, జయంత్ కారులో వెనకసీటులో కూర్చున్నాం. అతడి ఆతృతను గమనించాను. ఒకసారి చేతులు కిటికీ దగ్గర పెడితే, తరువాత ఒళ్ళో పెట్టుకుని, వెంటనే గోళ్ళుకొరకడం మొదలెట్టాడు. జయంత్ సహజంగా చాలా ప్రశాంతంగా ఉంటాడు. అతడిలోని ఈ మార్పు నన్ను కలవరపరిచింది.

పది నిమిషాలు గడిచినతరువాత, నేను ఆగలేకపోయాను.

"నీ సమస్య ఏమిటో నాకు చెప్తే ఏమైనా ఉపయోగం ఉంటుందేమో" అన్నాను. జయంత్ తల ఊపాడు.

"నా మాటలు నువ్వు నమ్మవు, కనుక నీకు చెప్పడంవల్ల ఎటువంటి ఉపయోగమూ లేదు" అన్నాడు.

"సరే, నేను నీ మాటలు నమ్మకపోయినా, ఆ విషయం గురించి నేను మాట్లాడకూడదా?"

"నిన్న రాత్రి ఫ్రిట్జ్ మనగదిలోకి వచ్చాడు. నా పరుపు కవరుమీద ఉన్న మరకలు ఫ్రిట్జ్‌వే."

అనునయంగా అతడి భుజంమీద చెయ్యి వేయడం తప్ప నేను ఏమీ చెయ్యలేకపోయాను. అలాంటి పిచ్చి ఆలోచనలతో మెదడు పాడుచేసుకుంటూ వుంటే, అతడికి మంచి మాటలు ఎలా చెప్పగలను?

"నువ్వు, ప్రత్యక్షంగా దేన్నీ చూడలేదు కదా?"

"లేదు. కానీ నా మీదుగా వెళ్ళింది ఏదైనా, దానికి రెండు కాళ్ళు వున్నాయిగాని, నాలుగు కాళ్ళు లేవని నాకు బాగా అనిపించింది."

కారులో సర్క్యూట్ హౌస్‌కు వచ్చిన తరువాత ఆందోళన పోగొట్టడానికి టానిక్‌లాంటిది ఏదైనా ఇవ్వాలని అనుకున్నాను. ముప్పై ఏడేళ్ళ వ్యక్తి అలా తన చిన్ననాటి జ్ఞాపకాలతో బాధపడడం నాకు నచ్చలేదు.

మేము మా గదికి చేరుకోగానే నేను జయంత్‌తో అన్నాను – "ఇప్పుడు పన్నెండవుతోంది. స్నానాలు చేద్దామా"

"ముందు నువ్వు చెయ్యి" జయంత్ అంటూ మంచం మీద పడుకున్నాడు.

స్నానం చేస్తున్నప్పుడు నాకొక ఆలోచన వచ్చింది. జయంత్‌ను మామూలు మనిషిని చెయ్యడానికి ఇదొక్కదారే మిగిలి ఉంది.

ఏదైనా బొమ్మను ముప్ఫై ఏళ్ళక్రితం పూడ్చి ఉంటే, పూడ్చినచోటు ఎవరికైనా తెలిసి ఉంటే, అక్కడ తవ్వి దాన్ని బయటకు తియ్యొచ్చు.

అది పూర్తిగా పాడయి ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు. అయినా లోహంతో చేసినవి ఏవైనా మిగిలి ఉంటాయి. ఆ వస్తువులను జయంత్‌కు చూపిస్తే తన ఆలోచనలు ఎంత హాస్యాస్పదంగా ఉన్నాయో తనకే తెలుస్తుంది. లేకపోతే, జయంత్‌కు తనమీద ఫ్రిట్జ్ నడిచినట్లు పిచ్చికలలు రావడం మానవు. ఇలాగే జరగనిస్తే అతడికి పూర్తిగా పిచ్చిపట్టినా పట్టవచ్చు.

జయంత్‌కు మొదట నా ఆలోచన నచ్చింది. కాని కొద్దిసేపటి తరువాత అన్నాడు – "తవ్వకం పని ఎవరు చేస్తారు. పారలు ఎక్కడ దొరుకుతాయి?"

నేను నవ్వాను, "ఇక్కడ తోటవుంది, కనుక తోటమాలి ఉంటాడు. అంటే పార తప్పకుండా ఉంటుంది. మనం అతడికి కొంచెం డబ్బు ఇస్తే ఆ చెట్టుకాండం దగ్గర తవ్వడానికి ఎటువంటి అభ్యంతరమూ చెప్పడు."

"నువ్వు అడుగుతావా. లేక నేను అడగనా?"

జయంత్ ప్రశ్న విని నేను అభయహస్తం చూపించి, ఆ తోటమాలివైపు నడిచాను. నా మాటలువిని అతడు కాస్త సందేహంగా చూశాడు. అతడిని ఇంతకు ముందెవరు ఎప్పుడూ అలాంటి సహాయం అడిగివుండరు. "ఎందుకు, బాబూ!" అని అడిగాడు. నేను అతడి భుజంమీద స్నేహంగా చెయ్యివేసి అన్నాను – "కారణాల గురించి ఆలోచించకు. నీకు ఐదు రూపాయలిస్తాను. దయచేసి నీకు చెప్పింది చెయ్యి."

అతడు చాల సంతోషపడ్డాడు. ముఖంనిండా నవ్వుతో నాకు నమస్కారం చేశాడు.

ఇంకా వరండాలోనే కూర్చుని వున్న జయంత్‌ని పిలిచాను. అతడు లేచి నా వైపు వచ్చాడు. దగ్గరికి వస్తూండగా, అతడిముఖంలో ఆనందాన్ని నేను గమనించాను.

ఆ బొమ్మలో కొంత భాగమైనా చూడగలమని నా ఆశ.

అంతలో తోటమాలి ఒక పార తెచ్చాడు. ముగ్గురం దేవదారు చెట్టువైపు నడిచాం.

చెట్టుకాండం దగ్గర నుంచి ఒక గజం దూరంలో ఉన్న ప్రదేశాన్ని చూపి జయంత్ “ఇక్కడే” అన్నాడు.

“నీకు బాగా తెలుసు కదూ?” అడిగాను.

జయంత్ మౌనంగా తల ఊపాడు.

“నువ్వు ఎంత లోతుగా తవ్వావు?”

“కనీసం ఎనిమిది అంగుళాలు”

తోటమాలి తవ్వడం మొదలుపెట్టాడు. అతడు మంచి మాటకారి కూడా. పార ఎత్తిపట్టుకుని అక్కడ దాచిపెట్టిన ఖజానా ఏదైనా ఉందా అని అడిగాడు. ఉంటే గనుక తనకు కూడా ఖజానాలో భాగం ఇవ్వడానికి తయారుగా ఉండమని చెప్పాడు. ఆ మాటలకు నేను నవ్వాను. జయంత్ చిరునవ్వు కూడా నవ్వలేదు. అది అక్టోబరు నెల కావడంవల్ల బుండీలో అస్సలు వేడిగా లేదు. అయినా అతడి కాలరు దగ్గర చెమట పడుతోంది. నేలవైపు కన్నార్పకుండా చూడసాగాడు. తోటమాలి తవ్వడం అపలేదు. బొమ్మ ఇంకా కనపడదేం?

నెమలి అరిచిన అరుపు విని తల తిప్పాను. అప్పుడే జయంత్ విచిత్రమైన శబ్దం చేశాడు. నేను అతడివైపు చూశాను. అతడి కళ్ళు పెద్దవవుతున్నాయి. అతడు కుడిచెయ్యి ఎత్తి వణుకుతున్న వేలితో నేలవైపు చూపించాడు.

తరువాత, అతడు బొంగురు గొంతుతో, అన్నాడు “అది...అది ఏమిటి?”

తోటమాలి పార కింద పడేశాడు. నేలవైపు చూసి నేను కూడా భయంతో నోరు తెరుచుకొని, ఉండిపోయాను.

అక్కడ, మా కాళ్ళదగ్గర, దుమ్ముకొట్టుకుని, వెల్లకిలా పడివుంది. పన్నెండు అంగుళాల చాల తెల్లని మానవ అస్థిపంజరం.



# గగన్ చౌదరి స్టూడియో

కొన్ని అపార్ట్‌మెంట్‌లు చూడగానే సౌకర్యంగా కనిపించినా, వాటిలో చేరిన తరువాత చిన్న, చిన్న లోపాలు బయటపడతాయి. భవానిపూర్‌లోని ఫ్లాట్‌లో చేరినపుడు సుధీన్ సర్కారుకు ఇటువంటి అనుభవమే ఎదురయింది. ఎన్నో విషయాల్లో అతనికి సహకరించిన అదృష్టదేవత ఈ విషయంలో చిన్నచూపు చూసింది.

అతడికి వచ్చిన ప్రమోషనే ఒక ఉదాహరణ. అతడిప్పుడు తన ఆఫీసులో ఒక శాఖకు అధిపతి. అతడివలె ముప్పై ఒక్క సంవత్సరాలకే ఇన్ని మెట్లు ఎక్కడం ఎంతోమందికి సాధ్యమయ్యే పని కాదు. ఇంతకుముందు శాఖాధిపతి నాగేంద్ర కపూర్. నలభయ్యేళ్ళ నాగేంద్రకపూర్ ఎత్తుగా అందంగా ఉండేవాడు. సమర్థుడని పేరు. లేత గ్రే కలర్ సఫారీ సూట్ వేసుకుని ఆఫీసులో అడుగుపెట్టగానే అందరి కళ్ళు ఆయనవైపే తిరిగేవి. అటువంటి నాగేంద్ర కపూర్ గుండెపోటుతో గోల్ఫ్ కోర్సులో పడిపోయి మరణిస్తారని ఎవరూహించగలరు?

ఆయన మరణం సుధీన్ ప్రమోషన్‌కు దారితీయడం చాల సహజంగా జరిగిపోయింది. ఇది సుధీన్‌కు పట్టిన అదృష్టం మాత్రమేనని అనలేం. ఆ ప్రమోషన్‌కు సుధీన్ అర్హుడుకాడని ఎవరూ అనలేరు.

ప్రమోషన్ తరువాత సుధీన్ కొత్త ఫ్లాట్‌లో చేరాడు. తల్లిదండ్రులు అతనికి పెళ్ళిచేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. పావురాయి గూడులాంటి తన

పాత ఫ్లాట్‌లోకి కొత్త వ్యక్తిని ఆహ్వానించడం కష్టమని సుధీన్ అనుకున్నాడు. పాత ఫ్లాట్‌లో వుండడం రాను రాను కష్టమయిపోయింది. అంతేగాక అక్కడికి దగ్గర్లోవున్న ఒక ఇంటిని పెళ్ళిళ్ళకోసం ఇచ్చేవారు. గ్రామఫోను రికార్డులతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయేది. ఆ గోలకు సుధీన్‌కు పిచ్చెత్తినట్లు వుండేది. మొట్టమొదట భవానిపూర్‌లో వున్న ఈ ఫ్లాట్ గురించే ఇళ్ళ బ్రోకర్ సుధీన్‌కు చెప్పాడు.

మొదటి అంతస్తులో, మూడు పెద్ద బెడ్‌రూములు, రెండు బాత్‌రూములు, దక్షిణం వైపున వరండా, మొజాయిక్ ఫ్లోరింగ్, గ్రిల్స్‌వున్న కిటికీలు – ఇవన్నీ మంచి ప్లాన్‌కీ, అభిరుచికీ అద్దం పడుతున్నాయి.

నెలకు ఎనిమిదివందలు అద్దె. ఇంటి యజమాని కూడా మంచివాడే. సుధీన్‌కు ఇక ఇంటికోసం వెదికే కష్టం తప్పింది.

చేరిన మొదట్లో గమనించలేదు గాని, రెండు వారాల తరువాత ఒకరాత్రి, కళ్ళల్లో వెలుగు పడుతుండటంవల్ల అతనికి మెలకువ వచ్చింది. ఇంత రాత్రి ఆ వెలుతురు ఎక్కడ నుంచి వస్తోంది?

సుధీన్ వరండాలోకి వెళ్ళి చూశాడు. ఎదురింటి రెండో ఫ్లోర్‌లో నుంచి వస్తున్న కాంతి తప్ప ఆ ప్రదేశమంతా చీకటిగా వుంది. ఆ వెలుతురు తెరిచివున్న కిటికీలోంచి వచ్చి వరండా గుండా ప్రయాణించి అతడి బెడ్‌మీద పడుతోంది. బెడ్‌మీద ఎలా పడుకున్నా ఆ వెలుతురు అతని కళ్ళల్లో పడుతుంది.

గది పూర్తిగా చీకటిగా వుంటే తప్ప సుధీన్‌కు నిద్ర పట్టదు. మరి, ప్రతి రాత్రి ఇలాగే వుంటుందా?

వారం రోజుల్లో సుధీన్ అనుమానం నిజమని తేలింది. ప్రతిరాత్రి, అర్ధరాత్రి వేసిన లైటు పొద్దుపొడిచే దాక వుండేది. తన కిటికీ మూసివేయడం సుధీన్‌కు ఇష్టంలేదు, కలకత్తాలో, దక్షిణం వైపు వున్న కిటికీ వుండటం చాలా ఉపయోగకరం, గాలి రాకుండా అడ్డంగా ఏదైనా బిల్డింగ్ ఉంటే తప్ప. ఎదురిల్లు చాలా పాతబడి పోయింది. అది ఒకప్పుడు ఎవరో జమిందారుదై ఉండొచ్చు. అక్కడ ఇప్పుడిప్పుడే ఇల్లు కట్టే సూచనలు కూడా లేవు. చూస్తూ వుంటే అక్కడ నివసించే వాళ్లు కూడా  చాలా తక్కువ మందే ఉన్నట్లున్నారు.

మరి, రెండో అంతస్తులోని ఆ గదిలో ఎవరు ఉంటున్నారు?

అందులో వుండేవాళ్లు రాత్రంతా ఎందుకని లైటువేసి వుంచుతున్నారు?

కింది అంతస్తులో సోమేశ్వరనాగ్ ఉంటున్నారు. ఆయన సుధీన్ కంటే నాలుగు నెలల ముందు అక్కడ చేరారు. ఎక్కువగా సాయంత్రాలు బెంగాల్ క్లబ్‌లో గడిపేవారు. ఆయన వయస్సు యాభై దాటి వుంటుంది. ఒక శనివారం నాడు సుధీన్‌కు ఆయన తారసపడ్డాడు. సుధీన్ ఆయనను అడగకుండా వుండలేకపోయాడు.

"ఎదురింట్లో ఎవరు వుంటున్నారో మీకు తెలుసా?"

"చౌదరి గారు వుంటున్నారు. ఎందుకని? ఏమైనా జరిగిందా?"

"లేదు, ఆ ఇంట్లో ఎక్కువ మంది వున్నట్లు లేరు. అయినా రాత్రులు లైటు వేసి వుంచుతున్నారు. మీరెప్పుడూ గమనించలేదా?"

"లేదు. నేను గమనించలేదు."

"ఆ వెలుతురు మీ గదిలో పడదా?"

"లేదు. నిజానికి అక్కడ అట్లాంటి గది ఒకటుందని కూడా నాకు తెలియదు. కింది నుంచి ఆ గది కనిపించదు."

"మీరు అదృష్టవంతులు. ఆ వెలుతురు వల్ల నాకు రాత్రులు నిద్రపట్టడం లేదు."

"ఆశ్చర్యంగా వుందే. ఆ ఇంట్లో ఇద్దరు మనుషులు వుంటున్నారని నాకు తెలుసు. అది గగన్ చౌదరి ఇల్లు. ఆయన ఎప్పుడోగాని బయటికి వెళ్ళరు. నేను ఆయననెప్పుడు చూడలేదు గాని ఆయన బ్రతికే వున్నారు. చాలా వృద్ధులైపోయి ఉంటారు. ఆయన ఒకప్పుడు బొమ్మలు గీసేవారని విన్నాను. మీరు ఒకసారి ఆయనతో మాట్లాడవచ్చు కదా? మీ ఇబ్బంది తెలిస్తే ఆయన కిటికీ మూసుకోవచ్చు. తన చుట్టుపక్కలవారి గురించి పట్టించుకుంటా రనుకుంటాను."

గగన్ చౌదరి తన విజ్ఞప్తిని మన్నిస్తారని గ్యారంటీ లేకపోయినా సుధీన్ ఆయనతో మాట్లాడాలనుకున్నాడు. కానీ, ఆ గదిలో ఏం జరుగుతోంది? ఆ వెలుతురు వల్ల వున్న ఇబ్బందితో పాటు ఆ గదిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న కుతూహలం సుధీన్‌ను పట్టి పీడించసాగింది.

సుధీన్ స్నేహితుడు మహిమ్ రేసులకు వెళతాడు. అతని దగ్గర పెద్ద బైనాక్యులర్స్ ఉంది. ఆ గది దూరంగా ఉంది గనుక బైనాక్యులర్స్ ఉపయోగకరం. చౌదరిగారి ఇల్లు రోడ్డుకు ఆనుకుని లేదు.

మహిమ్ ఇచ్చిన బైనాక్యులర్స్ ఆ గదిని ఎంతో దగ్గరికి తెచ్చినా కర్టెన్ మీది నుంచి కనిపిస్తున్న గోడ తప్ప ఏమీ కనిపించలేదు. సుధీన్‌కు గోడ మీద వేలాడదీసిన రెండు తైలవర్ణ చిత్రాలు కనిపించాయి. అది గగన్ చౌదరి స్టూడియోనా? అందులో ఇప్పుడు ఎవరూ పనిచేయటం లేదా?

అవును. అక్కడెవరో పనిచేస్తున్నారు. అటూ ఇటు తిరుగుతున్న ఒక నీడ కనిపించింది. కాని, ఆ నీడ ఎవరిదో కనుక్కోవటం అసాధ్యం.

పదిహేను నిమిషాలసేపు బైనాక్యులర్స్‌లోంచి చూసి సుధీన్ అలిసిపోయాడు. నిద్రవచ్చే కొద్దిపాటి అవకాశాలను పోగొట్టుకుని ఇలా సమయం వృధాచేయడం ఎంత తెలివితక్కువ పని!

బైనాక్యులర్స్ పక్కనబెట్టి సుధీన్ నిద్రకుపక్రమించాడు.

రేపు తను గగన్‌చౌదరి దగ్గరికి వెళ్ళి ఆ కిటికీ మూసేయమని అడుగుతాడు. ఆయన వప్పుకుంటే మంచిదే. లేకపోతే తానే ఈ పరిస్థితులకు అలవాటుపడాలి. గగన్ చౌదరి ఎటువంటి మనస్తత్వం కలవాడో తెలిసుంటే బాగుండేది.

ఇలా ఆలోచిస్తూ సుధీన్ నిద్రపోయాడు.

గేటు తెరిచి వుంది. అక్కడ చౌకిదార్ కూడా లేదు. మొట్టమొదటి ఆటంకాన్ని సులువుగా దాటినందుకు సుధీన్‌కు సంతోషంతోపాటు ఆశ్చర్యం కలిగింది. తెరిచివున్న కిటికీలోంచి పడుతున్న వెలుతురు తనను ఎంతగా ఇబ్బంది పెడుతోందో, గగన్‌చౌదరికి చూపించేందుకు సుధీన్ రాత్రివేళ అక్కడికి వచ్చాడు.

అప్పుడు రాత్రి పదకొండు గంటలయింది. చుట్టుపక్కల అంతా నిశ్శబ్దంగా వుంది. నిన్ననే పౌర్ణిమకావడంవల్ల చౌదరిగారి తోట వెన్నెట్లో బాగా కనిపిస్తోంది. సుధీన్ ఒక అప్సరస పాలరాతి విగ్రహం దాటి ముఖద్వారం నల్లటిగోడల దగ్గరకు వచ్చాడు. రెండో అంతస్తులో లైట్‌వేసి లేదు. అదృష్టంకొద్దీ తనకు చౌదరిగారు కింది అంతస్తులోనే కనిపించవచ్చు. అతడు తలుపు

తట్టిన వెంటనే పనివాడిలా కనిపిస్తున్న ఒక మధ్య వయస్కుడు వచ్చి తలుపు తెరిచాడు.

"ఎవరు కావాలి?" అతడు అడిగాడు.

"చౌదరిగారు – గగన్ చౌదరిగారు – ఆయన పడుకున్నారా?"

"లేదు"

"ఆయనను కలుసుకోవచ్చా? నా పేరు సుధీన్ సర్కార్. ఎదురుగ్గావున్న మేడలో వుంటున్నాను. ఒక అర్జెంట్ పనిమీద వచ్చాను."

అతడు లోపలికి వెళ్ళి కొద్దిసేపటి తర్వాత బయటకు వచ్చి "దయచేసి లోపలికి రండి" అని అన్నాడు.

అంతా సాఫీగా జరిగిపోతోంది. ఇది సుధీన్‌కు కాస్త ఆశ్చర్యం కలిగించింది.

సుధీన్ లివింగ్ రూమ్‌లోకి వెళ్ళాడు.

"దయచేసి కూర్చోండి"

కిటికీలోంచి వెన్నెల ఒక సోఫామీద పడుతోంది. సుధీన్ దారి చూసుకుంటూ వెళ్ళి దానిమీద కూర్చున్నాడు. అతను ఎందుకని లైట్ వెయ్యడు? కరెంట్ పోలేదని తనకు రూఢిగా తెలుసు.

సుధీన్ గది చుట్టూ చూడసాగాడు. ఇంతలో, అతని గుండె ఒక్కసారి ఆగిపోయి, మళ్ళీ కొట్టుకోసాగింది. జనంతో నిండిపోయివున్న గదిలోకి వచ్చాడా తను? తననే చూస్తున్న వీళ్ళంతా ఎవరు?

చీకటికి తన కళ్ళు అలవాటు పడగానే, తనవైపు చూస్తున్న కళ్ళు మనుషులవి కావని, అవి మాస్కులు మాత్రమే అని సుధీన్‌కు అర్థమయింది. ప్రతీ మాస్క్ కళ్ళు తనవైపే తిప్పినట్లు సుధీన్‌కు అనిపించింది. ఆ మాస్కులన్నీ విదేశాలనుంచి వచ్చినవేనని సులభంగా ఊహించవచ్చు. చాలవరకు ఆఫ్రికానుంచి, కొన్ని దక్షిణ అమెరికా నుంచి వచ్చినట్టున్నాయి. సుధీన్ కూడా ఒకప్పుడు చిత్రకళ అంటే ఇష్టపడేవాడు. నిజానికి, తండ్రి ఒప్పుకుని వుంటే, ఇవాల్టికి తాను చిత్రకళ వృత్తిగా జీవిస్తూ వుండేవాడు. అతనికిప్పటికీ చిత్రకళ అన్నా, హస్తకళలన్నా చాల ఇష్టం.

సుధీన్ తన ధైర్యాన్ని తాను మెచ్చుకోకుండా వుండలేకపోయాడు.

ఇంత చీకటి గదిలో, భయంగొలిపే వాతావరణంలో, చుట్టూ భయంకరంగా వున్న మాస్కులతో ఆ గదిలోకి ఇంకొకరు వచ్చివుంటే ఇప్పటికి వాళ్ళకు గుండెపోటు వచ్చేది.

ఆ గదిలోకి ఎవరో రావడం సుధీన్ చూడలేదు.

గంభీరమైన గొంతు విని సుధీన్ ఉలిక్కిపడ్డాడు.

అతడు చుట్టూ చూశాడు. పక్కనున్న సోఫాలో కూర్చునివున్న ఒక వ్యక్తి కనిపించాడు.

"మీరు ఇంతరాత్రివేళ రావటానికి కారణమేమిటి?"

సుధీన్ నమస్కరిస్తున్నట్లుగా చేతులు ఎత్తాడు కాని, ఆయన ప్రశ్నకు జవాబివ్వటానికి గొంతులోంచి ఒక్కమాట కూడా పెగలలేదు.

ఆ వ్యక్తి జమీందారీ వంశీయుడనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆయన కప్పుకున్న ఖరీదైన శాలువాయే దానికి సాక్ష్యం. కాని అంతగా ప్రేతకళ వున్న మొహాన్ని, అలా గుచ్చుతున్నట్లుండే చూపుల్నీ సుధీన్ ఎప్పుడూ చూడలేదు. ఇటువంటి వ్యక్తిని మొట్టమొదటిసారి చూసిన ఎవరైనా చేష్టలుడిగిపోతారు.

ఆయన సుధీన్ వంక అలాగే చూడసాగాడు. తనను తాను కూడదీసుకోవటానికి సుధీన్‌కు ఒక నిమిషం పట్టింది. తరువాత, చివరికి, నాలుకని స్వాధీనంలోకి తెచ్చుకుని,

"నేను...మరే.... ఒక కష్టం చెప్పుకోవడానికి వచ్చాను. దయచేసి ఏమీ అనుకోవద్దు. మీరు గగన్ చౌదరిగారే అనుకుంటాను?"

ఆయన తల ఊపాడు. ఆయన జుట్టు సింహం జూలులా నుదురుమీద పడుతోంది. ఆయనకు అరవైఐదు ఏళ్ళు ఉండొచ్చుననుకున్నాడు సుధీన్.

"నా పేరు సుధీన్ సర్కార్. ఎదురు భవంతి మొదటి అంతస్తులో వుంటున్నాను. సంగతేంటంటే మరే... రెండో అంతస్తులోని మీ గదిలోనుంచి వస్తున్న వెలుతురు వల్ల నాకు నిద్రపట్టడం లేదు. ఆ వెలుతురు సూటిగా నా కళ్ళల్లో పడుతోంది. మీ కిటికీ మూసేసుకోమని నేను మిమ్మల్ని కోరవచ్చా? పగలంతా కష్టపడి వచ్చే నాలాంటి వాడికి ఆ వెలుతురువల్ల ఎంత కష్టంగా వుంటుందో మీకు తెలుసు....."

ఆయన అలాగే తనను చూస్తున్నారు. ఆ గదిలో ఒక్క లైట్ కూడా లేదా?

సుధీన్ విషయం ఇంకొంచెం పొడిగించడం అవసరం అనుకున్నాడు. “ఇప్పుడు నాకు అర్థమవుతోంది. నాకు కళ్ళలో వెలుతురు పడకుండా ఉండాలంటే ఒకటే మార్గం. నా గది కిటికీ మూసేసుకోవాలి. కాని నా కిటికీ దక్షిణంవైపు వుంది. అందువల్ల మూసెయ్యడానికి నా మనస్సు ఒప్పుకోవడం లేదు....”

“లేదు. మీరు మీ కిటికీ మూసెయ్యనక్కరలేదు.”

“మరి...?”

“నేను నా కిటికీ మూసేసుకుంటాను”

సుధీన్‌కు భుజాల మీదనుంచి పెద్ద బరువు తీసేసినట్లనిపించింది.

“మీరు చాలా మంచివారు. నేను మీకు నిజంగా ఋణపడివుంటాను.”

“వెళ్ళిపోతున్నారా?”

వెళ్ళిపోవడానికి సోఫాలోంచి సగం లేచిన సుధీన్, ఆ ప్రశ్న విని, ఆశ్చర్యపడి, మళ్ళీ కూర్చున్నాడు.

“చాలా పొద్దుపోయింది. మీరు నిద్రపోతారనుకుంటాను?” అతనన్నాడు.

“నేను రాత్రులు నిద్రపోను”

ఆయన కళ్ళు ఇంకా సుధీన్‌మీదే వున్నాయి.

“మీరు ఎక్కువగా చదువుతారా?” సుధీన్ అడిగాడు. అతని గొంతు కొద్ది కొద్దిగా తడారిపోసాగింది. ఇలాంటి వాతావరణంలో గగన్ చౌదరితో వుండటం కష్టమే.

“లేదు”

“మరి మీరేం చేస్తారు?”

“బొమ్మలు వేస్తుంటాను”

తను బైనాక్యులర్స్‌తో చూసినప్పుడు కనిపించిన రెండు తైలవర్ణచిత్రాలు సుధీన్‌కు గుర్తుకు వచ్చాయి.

చౌదరిగారు బొమ్మలు వేస్తారని నాగ్‌గారు కూడా చెప్పారు.

“అంటే ఆ గది మీ స్టూడియోనా?”

“అవును మీరు సరిగ్గా ఊహించారు”.

"చుట్టుపక్కల వున్న చాలామందికి ఈ విషయం తెలీదనుకుంటాను."

గగన్‌చౌదరి వంకరగా నవ్వి "మీరు కొంత సమయం నాతో గడపగలరా?"

"ఇప్పుడా? అంటే...."

"మీకు కొన్ని విషయాలు చెప్పాలని వుంది. నాకు చాలారోజులుగా మాట్లాడాలని వుంది. అవకాశం రాలేదు."

సుధీన్ ఆయన మాట కాదనలేక "సరే" అన్నాడు.

"నా చుట్టువున్న వాళ్ళకు నేను చేసే పనిమీద ఆసక్తి లేకపోవడంవల్ల నేనేం చేస్తున్నానో వాళ్ళకు తెలీదు. చిత్రకారుడిగా జీవితం గడిపిన వ్యక్తి గురించి తెలుసుకోవాలని ఒక్కరికి కూడా ఇసుమంతైనా అనిపించలేదు. ఒకప్పుడు నేను నా బొమ్మల ప్రదర్శన పెట్టేవాడిని. నేను గీసిన బొమ్మల్ని కొంతమంది చూశారు. వాళ్ళలో కొంతమంది నా బొమ్మలను మెచ్చుకున్నారు కూడా . కాని, తరువాత్తరువాత చిత్రకళలో వచ్చిన మార్పులవల్ల నా పద్ధతిలో బొమ్మలు వేసేవారి ప్రాముఖ్యత తగ్గిపోయింది. నేను కూడా బొమ్మలు వేయడం మానేశాను. కొత్తగా వచ్చిన చిత్రకళవైపు నా దృష్టి వెళ్ళలేదు. లియోనార్డో డా విన్సీని నా మనస్సులో గురువుగా పూజించాను, పూజిస్తున్నాను."

"కానీ.... మీరు ఎలాంటి బొమ్మలు గీస్తారు?"

"మనుషులు"

"మనుషులా?"

పోర్ట్రయిట్స్"

"ఊహించి వేస్తారా?"

"కాదు అలా చిత్రాలు గీయడం నాకు అలవాటులేదు. ఎవరో మోడల్‌గా లేకపోతే నేను గీయలేను"

"మధ్యరాత్రిలో?"

"ప్రతిరాత్రి నా దగ్గరకు మోడల్స్ వస్తారు"

ఏం చెప్పాలో సుధీన్‌కు అర్థం కాలేదు. ఈయన ఏం మాట్లాడుతున్నాడు? ఆయనకేమయినా కొద్దిగా పిచ్చా?

" ఈమాట మీకు నమ్మబుద్ధికావడం లేదు కదూ?" ఆయనే అడిగాడు. ఆయన పెదవులపై చిరునవ్వు. సుధీన్ ఏమీ మాట్లాడలేదు.

"నాతో రండి".

సుధీన్ ఎదురు చెప్పలేకపోయాడు. ఆయన కళ్ళల్లో, మాటల్లో ఏదో వశీకరణశక్తి వుంది. అంతేగాక, ఆయన ఎటువంటి చిత్రాలు గీస్తాడో తెలుసుకోవాలనిపించింది. మధ్యరాత్రి అతనికి మోడల్‌గా వుండటానికి ఎవరు వస్తారు? వాళ్ళను చౌదరిగారు ఎక్కడ నుంచి తీసుకువస్తారు?

మెట్లు ఎక్కుతూ గగన్‌చౌదరి "నా స్టూడియోలో మాత్రమే ఎలక్ట్రిక్ కనెక్షన్‌పెట్టించాను" అన్నాడు. మెట్లమీద కిరోసిన్ ల్యాంప్‌వల్ల పడుతున్న వెలుతురు తప్ప ఇంకేమీ లేదు. "ఇంట్లో మిగతా గదులలోని కరెంట్ తీసేయించాను" గగన్ చౌదరి మళ్ళీ అన్నాడు.

మెట్ల మీదుగా వున్న గోడలమీద ఒక్క బొమ్మ కూడా లేకపోవడం చూసి సుధీన్ ఆశ్చర్యపోయాడు.

రెండో అంతస్తులోకి వెళ్ళి ఎడమవైపు తిరగగానే ఒక తలుపు కనిపించింది. చౌదరిగారు తలుపు తెరిచి, సుధీన్ కూడా లోపలికివచ్చాక, మళ్ళీ మూసేశాడు. తరువాత ఆయన స్విచ్ నొక్కగానే ఆ గదంతా వెలుగుతో నిండిపోయింది.

ఇదేనన్న మాట స్టూడియో. ఒక చిత్రకారుడి దగ్గర వుండవలసినవన్నీ ఆ గదిలోవున్నాయి. దీపం కింద చిత్రానికి ఆధారంగా వుండే చట్రం, కొత్త, తెల్లటి కాన్వాస్ వున్నాయి. చౌదరిగారు కొత్త వర్ణచిత్రం మొదలు పెట్టబోతునట్లుంది. బొమ్మ గీయడానికి అవసరమయిన వస్తువులతోపాటు, పెద్ద సంఖ్యలో పోర్ట్రెయిట్స్ ఆ గదిలోకి వచ్చిన వారిని ఆకర్షిస్తాయి. ఎన్నో బొమ్మలు నేలమీద పేర్చబడి వున్నాయి. కనీసం వంద బొమ్మలయినా ఉండొచ్చు. ఒక్కొక్కటి తీసి చూస్తేగాని సరిగ్గా కనిపించవు. తమనే చూస్తున్నట్లుగా వున్న బొమ్మలు గోడలమీద వున్నాయి. వాటిలో చాలావరకు మగవాళ్ళ పోర్ట్రెయిట్స్. వాటి వెనుక అనుభవజ్ఞుడైన చేయి తిరిగిన ఒక చిత్రకారుడు సుధీన్ కళ్ళకు కనిపించాడు. అవన్నీ పాత సంప్రదాయానికి అనుగుణంగా గీసినవే. ఎంతోమంది వున్న గదిలోకి వచ్చినట్లుగా సుధీన్‌కు మరోసారి అనిపించింది. దాదాపు యాభైజతల కళ్ళు అతన్నే చూస్తున్నాయి.

కాని వీళ్ళంతా ఎవరు? కొన్ని ముఖాలు తెలిసినట్లుగా వున్నాయి. కానీ....

"ఇవి మీకు నచ్చాయా?" గగన్‌చౌదరి అడిగాడు.

"అరుదైన చిత్రకారుడి పనితనం" సుధీన్ ఒప్పుకున్నాడు.

"కాని, తైలవర్ణ చిత్రాల సంప్రదాయమంతా తుడిచిపెట్టుకుపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో, నాలాంటి చిత్రకారుడు ఏ విధంగా మనగలడు చెప్పండి?

"కాని ఈ గది చూసిన తర్వాత మీకు పనిలేదని ఎలా అనుకోవడం?"

"అవును, ఈ పని నాకు ఈ మధ్యనే దొరికింది. దానికంటే ముందు, నేను పేపర్లో ఎన్నో ప్రకటనలిచ్చాను. ఒక్కరు కూడా రాలేదు. చివరికి ఇక ప్రకటనలివ్వడం మానేశాను."

"తర్వాత? మీరు మళ్ళీ ఎలా మొదలుపెట్టారు?"

"పరిస్థితులు మారిపోయాయి"

తన దృష్టి అంతా పెయింటింగ్స్‌మీద వుండటంవల్ల సుధీన్ ఏమీ మాట్లాడలేదు. అందులో ముగ్గుర్ని గుర్తు పట్టగలిగాడు. ఒకరు నాలుగు నెలల క్రితం చనిపోయారు. ఆయన మంచి పేరున్న గాయకుడు. ఆయన పేరు అనంత లాల్‌నియోగి. ఎనిమిదేళ్ళ క్రితం ఆయన గాత్ర కచేరికి సుధీన్ వెళ్ళాడు. రెండవవారు అశియనానందస్వామి. ఆయన మొదట స్వాతంత్ర్యం కోసం పోరాడి చివరకు సన్యాసుల్లో కలసిపోయాడు. ఆయన కూడా ఒక సంవత్సరం క్రితం చనిపోయాడు. పత్రికలలో వచ్చిన ఆయన ఫొటో సుధీన్‌కు గుర్తుకు వచ్చింది.

మూడవ చిత్రం ఎయిర్ ఇండియాలో పనిచేసిన బెంగాలీ పైలెట్ కెప్టెన్ చక్రవర్తిది. లండన్‌కు వెళుతున్నప్పుడు ఆయన నడుపుతున్న విమానం కూలిపోవటంతో అందులో ప్రయాణిస్తున్న యాభై మందితోపాటు ఆయన కూడా చనిపోయారు. ఆఫీసు పనిమీద రోమ్‌కు వెళ్ళినప్పుడు సుధీన్ ఆయన్ని కలిశాడు.

ఆ సమయంలో సుధీన్ ఒక ప్రశ్న అడగకుండా వుండలేకపోయాడు. "వీళ్ళందరు తమ బొమ్మలు వేయించుకోవడానికి వచ్చారా? తమ బొమ్మల్ని తాము తీసుకెళ్ళారా?"

మొట్టమొదటిసారి గగన్‌చౌదరి గట్టిగా నవ్వడం సుధీన్ విన్నాడు.

"లేదు సర్కార్‌గారూ! వీళ్ళెవరికీ తమ బొమ్మలు తమకు అవసరంలేదు. నా సొంత కలెక్షన్‌కు మాత్రమే వేసుకున్నాను."

‘‘అంటే ఇలా మోడల్‌గా వుండడానికి ఎవరో ఒకరు వస్తారనుకుంటున్నారా? ప్రతి రాత్రీనా?”

“అవును. నా ఉద్దేశమేమిటో కొద్దిసేపట్లో మీరే తెలుసుకుంటారు. ఈ రోజు ఎవరో ఒకరు వస్తారని నాకు రూఢిగా తెలుసు.”

సుధీన్ తల తిరగసాగింది.

“కానీ...కానీ...వీళ్ళందరినీ మీరు ఎలా కలుసుకుంటారు?”

“ఆగండి. వివరంగా చెబుతాను. నా పద్ధతి కొద్దిగా వేరుగా వుంటుంది.”

చౌదరిగారు అరలోంచి లెడ్జర్ బుక్‌తెచ్చి సుధీన్ ముందుపెట్టి – “దీన్ని తెరిచి, ఏముందో చూడు”.

దీపం దగ్గరకు తీసుకెళ్ళి సుధీన్ పుస్తకం తెరిచాడు. అది క్లిప్పింగ్‌లతో, పత్రికల కటింగ్‌లతో వున్న స్క్రాప్ బుక్. వాటిలో కొన్ని జబ్బుపడ్డవారి ఫొటోలు వున్నాయి. కొన్నిటికి పెన్సిల్ గుర్తు పెట్టబడి వుంది.

“ఆ పెన్సిల్ గుర్తు పెట్టిన బొమ్మలు పూర్తయ్యాయి” అన్నాడు చౌదరి.

“కాని మీరు వీళ్ళందర్నీ ఎలా కలుసుకుంటారో చెప్పనేలేదు....”

గగన్‌చౌదరి సుధీన్ చేతిలోంచి స్క్రాప్ బుక్ తీసుకుని అరలో పెట్టాడు. సుధీన్ వైపు తిరిగి ఇలా అన్నాడు “చాలా మంది ఇలా చెయ్యలేరు. కాని నేను ఒక మినహాయింపు. ఈ పద్ధతిలో ఉత్తరం రాయడం, ఫోన్ చెయ్యడం కుదరదు. వీళ్ళను కలుసుకోవడానికి ఎలాంటి ఇతర ఆధారాలు లేవు. వాళ్ళుండే చోట టెలిఫోన్ వుండదు. వాళ్ళను చేరుకోవడానికి పూర్తిగా వేరే పద్ధతి ఉపయోగిస్తాను.” సుధీన్ రక్తం చల్లబడ్డది. గొంతు ఎండిపోసాగింది. అయినా ఒక ప్రశ్న అడగగలిగాడు – “అంటే వాళ్ళు చనిపోయింతర్వాతనే మీరు వారి బొమ్మలు గీశారని చెప్పదలచుకున్నారా?”

‘‘చనిపోకపోతే వాళ్ళ గురించి నాకెలా తెలుస్తుంది సుధీన్ బాబూ?కలకత్తాలో నాకు ఎంతోమందితో పరిచయం లేదు. ఏమైనా, చనిపోకముందు ఏదో ఒక పని లేకుండా ఎవరూ వుండరు. చనిపోయిన మనిషికి మాత్రమే అంతులేని స్వేచ్ఛ, ఎంతో సహనం, సమయం వుంటాయి. చిత్రం పూర్తవడానికి ముందు కదలకుండా ఆ కుర్చీలో గంటలతరబడి కూర్చోవడం వారికి ఇబ్బందిగా అనిపించదు.

నిశీధి నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ ఎక్కడో గడియారం గంట కొట్టింది. అది మెట్లమీద సుధీన్ చూసిన గడియారం కావచ్చు.

"అర్ధరాత్రి అతను రావడానికి సమయమైంది" గగన్‌చౌదరి అన్నాడు.

"ఎవరు?" సుధీన్ గొంతు జీరపోయింది. అతనికి కళ్ళు తిరుగుతున్నట్లుగా అనిపించసాగింది.

"ఈ రాత్రి నాకు మోడల్‌గా వుండే వ్యక్తి. అదిగో, అడుగుల శబ్దం వినిపిస్తోందా?"

సుధీన్ చెవులు ఇంకా పనిచేస్తూనే వున్నాయి. అతనికి అడుగుల శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది.

"వచ్చి చూడు!"

గగన్‌చౌదరి తెరచివున్న కిటికీ దగ్గరకు వెళ్లాడు.

"నన్ను నమ్మకపోతే నువ్వే వచ్చిచూడు"

అతడి గొంతులో వశీకరణ శక్తి వున్నట్లుగా సుధీన్‌కు మరోసారి అనిపించింది. మర మనిషిలా నడుస్తూ వెళ్ళి గగన్‌చౌదరి పక్కన నుంచున్నాడు. తరువాత అతడు క్రిందికి చూసి పైకే అరిచాడు. "ఆయన నాకు తెలుసు." ఆ వ్యక్తి, అదే ఎత్తు, అదే గ్రే కలర్ సఫారీ సూట్ వేసుకుని వున్నాడు. నిన్న మొన్నటి వరకు ఆయనే సుధీన్‌కు బాస్‌గా వుండేవాడు. ఆయనే – నాగేంద్రకపూర్.

అలసట సుధీన్‌ను చుట్టుముట్టింది. పడిపోకుండా వుండటానికి పక్కనున్న చట్రాన్ని గట్టిగా పట్టుకున్నాడు. ఇప్పుడు అడుగులు మెట్లవైపు వస్తున్నాయి. ఇల్లంతా ఆ అడుగుల శబ్దంతో అదిరిపోతున్నట్లుగా అనిపించసాగింది. తరువాత ఆ శబ్దం ఆగిపోయింది.

నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ గగన్‌చౌదరి మళ్ళీ అన్నాడు.

"వాళ్ళను ఎలా కలుసుకుంటానో తెలుసుకోవాలనుకున్నావు కదా సుధీన్‌బాబూ? చాలా సులభం. నేను వాళ్ళను పిలవగానే వచ్చేస్తారు. ఇలా"

నివ్వెరపోయి చూస్తున్న సుధీన్ కళ్ళముందు గగన్‌చౌదరి శాలువాలోంచి తన కుడి చేతిని చాపాడు. అది ఒక అస్థిపంజరం చెయ్యి.

"అన్ని బొమ్మల్ని గీసే చెయ్యి ఇదే" గగన్‌చౌదరి అన్నాడు.

స్పృహ కోల్పోతున్నప్పుడు సుధీన్‌కు ఎవరోతలుపుతట్టిన చప్పుడు వినిపించింది.

ట్యాక్, ట్యాక్, ట్యాక్, ట్యాక్....

ట్యాక్, ట్యాక్, ట్యాక్, ట్యాక్

"దాదాబాబూ! దాదాబాబూ!"

సుధీన్.... ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు. బాబోయ్ – ఎంత భయంకరమైన కల!

"తలుపు తెరవండి దాదాబాబూ!"

అది పనివాడు అధీర్ గొంతు.

"ఒక్క నిమిషం. వస్తున్నా"

సుధీన్ మంచంమీదనుంచి లేచి తలుపు తెరిచాడు.

అధీర్ లోపలికి వచ్చాడు అతడి ముఖంలో అందోళన, దిగులు.

"చాలా లేటయింది.....

"అవును నేను ఎక్కువసేపు నిద్రపోయాను."

"ఇంటిముందు గలాభాగా ఉంది. మీరేమీ వినలేదా?"

"గలాభానా ఎందుకు?"

"నిన్న రాత్రి గగన్‌చౌదరి చనిపోయారు. ఆయనకు ఎనభై నాలుగేళ్ళు. చాలా రోజులుగా మంచంమీదే వున్నారు. ఆయన గదిలో రాత్రంతా లైట్‌వేసి వుండేది మీరు గమనించలేదా?"

"ఆయన జబ్బు గురించి నీకు తెలుసా?"

"తెలుసు. ఆయన పనివాడు – భగీరథ్‌ను మార్కెట్‌లో కలిసేవాడిని"

"అలాగా?" సుధీన్ ఇంకేమీ మాట్లాడలేకపోయాడు.



# భూతో

నవీన్‌బాబు రెండవసారి కూడా నిరాశపడి వెనక్కి వచ్చేశాడు. ఆర్కార్‌బాబు ఈసారి కూడా నవీన్ మాటను మన్నించలేదు.

మొట్టమొదటిసారి :

ఉతర్పరాలో జరిగిన ఒక ఫంక్షన్‌లో ఆర్కార్‌బాబు ఆశ్చర్యకర ప్రతిభను నవీన్ చూశాడు. అతడి ప్రదర్శనను వెంట్రిలాక్విజమ్ అంటారని ద్విజపాద్ చెప్పాడు. నవీన్ ఆ మాటను కూడా అంతకుముందు వినలేదు. దిజు వాళ్ళ నాన్న ప్రొఫెసరు, ఆయనకు సొంత లైబ్రరీ ఉంది. ఆ మాటను ఇంగ్లీష్‌లో ఎలా రాయాలో దిజు తనకు నేర్పాడు.

ఆ రోజు స్టేజిమీద ఆర్కార్‌బాబు ఒక్కడే ఉన్నాడు. అతడు హాలు మధ్యలో పై కప్పు దగ్గర దాక్కున్న ఒక అజ్ఞాత వ్యక్తితో సంభాషిస్తున్నాడు. ఆర్కార్‌బాబు అతడికి ప్రశ్నలు వేస్తున్నాడు. అతడు ప్రేక్షకుల తలల పైనుంచి జవాబు చెబుతున్నాడు.

"హరినాథ్. ఎలా ఉన్నావు?"

"బాగున్నానండి"

"నీకు సంగీతంమీద దృష్టి పడ్డదట. నిజమేనా?"

"నిజమేనండి"

"శాస్త్రీయ సంగీతమా?"

"అవునండి"

"నువ్వు పాడగలవా?"

"పాడలేనండి"

"ఏదైనా వాయిద్యం ఉపయోగించగలవా?"

"అవునండి"

"ఎలాంటి వాయిద్యం? సితారేనా?"

"కాదండీ"

"సరోద్?"

"కాదండి"

"దేన్ని ఉపయోగిస్తావు మరి?"

"గ్రామఫోన్‌నండి"

హర్షధ్వానాలతో, నవ్వులతో ఆ హాలు దద్దరిల్లిపోయింది. ఆర్క్యార్‌బాబు ప్రశ్న వేసేటప్పుడు పైకప్పువైపు చూస్తూ, జవాబు వినటానికి తలకొద్దిగా వంచేవాడు. తన ప్రశ్నలకు తానే జవాబులిస్తున్నాడని కనుక్కోవటం అసాధ్యం.

అతడి పెదవులు అస్సలు కదలవు.

నవీన్ చాలా ఆశ్చర్యపడ్డాడు. తను ఈ విద్య నేర్చుకోవలసిందే. లేకపోతే బతకటం అనవసరం. తనకు ఆ విద్య నేర్పమని ఆర్క్యార్‌బాబును అడిగితే ఒప్పుకోడా, నవీన్‌కు చదువుమీద అంతగా ధ్యాసలేదు. అతడు బడికి వెళ్ళేవాడు. కాని, మూడు సంవత్సరాలుగా ఇంట్లోనే ఉంటున్నాడు. పై చదువులకు వెళ్ళాలనీ అనిపించడం లేదు.

తండ్రి చిన్నప్పుడే మరణించడం వల్ల మామయ్య దగ్గర పెరిగాడు. మామయ్యకు నవీన్ తన ప్లైవుడ్ వ్యాపారంలో చేరితే బాగుంటుందని ఉంది. నవీన్ ఆలోచనలు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. అతడికి మ్యాజిక్ నేర్చుకోవాలన్న ఆసక్తి ఉండేది. ఇంటిదగ్గర కొన్ని ట్రిక్కులు కూడా నేర్చుకున్నాడు. కానీ ఆర్క్యార్‌బాబు ప్రదర్శన చూసిన తరువాత తన ట్రిక్కులేవీ అంత గొప్పవికాదని అనిపించింది.

అతడు, ఆ ప్రదర్శన ఏర్పాటు చేసిన వాళ్ళను అడిగి ఆర్క్యార్‌బాబు కలకత్తాలోని అమెర్ట్స్ వీధిలో ఉంటున్నాడని తెలుసుకున్నాడు. మరుసటి రోజే రైలులో కలకత్తా చేరుకున్నాడు. తన మనసులో అప్పుడే గురువుగా

భావిస్తున్న వ్యక్తి ఇంటికి వెళ్ళాడు. గురువు మాత్రం తన అభ్యర్థనను ఎలాంటి మోహమాటం లేకుండా తిరస్కరించాడు.

"నువ్వేంపని చేస్తావు?" అతడడిగిన మొదటి ప్రశ్న అదే. అంత దగ్గరనుంచి ఆ వ్యక్తిని చూస్తుంటే నవీన్‌కు గుండెవేగంగా కొట్టుకోసాగింది. ఆయనకు యాభై ఐదేళ్ళు ఉంటాయి. నల్లటి, దట్టమయిన మీసాలు, నల్లనిజుట్టు భుజాలమీద పడుతోంది. ఆయన కళ్ళు తేలిపోతున్నట్లున్నాయి. అవే కళ్ళు స్టేజిమీద లైట్ల కాంతిలో మెరుస్తుండటం నవీన్ గమనించాడు.

నవీన్ నిజం చెప్పాలనుకున్నాడు – "నాకు మ్యాజిక్‌మీదే ఆసక్తి ఉండేది. మీ ప్రదర్శన నా ఆలోచనలను పూర్తిగా మార్చేసింది అన్నాడు."

ఆర్కూర్ బాబు తల ఆడించాడు – "ఇలాంటి కళను అందరూ నేర్చుకోలేరు. ఇదేమీ ఆషామాషీ వ్యవహారం కాదు. ఈ విద్య నేర్చుకోవాలంటే చాలా కష్టపడాలి. ఇది నాకు ఎవ్వరూ నేర్పలేదు. నువ్వు నేర్చుకోదలచుకుంటే స్వంతంగా ప్రయత్నించు."

నవీన్ వెళ్ళిపోయాడు. వారంరోజుల్లో మళ్ళీ వెళ్ళి ఆర్కూర్‌బాబు పాదాలమీద పడ్డాడు. ఈ ఏడు రోజుల్లో తనకు ఆ విద్య గురించిన కలలు తప్ప మరే కలలూ రాలేదు. "నీకు నేర్పించడానికి నేను సిద్ధంగా లేనని మొదటిసారి వచ్చినప్పుడే నువ్వు గ్రహించాల్సింది. గ్రహించలేదంటే నీకు గ్రహణశక్తి, జ్ఞానం లేవన్నమాట. ఈ రెండు గుణాలు లేకుండా ఎవరూ మ్యాజిక్ నేర్చుకోలేరు – నా తరహా మ్యాజిక్ అసలే నేర్చుకోలేరు."

నవీన్ మొట్టమొదటిసారి డీలాపడిపోయి వెనక్కి వచ్చేశాడు. ఈసారి అతడికి కోపం వచ్చింది. ఆర్కూర్ బాబుతో తనకేంటి, ఆ విద్య తనే స్వంతంగా నేర్చుకుంటాడు.

అతడు కాలేజి స్ట్రీట్‌లో వెంట్రిలాక్విజమ్ గురించిన పుస్తకం కొని ప్రాక్టీస్ చెయ్యడం మొదలుపెట్టాడు. తన సహనం పట్టుదల అందరికీ చివరికి తనక్కూడా ఆశ్చర్యం కలిగించాయి.

మొట్టమొదటి నియమం చాలా సులభమయినది. అక్షరమాలికలోని ప, ఫ, బ, భ, మ లకు మాత్రమే పెదవులు కదపాల్సి వుంటుంది. ఈ అక్షరాలను మరోవిధంగా పలకగలిగితే, పెదవులు కదపాల్సిన అవసరం లేదు. ఇంకో

నియమం కూడా వుంది. ప్రశ్నలకు జవాబులిస్తున్నప్పుడు గొంతు మార్చాల్సి వుంటుంది. ఇందుకు బాగా ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. నవీన్ దాన్ని కూడా సాధించాడు. ఇంటి దగ్గర ప్రదర్శించినప్పుడు నవీన్ వాళ్ళ మామయ్య, మరి కొందరు స్నేహితులు అతడి ప్రతిభను అతడిముందే మెచ్చుకున్నారు. ఇక ఆ విద్య తనకు పూర్తిగా వచ్చేసిందని అతడు అనుకున్నాడు.

కాని, అదంతా ప్రారంభం మాత్రమే.

అజ్ఞాత ప్రేక్షకుడి రోజులు పోయాయి. ఇప్పుడు వెంట్రిలాక్విస్టులు తోలు బొమ్మను ఉపయోగిస్తున్నారు. దానికింద చెయ్యిపెట్టి బొమ్మ తల తిప్పుతున్నట్లు, పెదవులు కదలిస్తున్నట్లు చూపుతున్నారు. దానికి తగిన తోలుబొమ్మలను తయారు చేయించుకుంటున్నారు – ప్రశ్న వేసినప్పుడు తోలుబొమ్మ జవాబు చెబుతుంది.

నవీన్ ప్రతిభను చూసి మెచ్చుకున్న అతని మామయ్య, నవీన్ తోలుబొమ్మ తయారు చేయించుకోడానికి డబ్బు ఇస్తానని చెప్పాడు. తన తోలుబొమ్మ ఎలా వుండాలో నవీన్ రెండు వారాలు ఆలోచించాడు. అతడికి బ్రహ్మాండమయిన ఆలోచన వచ్చింది.

తన తోలుబొమ్మ అచ్చం ఆర్యాకర్‌బాబులాగే వుంటుంది. వేరే మాటల్లో చెప్పాలంటే, ఆర్యాకర్‌బాబు తన చేతిలో ఒక తోలుబొమ్మ అవుతాడు. దెబ్బకు దెబ్బకొట్టడానికి భలే ఆలోచన.

ఒకసారి ఆర్యాకర్‌బాబు ఫొటో ఒక కరపత్రంలో అచ్చయ్యింది. ఆ కరపత్రాన్ని నవీన్‌బాబు తన దగ్గర జాగ్రత్తగా దాచుకున్నాడు.

దాన్ని తోలు బొమ్మలను తయారు చేసే అదినాథ్‌కు ఇచ్చాడు.

“తోలు బొమ్మకు ఇలాంటి మీసాలు తేలిపోతున్నట్లున్న కళ్ళు, గుండ్రని బుగ్గలు ఉండాలి.”

అలాంటి తోలుబొమ్మతో భలే మజా వస్తుంది! ఆర్యాకర్‌బాబు ఒక్కసారి తన ప్రదర్శనకు రావాలని నవీన్ తీవ్రంగా కోరుకున్నాడు.

తోలుబొమ్మ వారంరోజుల్లో తయారయింది. దాని బట్టలు కూడా ఆర్యాకర్‌బాబు వేసుకునే దుస్తులలాగే ఉన్నాయి. నల్లటికోటు, దాని కింద తెల్లని ధోతి.

నవీన్‌కు నేతాజీ క్లబ్బుకు చెందిన ససధర్‌బోసుతో పరిచయం ఉంది. వాళ్ళ ఫంక్షనులో తను పాల్గొనటం ఏమంత కష్టమైన పని కాదు.

అతడి ప్రయత్నం చాలా తొందరగా ఫలించింది. తన తోలుబొమ్మకు ఒక పేరు కూడా పెట్టాడు భూత్‌నాథ్. భూతో అని పిలిచేవాడు. వారిద్దరి మాటలువిని ప్రేక్షకులు బాగా ఆనందించేవారు. భూతో 'ఈస్ట్' బెంగాల్ జట్టువైపని, తను అవతలి పక్షమైన 'మోహన్ బగన్' వైపని నవీన్ ప్రేక్షకులకు చెప్పాడు. వారు మాటలు రువ్వుకోవడం ఎంత చురుగ్గా సాగేదంటే – భూతో 'ఈస్ట్‌గెంగాల్' అనీ 'ఓహన్ అగన్' అనీ పలుకుతున్నట్లు ఎవరూ కనుక్కోలేకపోయారు.

నవీన్‌బాబుకు పదిహేను రోజుల్లోనే మంచి పేరు వచ్చింది. క్లబ్బులనుంచి ఆహ్వానాలు చాలా ఎక్కువగా రాసాగాయి. తను టెలివిజన్‌లో కనిపించడం కూడా మొదలయింది. ఇక తాను భవిష్యత్తు గురించి ఏ మాత్రం భయపడనవసరం లేదు. తాను సంపాదనకు ఒక చక్కని మార్గం కనుక్కున్నాడు.

చివరికి ఒకరోజున అతడిని కలుసుకోడానికి ఆర్క్యూర్‌బాబు స్వయంగా వచ్చాడు.

నవీన్‌బాబు అప్పటికి ఉతర్ప్రర వదిలేసి, కలకత్తాలోని మిర్జాపూర్ వీధిలో ఒక ఫ్లాట్‌లో ఉంటున్నాడు. ఇంటి యజమాని అయిన సురేష్ ముత్సుద్ది చాలా మంచివాడు. నవీన్ విజయాల గురించి తెలియడంవలన చాలా గౌరవంగా చూసేవాడు. నవీన్ ఈ మధ్యనే మహాజతి సదన్‌లో ప్రదర్శన ఇచ్చి అభినందనలు అందుకున్నాడు. కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు నవీన్‌బాబు ప్రదర్శనకోసం పోటీ పడుతున్నారు. ఈ కొద్ది నెలల్లోనే నవీన్‌బాబులో చాలా మార్పు వచ్చింది.

ఈ విజయ పరంపరవల్ల, తనమీద తనకు బాగా నమ్మకం ఏర్పడింది.

మహాజతి సదన్‌లో తన ప్రదర్శన ఏర్పాటుచేసిన వారి దగ్గర నుంచి ఆర్క్యూర్‌బాబు చిరునామా సంపాదించి ఉంటాడు. తనూ భూతో ఆరోజు సాయంత్రం భూగర్భ రైలు గురించి మాట్లాడారు.

"కలకత్తాలోని భూగర్భ రైలు గురించి నీకు తెలుసు కదా భూతో?"

"లేదు, నాకు తెలియదు"

"ఆశ్చర్యంగా ఉందే, కలకత్తాలో అందరికి దాని గురించి తెలుసునే"

భూతో తల ఊపాడు.

'లేదు... అలాంటి దాని గురించి నేను వినలేదు. కాని, నాకు ఆసుపత్రి రైలు గురించి తెలుసు."

"ఆసుపత్రి రైలా?"

"అవును అది చాలా పెద్ద ఆపరేషనని విన్నాను. మొత్తం సిటీని ఇంటెన్సివ్‌కేర్‌లో ఉంచి, పొట్ట కోశారట, దాన్ని ఆసుపత్రి రైలు అనక మరేం అంటారు."

నవీన్ ఈరోజు కరెంటు కోతమీద కొత్త స్క్రిప్ట్ రాసుకుంటున్నాడు. ప్రజలు తమకు సంబంధించిన విషయాలనే ఎక్కువ ఇష్టపడతారు – కరెంటు కోత, బస్సుల్లో రద్దీ, అధిక ధరలు – అలాగ. స్క్రిప్ట్ బాగా వస్తోంది. అప్పుడే ఎవరో తలుపు తట్టారు. నవీన్ వెళ్ళి తలుపు తీశాడు. తలుపు బయట నిలబడి ఉన్న ఆర్క్యూర్‌బాబును చూసి ఆశ్చర్యపోయి ఒక్కసారి వెనక్కి అడుగువేశాడు.

"నేను లోపలికి రావచ్చునా?"

"తప్పకుండా రండి"

నవీన్ ఆయనకు కుర్చీ చూపించాడు.

ఆర్క్యూర్‌బాబు వెంటనే కూర్చోలేదు. అతడి కళ్ళు భూతో మీదే కేంద్రీకరించి ఉన్నాయి.

భూతో టేబులు మీద నిశ్చలంగా పడి ఉన్నాడు.

ఆర్క్యూర్‌బాబు ముందుకు వెళ్ళి, దాన్ని చేతిలోకి తీసుకొని పరీక్షగా చూడసాగాడు.

నవీన్‌కు ఏమి చేయాలో తోచలేదు. కొంచెం అధైర్యంగా కూడా అనిపించింది. కాని, ఆర్క్యూర్‌బాబు ఇంట్లో తనకు జరిగిన అవమానం అతడి మస్తిష్కంలో చెదిరిపోకుండా ఉంది.

"అయితే, నన్ను నీ చేతుల్లో తోలుబొమ్మను చేశావన్నమాట"

ఆర్క్యూర్‌బాబు ఆఖరికి కూర్చున్నాడు.

"అలా ఎందుకు చేశావు?"

నవీన్ అన్నాడు, "అది అర్థం చేసుకోవడం అంత కష్టమేమీ కాదు. నేను మీ దగ్గరకు ఎంతో ఆశతో వచ్చాను. కాని మీరు నా ఆశను అణగదొక్కారు. ఒక విషయం చెప్పాలి. ఈ తోలుబొమ్మ – మీ ప్రతిరూపం – నాకు ఎంతో కీర్తి తెచ్చిపెట్టింది. దానివల్ల నేనిప్పుడు గౌరవప్రదంగా జీవిస్తున్నాను."

ఆర్క్యూర్‌బాబు భూతోనే చూస్తూ అన్నాడు.

"ఈ సంగతి నీ వరకు వచ్చిందో లేదో. ఒకరోజు బరాసత్‌లో ప్రదర్శన ఇచ్చాను. నేను స్టేజిమీదకు వెళ్ళగానే, పిల్లి–కూతలు వినిపించసాగాయి – 'భూతో! భూతో!' ఈ అనుభవం నాకు ఏమంత ఆనందదాయకం కాదని నీకు అర్థమవుతుందను కుంటాను. ఒకవిధంగా నీకు విజయం చేకూర్చడంలో నేను సహాయపడి వుండవచ్చు. కాని, నువ్వు నా జీవనాధారానికి ఎసరు పెడుతున్నావు. ఈ విషయం నేను తేలిగ్గా తీసుకుంటాననే అనుకున్నావా?"

బయట చీకటిగా ఉంది. కరెంటు లేదు. నవీన్ గదిలో కొవ్వొత్తులు రెండు గాలికి రెపరెపలాడుతున్నాయి. గతంలో నవీన్ చూసిన విధంగానే, ఆ కాంతిలో ఆర్క్యూర్‌బాబు కళ్ళు మెరిశాయి. గోడమీద ఆయన నీడ పొడుగ్గా పడుతోంది. భూత్‌నాథ్ ఎప్పటిలాగే అవేకళ్ళతో నిశ్చలంగా, టేబుల్‌మీద పడి ఉన్నాడు.

"నీకు ఈ సంగతి తెలిసి ఉండకపోవచ్చు. నాకు వెంట్రిలాక్విజమ్‌తోపాటు వేరే మ్యాజిక్ కూడా వచ్చు. నేను పద్దెనిమిదోఏట నుంచి ముప్ఫై ఎనిమిది ఏళ్ళదాకా ఒక మంత్రగాడిదగ్గర ఉన్నాను. అతడి గురించి చాలా మందికి తెలియదు గాని, అద్భుతమైన మంత్రవిద్య అతడి సొంతం. అతడు ఎక్కడో దూరంగా, హిమాలయాల దగ్గర ఉండేవాడు" అన్నాడు ఆర్క్యూర్‌బాబు.

"మీరు నేర్చుకున్న ఆ విద్యను ఎప్పుడైనా స్టేజిమీద ప్రదర్శించారా?"

"లేదు, ఆ విద్య స్టేజీమీద ప్రదర్శించదగినది కాదు. ఆ విద్యను డబ్బు సంపాదించుకోడానికి ఉపయోగించనని మా గురువుకు మాటిచ్చాను. మాట నిలబెట్టుకున్నాను."

"ఇప్పుడు మీరు నాకేం చెప్పదలచుకున్నారు? నాకేమీ అర్థం కావడం లేదు."

‘‘నేను నీ దీక్షకు ముగ్ధుడనయ్యాను. అయినా, నిన్నోసారి హెచ్చరించిపోదామని వచ్చాను. నాకు వెంట్రిలాక్విజమ్ ఎవ్వరూ నేర్పలేదు. నీలాగే నాకు నేను నేర్చుకున్నాను. ప్రొఫెషనల్ మెజీషియన్లు దీనిలోని అసలు కిటుకులు చెప్పరు. వాళ్ళెప్పుడూ అంతే. నువ్వు తోలుబొమ్మ నమూనాతో నీ అసహనాన్ని ప్రకటించావు. దీన్ని నేను సహించను. ఆ సంగతి చెప్పడానికే ఇక్కడికి వచ్చాను.”

ఆర్క్యూర్‌బాబు కుర్చీలోంచి లేచాడు. భూత్‌నాథ్‌వైపు చూసి అన్నాడు – “నా మీసాలూ, తల వెంట్రుకలు ఈ మధ్యనే నెరుస్తున్నాయి. నువ్వు ఈ విషయం ముందుగానే ఊహించి నీ తోలుబొమ్మ వెంట్రుకలలో తెల్ల వెంట్రుకలు కలిపినట్లున్నావు. మంచిది, నేను సెలవు తీసుకుంటాను.”

ఆర్క్యూర్‌బాబు వెళ్ళిపోయాడు.

నవీన్ తలుపు దగ్గరగావేసి, భూత్‌నాథ్ ఎదుట నిలుచున్నాడు. తెల్లవెంట్రుకలా? అవును, ఒకటి రెండు తెల్లవెంట్రుకలు కనిపిస్తున్నాయి. తను ఆ తోలుబొమ్మను చేతిలో పట్టుకుని, దానితో ఎన్నోసార్లు మాట్లాడాడు. అయినా తెల్లవెంట్రుకలను గమనించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. తను వాటిని గమనించకుండా ఎలా ఉన్నాడు?

ఆ విషయం ఆలోచిస్తూ సమయం వృథా చేసుకోవడం అనవసరం. తప్పులు ఎవరైనా చేస్తారు. తాను ఎప్పుడూ భూత్‌నాథ్ మొహాన్నే చూస్తూవుండటం వల్ల వెంట్రుకలను పట్టించుకోలేదేమో?

ఆ అనుమానాన్ని తన మనసులోంచి తొలగించుకోలేక పోయాడు నవీన్.

మరుసటిరోజు, భూతోకోసం ప్రత్యేకంగా చేయించిన లెదర్ బ్యాగులో భూతోను ఉంచుకుని, ఆదినాథ్‌పాల్ దగ్గరకు వెళ్ళాడు నవీన్. అక్కడ భూతోను బయటకు తీసి నేలమీద పడుకోబెట్టి అడిగాడు – “ఈ తెల్ల వెంట్రుకలను చూడు. వాటిని నువ్వు పెట్టావా?”

ఆదినాథ్ ఆశ్చర్యపడ్డట్లు కనిపించాడు. “లేదే. నేనెందుకు పెడతాను? మీరు నలుపు తెలుపు వెంట్రుకలను కలిపి పెట్టమని చెప్పలేదు కదా?”

“పొరపాటుగా పెట్టి ఉండొచ్చు కదా?”

"అవును అలా జరిగి ఉండొచ్చు. దాన్ని తీసుకు వెళ్ళడానికి వచ్చినప్పుడు మీరు కూడా గమనించలేదే? నాకు వేరే ఆలోచన వస్తోంది. మీకు తెలియకుండా ఎవరో వాటిని అతికించారని అనిపిస్తోంది."

అతడు చెప్పింది నిజమేనేమో. అదంతా తనకు తెలియకుండానే జరిగి ఉండొచ్చు.

చెత్లాలోని ఫ్రెండ్స్‌క్లబ్ వాళ్ళు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒక విచిత్రం జరిగింది. నిర్వాహకులు అతడి కార్యక్రమాన్ని చివరగా పెట్టడం అన్నది భూతో కీర్తిప్రతిష్టలకు ఒక సాక్ష్యం. ఆరోజు వాళ్ళు కరెంటు కోత గురించి మాట్లాడుతున్నారు. మధ్యలో, స్క్రిప్ట్‌లో లేని పదాలను భూతో వాడటం నవీన్ గమనించాడు. అవి నవీన్ ఎప్పుడూ ఉపయోగించని కఠినమైన ఇంగ్లీష్ పదాలు – నవీన్‌కు వాటి అర్థం మాత్రమే తెలుసు.

ఆ పదాలు స్క్రిప్ట్‌లో చేరడంవల్ల ప్రదర్శనకు ఎటువంటి ఆటంకమూ కలగలేదు. కాని, నవీన్‌కు ఇది చాలా కొత్త అనుభవం. ఆ పదాలు ఉపయోగించినప్పుడు ప్రేక్షకులు చప్పట్లు కూడా కొట్టారు. నవీన్ కాలేజీకి ఎప్పుడూ వెళ్ళలేదని ప్రేక్షకులకు తెలియకపోవడం మంచిదయింది.

తన తోలుబొమ్మ అలా విచిత్రంగా ప్రవర్తించడం నవీన్ మరిచిపోలేకపోయాడు. అతడికి చాల దిగులేసింది.

ప్రదర్శన పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాక అతడు తలుపులు మూసేసి, భూతోను టేబుల్ ల్యాంప్ కింద పెట్టాడు.

భూతోకు నుదుటిమీద ఆ చిన్న మచ్చ ఇంతకుముందు ఉండేదా? లేదే! ఇంతకుముందు లేదు. ఆర్ముకర్‌బాబు నుదుటి మీద కూడా ఇలాంటి మచ్చ వుండటం నవీన్ ఇంతకుముందు రోజు చూశాడు. అది చాలా చిన్న మచ్చ. జాగ్రత్తగా పరిశీలిస్తేగాని కనిపించదు. అది ఇప్పుడు భూతో తలమీద కనిపిస్తోంది.

అంతటితో అయిపోలేదు. ఇంకా ఏదో ఉంది.

ఇంకో పది తెల్ల వెంట్రుకలు.

కళ్ళ చుట్టూ లోతుగా నల్లని వలయాలు.

అవి ఇంతకుముందు లేవని తను ఖచ్చితంగా చెప్పగలడు.

నవీన్ అటూ ఇటూ, అసహనంగా నడవసాగాడు. పూర్తిగా డీలాపడి పోయాడు. తనకు మ్యాజిక్‌లో నమ్మకం ఉంది – కాని తను నమ్మే మ్యాజిక్ పూర్తిగా మనిషి అదుపాజ్ఞలో ఉంటుంది. మానవాతీత శక్తులు అనేదాన్ని నవీన్ అంగీకరించడు. అది దుష్టమైనది. ఇప్పుడు భూతోలో ఆ దుష్టత్వం చిహ్నాలు కనిపించసాగాయి నవీన్‌కు. భూతో కళ్ళు మెరుస్తున్నప్పటికీ, అతని పెదవులమీద చిరునవ్వు వున్నప్పటికీ, తనచేతుల్లో ఆటలాడే తోలుబొమ్మగా కాకుండా భూతోను ఇంకో విధంగా ఊహించుకోవడం తనకు అసాధ్యం. అయినా భూతో స్వరూపం మొత్తం మారిపోతోంది.

ఆర్కుర్‌బాబులో కూడా ఇలాంటి మార్పులే వస్తున్నాయని నవీన్ నమ్మకం.

అతడికి కూడా జుట్టు తెల్లబడుతూ ఉండవచ్చు. అతడి కళ్ళ చుట్టూ నల్లని వలయాలు ఏర్పడి ఉండవచ్చు.

తన ప్రతిభకు మెరుగు పెట్టుకునేందుకు నవీన్ అప్పుడప్పుడు భూతోతో మాట్లాడేవాడు. వాళ్ళ సంభాషణ ఇలా సాగింది.

“ఈరోజు చాలా వేడిగా వుంది కదూ భూతో?”

“అవును”

“అయినా నీకేం ఫర్వాలేదు కదూ? నీకు ఉక్కపొయ్యదు, చెమట రాదు”

“తోలు వొవ్వకు చెవట ఎలా పడుతుంది”

నవీన్, ఈరోజు, అసంకల్పితంగా ఒక ప్రశ్నవేశాడు, “ఇదంతా ఏమిటి భూతో? ఇలా ఎందుకు జరుగుతోంది?”

భూతో ఇచ్చిన జవాబు అతడిని ఆశ్చర్యపరచింది.

“కర్వ, కర్వ!” అన్నాడు భూతో

“కర్మా!”

స్టేజిమీద జరిగినట్లుగానే, ఆ పదం నవీన్ పెదవుల నుంచి బయటపడింది. కానీ ఆ పదం తనకు తెలియకుండానే బయటకు వచ్చిందని అతడికి తెలుసు. ఎవరో తనను అలా పలికేలా చేశారు. అలా ఎవరు చేశారో అతనికి బాగా తెలుసు.

వంటమనిషి ఎంత బ్రతిమాలినా అతడారాత్రి భోజనం చెయ్యలేక పోయాడు.

మామూలుగా అయితే అతడు బాగానే నిద్రపోయేవాడు. కానీ ఆ రోజు రాత్రి నిద్రపట్టడానికి మాత్రవేసుకోవలసి వచ్చింది. రాత్రి ఒంటిగంట తరువాత మాత్ర పనిచేయడం మొదలుపెట్టింది. చదువుతున్న పత్రికను పక్కనబెట్టి, లైటు ఆర్పేసి నవీన్ నిద్రపోయాడు.

కొంతసేపటికే అతను కళ్ళు తెరిచాడు.

గదిలో ఎవరో దగ్గుతున్నారు?

తనే దగ్గుతున్నాడా?తనకు దగ్గురావటం లేదే!

ఎవరో, చాలా దగ్గర్లోనే, మెల్లగా దగ్గుతున్నారు. అతడు లైటు వేశాడు.

భూతనాథ్ కదలకుండా మెదలకుండా తన స్థానంలో కూర్చుని ఉన్నాడు, తల కొద్దిగా వేలాడేసి; అతడి కుడిచెయ్యి రొమ్ముమీద పడివుంది.

నవీన్ గడియారంవైపు చూశాడు. సమయం మూడున్నర అయ్యింది. బయట చౌకీదారు తిరుగుతున్నాడు. చేతికర్రతో నేలను కొడుతూ శబ్దం చేస్తున్నాడు. దూరంగా కుక్క మొరుగుతోంది. బిగ్గరగా కూతపెడుతూ ఓ గుడ్లగూబ ఇంటిమీదుగా ఎగిరిపోయింది. పక్కింట్లో ఎవరో దగ్గి ఉంటారు. ఏదో పెనుగాలి తెర భూతోను ముందుకు ఒరిగేట్లు చేసినట్లుంది. కలకత్తాలో రద్దీగావున్న వీధిలో నివసిస్తూ, ఈ ఇరవయ్యవ శతాబ్దంలో, తాను ఇలా భయపడడం అర్థరహితం.

నవీన్ లైట్లు తీసేసి మళ్ళీ నిద్రకు ఉపక్రమించాడు.

మరుసటిరోజు, తన వృత్తి జీవితంలో మొట్టమొదటిసారిగా, నవీన్ ఓటమిని ఎదుర్కొన్నాడు. ఫిన్‌లే రిక్రియేషన్ క్లబ్బు వాళ్ళు వార్షికోత్సవానికి అతడిని ఆహ్వానించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రేక్షకులతో విశాలమయిన హాలు నిండిపోయింది. ఎప్పటిలాగానే, అతడి ప్రదర్శనను చివరలో పెట్టారు. పాటలు, భక్తి గీతాలు, కథక్ నృత్యం తరువాత నవీన్ మున్షీగారి వెంట్రిలాక్విజమ్.

అక్కడికి బయల్దేరేముందే, ఎప్పుడూ చేసినట్లుగానే, నవీన్ తన గొంతు సరిగా వుందో లేదో చూసుకున్నాడు. వెంట్రిలాక్విస్టుకు గొంతు సాఫీగా ఉండటం అతిముఖ్య విషయమని అతడికి తెలుసు.

స్టేజిమీదకు వెళ్ళకముందు అతడిగొంతు బాగానే ఉండింది. భూతోను మొట్టమొదట ప్రశ్నించినప్పుడు అతడికి ఏమీ అనిపించలేదు. మాట్లాడడానికి భూతోవంతు వచ్చినప్పుడే అసలు సమస్య ఎదురయ్యింది.

దగ్గుతో జలుబుతో బాధపడుతున్నట్లుగా భూతో గొంతు బొంగురుగా వినిపించింది. భూతో చెప్పే ఒక్కమాట కూడా ప్రేక్షకులకు అర్థంకావడం లేదని నవీన్‌కు తెలుస్తూనే ఉంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే భూతో మాటల్లో మాత్రమే గొంతు అలా అవుతోంది. తన మాటల్లో బాగానే వుంది.

"వినిపించడం లేదు" వెనక నుంచి ప్రేక్షకులు అరిచారు. ముందు కూర్చున్న వారు అరవడం లేదు. కాని, వారికి కూడా ఏమీ వినిపించడం లేదని తెలుస్తూనే ఉంది.

నవీన్ మరో ఐదు నిమిషాలసేపు ప్రయత్నించాడు. విఫలుడయ్యాడు. మొదటిసారిగా చాల కలవరపడ్డాడు.

క్లబ్బువారు తనకు ఫీజు ఇవ్వబోయారు గాని, తీసుకోనిరాకరించాడు. ఇలాంటి పరిస్థితుల్లో డబ్బు తీసుకోవడం సాధ్యం కాదనిపించింది. అయినా ఈ గడ్డు పరిస్థితి ఎక్కువకాలం ఉండదులే అనుకున్నాడు. అంత కలవరపడుతూ కూడా, తొందర్లోనే పరిస్థితులు తప్పకుండా చక్కబడతాయని నవీన్ విశ్వసించాడు.

ఇలాంటి బాధాకరమైన అనుభవానికి తోడు ఆ రాత్రి వేడిగా ఉక్కపోతగా ఉంది. నవీన్ రాత్రి పదకొండున్నరకు ఇంటికివచ్చేసరికి పూర్తిగా అలిసిపోయి ఉన్నాడు. భూతో వైపు నుంచి తప్పేమీలేదని అతడికి తెలుసు. అయినా, మొట్టమొదటిసారిగా, భూతోమీద కోపం వచ్చింది. తన ఓటమి నిజానికి తన స్వయంకృతాపరాధమే.

అతడు భూతోను టేబుల్‌మీద పెట్టి కిటికీ రెక్క ఒకటి తెరిచాడు. బయటనుంచి చల్లటిగాలి లోపలికి రావటంలేదు. కరెంటు పోవడంవల్ల, కొంతగాలి వచ్చినా హాయిగా ఉంది. ఆ రోజు శనివారం. కరెంటు అర్ధరాత్రి దాకా రాదని నవీన్‌కు తెలుసు.

కొవ్వొత్తి వెలిగించి టేబుల్‌మీద పెట్టాడు. భూతోమీద వెలుతురు పడుతోంది. నవీన్ శరీరం భయంతో చల్లబడింది.

భూతో నుదుటిమీద చెమట చుక్కలు ఉన్నాయి.

అంతేనా? కాదు?

అతడి మొహంలో తాజాదనం లేదు. బుగ్గలు లోపలికిపోయి ఉన్నాయి. కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

ఆ స్థితిలో కూడా నవీన్ భూతో దగ్గరికి కొన్ని అడుగులు వేశాడు. అతడికి ఇంకా కొన్ని ఆశ్చర్యకరమైన - భయంకరమైన విషయాలు తెలుసుకోవాలన్నట్లుగా ఉంది.

ఏదో శక్తి నవీన్‌ను మధ్యలో ఆపేసినట్లయింది.

భూతో ఛాతీ కదులుతోంది. అతడి ఛాతీ పైకీ కిందికీ కదులుతోంది.

భూతో ఊపిరి పీలుస్తున్నాడు!

అతడి ఊపిరి శబ్దం వినబడుతోందా?

అవును, వినిపిస్తోంది. నిశ్శబ్దంగా ఉన్న ఆ రాత్రి, నవీన్ గదిలో ఒకరు కాక ఇద్దరు మనుషులు ఊపిరి పీలుస్తున్నారు.

భయంవల్లనో, ఆశ్చర్యం వల్లనో గానీ, మెల్లగా గొణిగాడు, "భూతో!"

అప్పుడే, మరో గొంతు వినిపించింది. ఆ శబ్దానికి నవీన్, వెనక పరుపుమీద పడిపోయాడు.

"నేను భూతోను కాదు. ఆర్క్యూర్ బాబును"

తను ఆ మాటలు అనలేదని నవీన్‌కు తెలుసు. అది తోలుబొమ్మ గొంతే. ఆర్క్యూర్‌బాబు దాన్ని ఎట్లా మాట్లాడించగలిగాడో ఆ దేవుడికే తెలియాలి.

ఆర్క్యూర్‌బాబును తన చేతుల్లో తోలుబొమ్మగా చెయ్యాలని నవీన్ అనుకున్నాడు. ఇలా జరుగుతుందని అతడు ఊహించలేదు. ప్రాణం పోసుకున్న తోలుబొమ్మ ఉన్న గదిలో అతడు ఉండలేకపోయాడు.

ఏం జరుగుతోంది?

భూతో ఊపిరి తీస్తున్న శబ్దం తగ్గిపోతోందా?

అవును. తగ్గిపోతోంది.

భూతో ఊపిరి ఆగిపోయింది. అతడి నుదుటిమీద ఇప్పుడు చెమట బిందువులు లేవు. అతడి కళ్ళు ఎర్రగా లేవు. కళ్ళచుట్టూ నల్లటి చక్రాలూ లేవు.

నవీన్ పరుపుమీద నుంచి లేచి అతడిని లేవనెత్తాడు.

ఈ కొద్ది సమయంలోనే ఏదో విచిత్రం జరిగింది.

భూతో తల తిప్పలేకపోతున్నాడు. పెదవులు కదల్చలేకపోతున్నాడు. లోపల ఉన్న యంత్ర పరికరాలు అతుక్కుపోయినట్లున్నాయి. కొద్దిగా బలం ఉపయోగిస్తే ప్రయోజనం ఉంటుందేమో.

నవీన్ తలను బలవంతంగా తిప్పబోయాడు. అది ఊడివచ్చి పెద్ద శబ్దంతో నేలపై పడింది.

పొద్దున్నే మెట్లమీద నవీన్‌కు యజమాని కనిపించాడు.

"ఏం, మున్షిగారూ? మీరు తోలుబొమ్మతో చేసే మ్యాజిక్ నాకు చూపించనేలేదు. దాన్ని వెంట్రిలాక్విజమో, ఏదో అంటారట కదూ!"

"నేను ఇప్పుడా మ్యాజిక్ చెయ్యడం లేదు. వేరే పని ఏదైనా చూసుకోవాలని అనుకుంటున్నాను. అయినా ఇప్పుడెందుకు అడిగారు?"

"మీ సహప్రదర్శకులొకరు నిన్న చనిపోయారు. ఈ రోజు దినపత్రికలో చూశాను. ఆర్ఖ్యార్ చౌదరి"

"నిజమా?" నవీన్ ఇంకా దినపత్రిక చూడలేదు – "ఆయనకు ఏమయింది?"

యజమాని చెప్పాడు. "గుండెపోటు, ఈ మధ్య దాదాపు డెభైశాతం మంది గుండెపోటుతోనే చనిపోతున్నారు."

ఆర్ఖ్యార్‌బాబు రాత్రి ఏ సమయంలో చనిపోయాడో ఎవరైనా తెలుసు కోవాలనుకుంటే నవీన్ చెప్పగలడు. ఆర్ఖ్యార్‌బాబు రాత్రి పది నిమిషాలు తక్కువ పన్నెండు గంటలకు చనిపోయాడని నవీన్‌కు ఖచ్చితంగా తెలుసు.



# అనుకూల్

"**అతడికీ** ఒక పేరు ఉండి ఉంటుంది కదూ?" నికుంజబాబు అడిగాడు.

"అవును, వుంది"

"ఏమిటది?"

"అనుకూల్"

ఆరునెలల్క్రితం చౌరంగిలో రోబోట్లను సరఫరా చేసే ఏజెన్సీని తెరిచారు. తన దగ్గర రోబోట్ పనిమనిషిని ఉంచుకోవాలని నికుంజబాబు ఎప్పుడూ అనుకునేవాడు. చాలారోజుల తరువాత అతని వ్యాపారం బాగా సాగుతోంది. ఆ కోరిక తీర్చుకోడానికి తగినంత డబ్బు ఇప్పుడు తన దగ్గర వుంది.

నికుంజబాబు రోబోట్ వైపు చూశాడు. అది మరమనిషే అయినా నిజం మనిషిలాగే వుంది. చూడటానికి బాగుంది - ఇరవై రెండేళ్ళ వయస్సున్న యువకుడిలా వుంది.

"ఈ రోబోట్ ఎలాంటి పనులు చేస్తుంది?" నికుంజబాబు అడిగాడు.

కౌంటరు దగ్గర వున్న వ్యక్తి సిగరెట్ వెలిగించుకుని బదులు చెప్పాడు, "మామూలు పనిమనిషి చేసే పనులు దాదాపు అన్నీ చేస్తాడు. అతనికి వంట చెయ్యడం మాత్రం రాదు. అది తప్ప - బట్టలు ఉతకడం, ఇల్లు శుభ్రంచేయడం, పరుపులు సరిచేయడం, టీ చేయడం, తలుపులు, కిటికీలు తెరవడం - దాదాపు అన్నీ చేస్తాడు. అతన్ని బయటకు పంపించవద్దు.

ఇంటిపనులు ఏవైనా చెయ్యగలడు గాని బయటకు వెళ్ళి చెయ్యలేడు. ఈ... ఇంకో విషయం ... మీరు అతనితో శాంతంగా మాట్లాడాలి. 'దయచేసి', కృతజ్ఞతలు' వంటిమాటలు మాట్లాడాలని అతను కోరుకుంటాడు."

"అతడు ముక్కోపి కాదనుకుంటాను?"

"కాదు. కాదు. అతడిమీద చెయ్యెత్తితే తప్ప, మిమ్మల్ని ఇబ్బంది పెట్టడు. కొట్టడంవంటి వాటిని మా రోబోట్లు సహించవు."

"అలా జరిగే అవకాశం లేదు. అయినా, ఎవరైనా తనను చెంపదెబ్బ కొడితే ఏం చేస్తాడు?"

"పగ తీర్చుకుంటాడు"

" ఏ విధంగా?"

"కుడిచేతి మధ్య వేలును ఉపయోగిస్తాడు. ఆ వేలి సహాయంతో హై ఓల్టేజి ఎలక్ట్రిక్ షాక్ ఇవ్వగలడు."

"అది మరణానికి దారి తీస్తుందా?"

"తప్పకుండా. మామూలు మనిషిలా రోబోటును శిక్షించలేరు కాబట్టి, న్యాయశాస్త్రం ఏమీ చెయ్యలేదు. కానీ ఇలాంటి సంఘటనలు ఎక్కడా జరగలేదని నేనుచెప్పగలను."

"రాత్రిపూట నిద్రపోతాడా?"

"ఊహు, రోబోట్లు నిద్రపోవు."

"మరయితే రాత్రంతా ఏం చేస్తాడు?"

"శబ్దం చెయ్యకుండా ఒక మూల కూర్చుంటాడు. రోబోట్లు ఎప్పుడూ సహనం కోల్పోవు."

"అతడికి మనసు ఉందా?"

"మనుషులు ఆలోచించలేని, అర్థం చేసుకోలేని కొన్ని విషయాలను అప్పుడప్పుడు రోబోట్లు గ్రహించగలుగుతాయి. అన్ని రోబోట్లూ అంత సున్నితమైనవి కావు. అదంతా అదృష్టంమీద ఆదారపడి వుంటుంది. ఈ రోబోట్‌కి అలాంటి వరం ఉందా లేదా అన్న విషయం కాలమే చెబుతుంది."

నికుంజబాబు రోబోటువైపు తిరిగి అన్నాడు, "అనుకూల్, నా దగ్గర పనిచేయడానికి నీకు ఎలాంటి అభ్యంతరమూ లేదు కదా?"

“నాకెందుకు అభ్యంతరం ఉంటుంది” అచ్చం మనిషి గొంతుతో సమాధానమిచ్చాడు అనుకూల్.

అతడు నీలపు గళ్ళ చొక్కా, నల్ల నిక్కరు తొడుక్కుని వున్నాడు. తల పక్క పాపిటతో నున్నగా దువ్వి ఉంది. తెల్లగా వున్నాడు. పళ్ళు శుభ్రంగా మెరుస్తూ వున్నాయి. అతని నోరు చిరునవ్వుతో కొద్దిగా తెరుచుకున్నట్లుంటుందెప్పుడూ. అతడ్ని చూస్తుంటే మంచి అభిప్రాయం కలుగుతోంది.

“నాతో రా మరి”

నికుంజబాబు మారుతివ్యాను బయట ఆపి వుంచాడు. చెక్కు ఇచ్చి అనుకూల్‌తోపాటు బయటకు వచ్చాడు. అనుకూల్ మామూలు మనిషిలాగానే కదులుతున్నాడు.

నికుంజబాబు సాల్ట్ లేక్‌లో ఉంటున్నాడు. అతనింతవరకూ పెళ్ళి చేసుకోలేదు. ప్రతిరోజు సాయంత్రం పేకాట ఆడటానికి కొంతమంది స్నేహితులు అతనింటికి వస్తుంటారు. యంత్ర నిర్మితమైన పనిమనిషి వస్తున్నట్లు వాళ్ళకు ముందే తెలుసు. అనుకూల్‌ను సంపాదించుకునే ముందు నికుంజబాబు కొద్దిపాటి పరిశోధన చేశాడు. కలకత్తాలో కొంతమంది ఉన్నతవర్గాల వారు రోబోట్లను వాడుతున్నారు. మంశుఖని, గిరిజాబోస్, పంకజ్ దత్తరాయ్. ఛాబ్రియాగారు – తమ మర పనిమనిషి ఎలాంటి ఇబ్బంది పెట్టడంలేదని అందరూ అన్నారు.

“మా జీవన్‌లాల్ చెప్పిన పని వెంటనే చేసేస్తాడు. అతడు యంత్రం మాత్రమే కాదనే నిర్ణయానికి వచ్చాను. అతనికి నిజమైన మెదడు, గుండె వున్నట్లున్నాయి” అన్నారు మంశుఖనిగారు.

ఏడురోజుల్లో నికుంజబాబు కూడా అలాంటి నిర్ణయానికే వచ్చాడు. అనుకూల్ పనిచేసే పద్ధతి చాలా బాగుంది. పనులలో ఒకదానికొకటి సంబంధం ఉంటుందనే విషయాన్ని పూర్తిగా గ్రహించినట్లే ఉన్నాడు. నా స్నానానికి నీళ్ళు తయారుగా ఉన్నాయా అని అడగ్గానే, నీళ్ళతోపాటు సబ్బు, టవలు యజమాని స్నానంకోసం రెడీగా పెట్టేస్తాడు. తరువాత యజమానికి అవసరమైన దుస్తులు, బూట్లు వంటివి అందిస్తాడు. అతను అన్నీ ఎంత ఇష్టంతో చేసేవాడంటే అతడిపై విసుక్కునే అవసరమే రాలేదు.

నికుంజబాబు స్నేహితులకు అనుకూల్‌తో అనుకూలంగా వ్యవహరించడానికి కొంత సమయం పట్టింది. ముఖ్యంగా వినయ్ ప్రకాశికి. అతను అప్పుడప్పుడు తన సొంత పనిమనుషులతోనే సరిగా వ్యవహరించేవాడు కాదు. ఒకసారి అనుకూల్‌తో కూడా అలాగే మాట్లాడాడు. అనుకూల్ సహనం కోల్పోలేదు. “పెద్దాయనా! నువ్వు నాతో సరిగ్గా ఉండకపోతే, నేనూ నీతో సరిగ్గా ఉండను!” అని మెల్లగా చెప్పాడు. వినయ్‌బాబు ఆ తప్పు మళ్ళీ చెయ్యలేదు.

నికుంజబాబు అనుకూల్‌తో మంచి సంబంధం కలుపుకున్నాడు. అనుకూల్ పురమాయింపు లేకుండానే పనులు చేయసాగాడు. నికుంజబాబుకు ఆశ్చర్యం వేసింది. రోబోట్ సప్లయింగ్ ఏజెన్సీలో ఆ వ్యక్తి చెప్పిన విషయాలు జ్ఞాపకం వచ్చాయి. కొన్ని రోబోట్లు మెదడుతో దగ్గర పోలికలు ఉన్నట్లుగా ఆలోచిస్తాయని అతడు చెప్పాడు. అనుకూల్ అలాంటి రోబోటు అయి వుండవచ్చు.

కాని, అనుకూల్ నిద్రపోడన్న విషయం నమ్మశక్యంగా లేదు. అచ్చం మనిషిలా ఉన్నాడు. మరి రాత్రి కొద్దిసేపైనా పడుకోడా? నికుంజబాబు ఒకరోజు రాత్రి ఆ సంగతి తేల్చుకోవాలనుకున్నాడు. అనుకూల్ ఉన్న గదిలోకి తొంగిచూశాడు. “మీకేమయినా కావాలాండి?” అని వెంటనే అడిగాడు అనుకూల్. నికుంజబాబు తత్తరపడిపోయి “ఏమీ లేదు” అని వెనక్కి మళ్ళాడు.

అనుకూల్‌తో ఎన్నో విషయాలు చర్చించే వీలువుంది. అతడికి ఆటలు, సినిమాలు, థియేటర్లు, సాహిత్యం మొదలైన ఎన్నో విషయాలు క్షుణ్ణంగా తెలుసు అనిపించింది. అతడి జ్ఞానాన్ని, రోబోటు తయారుచేసిన వారి పనితనాన్ని చూసి నికుంజబాబు అబ్బురపడ్డాడు.

కాని, మంచి విషయాలన్నింటికి ఎక్కడో ఒక ముగింపు ఉంటుంది.

నికుంజబాబు తన వ్యాపారంలో ఏవో తప్పటడుగులు వేశాడు. అనుకూల్ వచ్చిన ఒక సంవత్సరంలోనే తన రాబడి తగ్గిపోసాగింది. అనుకూల్‌కు నెలకు రెండువేల అద్దె కడుతూనే ఉన్నాడు. తన రాబడి ఇలాగే ఉంటే అనుకూల్ అద్దె కట్టడం మానివేయాల్సి వస్తుందేమో? నెలసరి అద్దె కట్టకపోతే అనుకూల్‌ను తీసుకువెళ్ళి పోతామని రోబోట్ సప్లయింగ్ ఏజన్సీ వాళ్ళు అతడికి చెప్పారు. నికుంజబాబు డబ్బు జాగ్రత్తగా వాడవలసిన అవసరం వచ్చింది.

ఈ ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ఆ సమయంలో ఒక సంఘటన జరిగింది.

నికుంజబాబు వాళ్ళ మామయ్య ఉన్నట్టుండి ఊడిపడ్డాడు. "చందన్ నగర్‌లో ఒక్కడికి ఏమీ తోచడంలేదు నీతో కొన్ని రోజులు ఉండిపోదామని వచ్చాను." అన్నాడు.

నికుంజబాబు వాళ్ళమామయ్య – నివారణ్ బెనర్జీ – అప్పుడప్పుడు వచ్చి మేనల్లుడి దగ్గర ఉంటూ ఉంటాడు. నికుంజబాబు చాలా ఏళ్ళక్రితమే తండ్రిని పోగొట్టుకున్నాడు. తన ముగ్గురు మామయ్యల్లో నివారణ్‌బాబు ఒక్కడే జీవించి ఉన్నాడు. ముసలాయనకు కోపం ముక్కుమీద ఉంటుంది. ఆయన జీవించే విధానం చూసి ఎవరూ గుర్తించలేకపోయినా, లాయరుగా బాగా సంపాదించాడని చెబుతారు. అసలు విషయమేమిటంటే, అతడు పరమ లోభి.

మీరు ఇక్కడ కావలసినన్ని రోజులు సంతోషంగా ఉండొచ్చు మామయ్యా! కాని, మీకు ముందే ఒక విషయం చెప్పాలి. నా దగ్గర ఇప్పుడు రోబోట్ పనిమనిషి ఉన్నాడు. "కలకత్తాలో రోబోట్లను తయారుచేసే కంపెనీ ఉందని మీరు వినే ఉంటారు."

"అవును, పత్రిక ప్రకటన చూశాను. కాని, నీ పనిమనిషి ఎక్కడినుంచి వచ్చాడు? ఇలాంటి విషయాల్లో నా పట్టింపులు నీకు తెలుసు. వంట ఈ కొత్త పనిమనిషే చేస్తున్నాడా?"

"లేదు,లేదు " నికుంజబాబు ఆయన సందేహం తీర్చాడు. "పాత వంటవాడు వున్నాడు. మీరు సందేహించనక్కరలేదు. కొత్త పనిమనిషి పేరు అనుకూల్... ఆ... ఇంకో విషయం, అతడితో శాంతంగా మాట్లాడాలి. తిట్లుపడటం అతనికి ఇష్టం ఉండదు."

"ఇష్టం లేదా?"

"అవును"

"నేను 'అతడి' ఇష్టప్రకారం నడుచుకోవాలా?"

"అందరూ అలాగే వుంటారు. మీరొక్కరే కాదు. అయినా అతడి పనిలో తప్పు పట్టలేరు."

"నువ్వు ఈ రొంపిలోకి ఎందుకు దిగావు?"

"మీకు ముందే చెప్పాను – అతడు చాలా బాగా పనిచేస్తాడు."

"సరే, అతన్ని పిలువు. ఎలా వుంటాడో చూద్దాం!"

'అనుకూల్!' నికుంజబాబు పిలిచాడు. అనుకూల్ వెంటనే వచ్చాడు.

"ఈయన మా మామయ్య కొన్నిరోజులు ఇక్కడే ఉంటారు" నికుంజబాబు చెప్పాడు.

"మంచిదండి"

"అరే – అచ్చం మనిషిలా మాట్లాడుతున్నాడు" నివారణ్ బెనర్జి ఆశ్చర్యపడ్డాడు.

"మంచిది, నాకు కొన్ని వేడినీళ్ళు పెట్టగలవా? స్నానం చెయ్యాలని వుంది. వర్షాల తరువాత చలిగా ఉంటోంది – అయినా రోజుకు రెండుసార్లు స్నానానికి అలవాటుపడ్డాను."

"అలాగేనండి" అనుకూల్ తనకు అప్పగించిన పని చెయ్యడానికి వెళ్ళిపోయాడు.

నివారణ్‌బాబు రాక తరువాత కూడా ఆయన మేనల్లుడి వ్యాపారంలో ఎలాంటి ప్రగతి కనిపించలేదు. నికుంజబాబు స్నేహితులు మాత్రం సాయంత్రానికి ఇంటికి రావడం మానేశారు. పెద్దవాడి ముందు రమ్మి, పోకర్ వంటి ఆటలు సభ్యత అనిపించుకోదు. అంతేగాక, నికుంజబాబు దగ్గర పేకాట ఆడటానికి డబ్బుకూడా లేదు ఇప్పుడు.

మామయ్య ఎన్ని రోజులు ఉండబోతున్నాడో చెప్పటం కష్టం, ఇంతకుముందు తనకు ఇష్టమయినప్పుడు వచ్చి వెళ్ళేవాడు. ఈసారి కొన్నిరోజులపాటు ఉండిపోయేట్లున్నాడు. అందుకు కారణం అనుకూల్. అనుకూల్ ఆయనను ఒకేసారి ఆకర్షిస్తూ, వికర్షిస్తున్నాడు. అనుకూల్ పనిచేసే విధానంలో తప్పుపట్టడానికి ఏమీలేదని ఆయన కూడా ఒప్పుకున్నాడు. అదే సమయంలో ఒక మామూలు పనివాడికి మర్యాద ఎందుకివ్వాలో ఆయనకు అర్థం కావటంలేదు.

ఒకరోజు మేనల్లుడితో చెప్పాడు, "నిజంగా నీ, పనివాడు అప్పుడప్పుడు నాకు ఇబ్బంది కలిగిస్తున్నాడు."

"ఏం,ఏం జరిగింది?" నికుంజబాబు అడిగాడు.

"నేను ఒకరోజు 'గీత'లో పద్యాలు చదువుతూ ఉంటే నీ పనిమనిషి వచ్చి నన్ను సరిదిద్దబోయాడు. నేను చదివేది తప్పే అయినా నన్ను సరిదిద్దడానికి అతనెవ్వరు?ఇదేమీ బాగోలేదు. చెంపమీద ఒకటి ఇచ్చుకుందామనుకున్నాను. కాని నన్ను నేను సంభాలించుకున్నాను."

"వద్దు, వద్దు, మామయ్య మీరు చెయ్యి ఎత్తనే కూడదు – దానివల్ల చాలా పెద్ద ప్రమాదమే జరుగుతుంది. అతడు చుట్టపక్కల ఉన్నప్పుడు ఏమీ మాట్లాడకపోతే మంచిది."

నివారణ్‌బాబు తనలో తను గొణుక్కొంటూ వెళ్ళిపోయాడు.

రోజులు గడుస్తున్నకొద్దీ నికుంజబాబు ఆదాయం తగ్గిపోసాగింది. అనుకూల్ కోసం నెలసరి అద్దె కట్టడం కష్టమయిపోతోంది. ఒకరోజు, ఈ విషయం అనుకూల్‌కు చెప్పకుండా ఉండలేకపోయాడు.

"అనుకూల్, నా వ్యాపారం సరిగ్గా సాగటం లేదు"

"నాకు తెలుసు"

"అవును, నీకు తెలిసే ఉంటుంది. నిన్ను ఇంకా ఎంతకాలం నా దగ్గర ఉంచుకోగలనో తెలియదు. నాకు నిన్ను వదిలిపెట్టాలని లేదు. కానీ..."

"ఈ విషయం నన్ను కాస్త ఆలోచించనివ్వండి.

"దేనిగురించి ఆలోచిస్తావు?"

"ఈ సమస్యకు పరిష్కారం ఉందేమో."

"నీ ఆలోచన ఎలా ఉపయోగపడుతుంది? వ్యాపారం చెయ్యడం నీ పరిధిలోకి రాదు కదా?"

"రాదు. అయినా నన్ను ప్రయత్నించనివ్వండి"

"అలాగే, కానీ నిన్ను ఎక్కువకాలం అట్టేపెట్టుకోవడం కుదరకపోవచ్చు. ఆ విషయమే నీకు చెప్పాలని అనుకున్నాను."

"అలాగేనండి"

రెండునెలలు గడిచాయి. ఆ రోజు ఆదివారం. అనుకూల్‌ను రెండు నెలలు కనాకష్టంమీద తన దగ్గరే ఉంచుకోవచ్చని నికుంజబాబు లెక్కలు తేల్చాయి. ఆ తరువాత, తను మామూలు పనిమనిషిని వెతుక్కోవాలి. నిజానికి

పనిమనిషి కోసం వెదకడం మొదలుపెట్టాడు కూడా. అతనికి చాలా దిగులుగా ఉంది. దానికి తోడు బయట వర్షం దంచేస్తోంది. నికుంజబాబు వార్తాపత్రిక పక్కన పడేశాడు. అనుకూల్‌ను టీ తీసుకురమ్మని ఆడగాలనుకుంటున్నప్పుడే, అనుకూల్ అక్కడికి వచ్చాడు.

"ఏమయింది అనుకూల్?"

"ఒక యాక్సిడెంట్ జరిగిందండి"

"యాక్సిడెంటా? ఏం జరిగింది?"

"మీ మామయ్య కిటికీ పక్కన నించుని టాగూరు వర్షంమీద రాసిన పాట పాడుతున్నారు. ఆయన కొన్ని పదాలు తప్పుగా పాడుతుండటం చూశాను. సరిచెయ్యడం నా బాధ్యత అనుకున్నాను. దాంతో ఆయనకు కోపం వచ్చింది. ఈసారి నన్ను చెంపదెబ్బ కొట్టారు. నేను తిరిగి బదులు ఇచ్చాను."

"బదులు ఇచ్చావా?"

"అవును ఆయనకు హైవోల్టేజి షాక్ ఇవ్వాల్సి వచ్చింది."

"అంటే....?"

"ఆయన చనిపోయారు. కానీ, నేను షాక్ ఇచ్చినపుడు ఆకాశం ఉరిమింది."

"అవును. నేను విన్నాను"

"అందువల్ల, ఆయన మరణానికి దారితీసిన అసలు కారణం మీరు ఎవరికీ చెప్పనక్కరలేదు."

"కానీ...."

"బాధపడకండి. ఇది మీకు చాలా మేలు చేస్తుంది"

చేసింది కూడా. మామయ్య చనిపోయిన రెండురోజుల తరువాత నికుంజబాబుకు మామయ్య లాయరు భాస్కర్‌బోస్ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. నివారణ్‌బాబు తన ఆస్తినంతా మేనల్లుడి పేరుమీద రాయించారు. దానిమొత్తం విలువ పదిలక్షల రూపాయలు పైనే ఉంటుంది.



కావ్య
పబ్లిషింగ్ హౌస్

సత్యజిత్ రే కథలు

₹ 60/-

ISBN 978-93-83057-05-4